

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

10-3-78
75 పైసలు







పసి బిడ్డకు
జీర్ణసంబంధమైన
బాధలు కలిగినప్పుడు...

సౌమ్యంగా పనిచేసే

అమృతాంజన్ గ్రైప్ మిక్స్చర్

బాధను అతి త్వరగా తగ్గిస్తుంది



గృహౌషధములు
తయారుచేయుటలో
తరతరాలుగా
నమ్మకకు పాత్రమైన
అమృతాంజన్ వారి
తయారి.

కడుపునొప్పి, అజీర్ణము, వాయువు, పళ్ళు పచ్చేటప్పుడు కలిగేబాధలు మొదలైన వాటిలో దేనితోనైనా సరే, మీ పసిబిడ్డ బాధ పడుతూంటే అమృతాంజన్ గ్రైప్ మిక్స్చర్‌తో అతి త్వరగా ఉపశమనం కల్గించండి త్వరగా సులభంగా తిరిగి మీ పసిబిడ్డ ఆనందంగా నవ్వుతుంది.

అమృతాంజన్ లిమిటెడ్

OBM 3410 TG


చేసి చూపిస్తేనే
నమ్ముతారెవరైనా
మా కంపెనీకి
ఎమల్షన్ పెయింటు మీద
20% పైగా ఆదా
చేశాను తెలుసా!
సూపర్ డెకోప్లాస్ట్—
ఎమల్షన్ సౌందర్యానికి
పెట్టింది పేరు
"ఆఫీసు అందంగా ఉండాలని ఎమల్షన్ పెయింటే వేయిద్దామని పట్టుపట్టాను నేను. కాని, బోలెడు ఖర్చు అవుతుందేమోనని మావాళ్ళు మొదట భయపడ్డారు. సూపర్ డెకోప్లాస్ట్ వేయిస్తే ఖర్చులో 20% పైగా కలిసొస్తుందని నేను నిరూపించినప్పుడు మావాళ్ళకు ఆశ్చర్యంతో నోటంట మాట రాలేదంటే నమ్మండి! నామాటే ఎందుకు, వాడిచూస్తే మీరే నమ్ముతారు. సూపర్ డెకోప్లాస్ట్ వేయిస్తే అందానికి అందం, పొదుపుకి పొదుపు."
DECOPLAST
సూపర్
డెకోప్లాస్ట్
ఏషియన్ పెయింట్స్
CASAP 79-244 TEL

ఆంధ్రసచిత్రవారపత్రిక


వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాధుని
నాగేశ్వరరావు పంతులుగారు
స్థాపితం : 1908
శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు :
[1938-1972]
శుక్రవారం : 10-3-'78
పింగళనామ సం. ఫాల్గుణ శు. పాడ్యమి
సంపుటము 71 : సంచిక 25
సంపాదకుడు
శివలెంక రాధాకృష్ణ
*
పోస్టులో ఏడాది చందా రు. 41-60
ఆరు మాసాల చందా రు. 20-80
విడి ప్రతి వెల 75 పైసలు
ఆంధ్రపత్రిక కార్యాలయము
గాంధీనగరం, విజయవాడ-520 003


విషయానుక్రమణిక

అట్టమీద బొమ్మ
కన్నడ మంజుల
[ఫోటో : ఎం. ఏ. ...]

కథలు : కథలు :

వ్యాసాలు, శీర్షికలు :


Brooke Bond
Green Label
Blend of Coffee & Chicory
Coffee 53% Chicory 47%
Nett Weight when packed 500 g.
Brooke Bond India Limited
P.O. Box 187, Calcutta-1
సదా యుక్తమైనది
సదా సారమైనది



ఉత్తరాలు

అట్టమీద బొమ్మ

మీ (ఏా) 17—2—78వ తేదీ ఆంధ్ర సచిత్ర వార పత్రిక ముఖ చిత్రంగా వెలువడిన వాణిశ్రీ ముమ్మూర్తిలో ఆకర్షించింది. ఇలాంటి ముఖ చిత్రం వెలువడినందుకు మీకు నాయొక్క హృదయ పూర్వకాభినందనములు, నా అభిమాన తారని ఇంకోసారి ప్రచురించగలరు. అయితే కథలు అడవి సముద్రం ఎంతో విచిత్రంగా వుంది. చీకటి చిమ్మే దీపము చాలా మంచిగా ఉంది.

గుండా సాంబశివరావు (చింతకాని)

* * *

21—2—78 నాటి ముఖచిత్రం 19—8—77 నాటి హెలెన్ ముఖచిత్రాన్ని జ్ఞాపకానికి తెచ్చింది. మీరు ముఖచిత్రం ముద్రించడంలో తీసుకొంటున్న శ్రద్ధ ముఖచిత్రం ఎన్నిక విషయంలో కూడా తీసుకొంటే బాగుంటుంది. ఇకపోతే ఈ వారం ప్రచురించిన కథల్లో రకుంతల—పేకాట కథ పేకాట ప్రియులకి అర్థమవుతుందేమోగాని మాకేమి అర్థం కాలేదు మిగిలినమూడుకథలు బాగానే ఉన్నాయి.

డి. ఉదయకుమార్, (కుర్ధారోడ్)

కార్టూన్లు

24—2—78 వార పత్రికలో ప్రచురించిన కార్టూన్సులో శ్రీ షాదార్కి, రాము కృష్ణలు వేసినవి బాగున్నవి.

అమరోజు వీరబ్రహ్మం, (తెనాలి)

ఉత్తరాలు

టీనేజర్స్ స్టార్ మీనాక్షి ఆనంద్ (న్యూఫైండ్) 24—2—78 పత్రిక ముఖ చిత్రంగా వెలువడి, యువ హృదయాలను, తన సెక్సీ అప్పీల్‌తో స్పందింప చేసింది. మన తారలనేగాక, హిందీ తారలను కూడా ముఖ చిత్రాలుగా అందించడం ఎంతో ముదావహం.


బచ్చు వీరరాజు (రాజమండ్రి)

కథలు

24—2—78 పత్రిక ముఖచిత్రం ఏమియూ బాగుగాలేదు కొత్త జీవితం (పెద్దకథ) చాలా ఉత్సాహంగ, ఆసక్తికరంగా వున్నది. సీరియల్, రాగమాలిక చాలా ఇంటరెస్టుగా సాగిపోవుచున్నది, ఫిల్మోత్సవ్—78 విశేషాలు, ఆంధ్ర సచిత్ర వార పత్రిక ద్వారా తెలుసుకొనుటకు చాలా సంతోషము.

జె. రత్నంశ్రేష్టి (తాడిపత్రి)

(50వ పేజీ చూడండి)



కొత్త జీవితం

వేదగిరి రాంబాబు, మైనంపాటి భాస్కర్

(గత సంచిక తరువాయి)

భార్యకి భర్తలో వున్న, భర్తకి భార్యలో వున్న మంచిగుణాలకన్నా బలహీనతలు తెల్సుకోవల్సిన అవసరమెంతో వుంది! అలా తెలుసుకుంటే ఒకళ్ళో బలహీనతకి లోనైనప్పుడు రెండోవాళ్ళు వాళ్ళనాబలహీనత నించీ బయటికి లాగడానికి ప్రయత్నించవచ్చు రెండర్థభాగాలూ కలుస్తేనే నిండైన జీవితమయ్యేది! నా జీవితం నిండు జీవితమే సందేహం లేదు ...

"ఏంటాలోచిస్తున్నారు ?." అడిగింది మృణాళిని.

"నీ గురించే" నవ్వాను

"నా గురించా...? ఏంటట అంత ఆలోచించే ఆ విషయం ?"

"నీ ప్రవేశంతో నా జీవితానికి పూర్తి సార్థకత చేకూరింది"

"చాల్లెండి. మిమ్మల్ని కదిలిస్తే చాలు పొగడ్తలు. మీరు మరీ భట్రాజులై పోతున్నారండి"

"పొగడ్త కాదు మృణా! పచ్చినిజం."

"ఇందులో పెద్ద విశేషమేమీలేదు. ప్రతీ భార్యా భర్త విషయంలో చూపించే శ్రద్ధే నేనూ చూపిస్తున్నాను అంతే!" పొగడ్తలామెకి గిట్టవు. అదో ప్రత్యేకత.

తిరిగి తిరిగి ఎనిమిది గంటల ప్రాంతంలో ఇంటికి చేరుకున్నాం. తర్వాత వంట ... కబుర్లు... నిద్ర...

ఆ రోజాఫీసులో ఏదో అర్జంటు పనుండి రాత్రి ఏడుగంటల దాకా బయట పడ్లేక పోయాను. ఆ తర్వాత బస్సుకోసం చూట్టం చికాకనిపించింది.

ఆటోలో బయల్దేరి వచ్చేసాను.

మృణాళినితో సర్దాగా కబుర్లు చెప్పాల్సిన టైమ్‌లో అప్పుడే గంట వేస్టయింది. బస్సుకోసం వెయిట్‌చేసి మరోగంట వేస్ట్ చెయ్యడం ఇష్టంలేకపోయింది.

గుమ్మంలో నిల్చొనెదురు చూస్తోంది మృణాళిని.

మొహం పాలిపోయి వుంది. కళ్ళల్లో భయం కొట్టొచ్చినట్లు కనబడుతోంది.

నవ్వొచ్చింది నాకు!

రెండు గంటలు కూడా ఆలస్యంకాలేదు .త భయమా!

"అమ్మయ్య! వచ్చేశారా! ఇంతసేపైనా మీరు రాకపోయేసరికి ఎంత భయపడిపోయానో!"

"ఎందుకోయ్ పిచ్చీ!" లాలనగా అన్నాను. నేను వచ్చేసినా ఆమె కళ్ళల్లో భయం ఇంకా తగ్గలేదు. దగ్గరకి తీసుకుని ఆ కళ్ళమీద ముద్దు పెట్టుకోవాలనిపించింది. కానీ ఆమె గుమ్మంలో నిలబడ్డంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకుని ఆమె వెనకే లోపలికి నడిచాను.

"ఇంకెప్పుడూ ఇంతాలస్యం చెయ్యకండి. ఎంత భయం వేసిందో తెల్సా నాకు? ఎన్ని రకాల ఆలోచనొచ్చాయో... అమ్మో..." ఇంకా భయంగానే అంది.

నవ్వాను.

"కాళ్ళూ చేతులు కడుక్కుని, గుడ్డలు మార్చుకోండి భోజనం వడ్డిస్తాను" అంది.

"వన్‌మినిట్ నువ్వు భోజనం అనగానే గుర్తు కొచ్చింది. సిగిరెట్లైపోయాయ్. తీసుకోవాలనుకునే మర్చిపోయాను. ఇప్పుడే గడ్డియ్య కొట్లో తెచ్చుకుంటాను" చెప్పలేసుకుని బయల్దేరాను పదును చూపొకటి చూసి వంటింట్లోకి వెళ్ళిపోయింది మృణాళిని.

నన్ను చూడగానే గడ్డియ్య 'ఫోర్‌స్క్వేర్' సిగిరెట్లు తీసిచ్చాడు చిల్లరిస్తూ "విశ్వం సాబ్ తెల్సాసార్ మీకు?" ప్రశ్నార్థకంగా అడిగాడు.

"ఏ విశ్వం ..." చటుక్కున గుర్తు కొచ్చాడు. అవును అతనే!

"...కొద్దిగా పరిచయముంది ఎందుకూ?" అతనలా ఎందుకడిగాడో అర్థంగాక అడిగాను.

"కాచిగూడ దగ్గర వురుకుతున్న బస్సెక్కబోయిండంట జారి కిందపడి పోయిండు. కాళ్ళదగ్గర నించీ నడుంవాకా బొక్కలిర్గిపోయినై. పాపం శానా మంచి యనసార్. అక్కడికక్కడే పోయిండంట ... పాపం! ఆ యమ్మ బతుకు ఖరాబై పోయింది..." బాధగా అన్నాడు.

విశ్వం .ఆ నయనానందకరమైన జంటలోని సగభాగం ... బస్సు కిందపడి చనిపోయాడా? అయ్యో ఎంత దారుణం జరిగిపోయింది! ఇంక అక్కడ నిలబడలేకపోయాను...

అక్కడ్నించీ ఇంటికెలా చేరానో కూడా నాకు సరిగ్గా తెలీదు వాకిట్లో పడక్కుర్చీలో వాలి, కళ్ళు మూసుకున్నాను.

ఇలా ఎలా జరిగింది ?

ప్రపంచంలోని ఆనందమంతా ఒక్కచోటే గూడు కట్టుకు చేరిందనుకున్నాను. విషాదపు ఛాయలు వాళ్ళమీదపడ్డం అసంభవమనుకున్నాను నవ్వుతూ, తుళ్ళుతూ ఎంత హాయిగా వుండేవాళ్ళు! ఎంత మంచి మనిషి ఎంత దారుణ మరణం పాలయ్యాడు!

దేముడా! ఎందుకిలా జరిగింది ?

ప్రతిమనిషి జీవితంలో ఏదో లోటు వుండితీరాలా? ఈ భూమ్మీద పుట్టినవాడెప్పుడూ ఆనందంగా వుంటానికి వీల్లేదా? ప్రతీ ఇంటిలోనూ ఏవో కొన్ని ఇబ్బందులో, కష్టాలో, నిట్టూర్పులో వుండి తీరాలా?

అతను లేకుండా ఆమె జీవించగలదా? ఎంతదెబ్బ తగిలిందమ్మా నీకు! ఆమెని తల్చుకుంటే గుండెలు చిక్కబడుతున్నాయ్.

బౌద్ధుల అష్టాంగ మార్గము — ధర్మ పథం — బులుసు వేంకటరమణయ్య

ఆత్మాను భూతికి సాధనాలైన అష్టాంగ యోగాలు మన యోగశాస్త్రంలో చెప్పబడి ఉన్నవి. అవిధంగానే బౌద్ధమతంలోనూ అష్టాంగాలు చెప్పబడినవి. అవి సంయమనియమాదుల కంటె వేరైనవి. మానవునిలోని దుర్గుణాలను నిర్మూలించుటకు తగిన మార్గాలవి— సమ్యగ్ దృష్టి, సమ్యక్సంకల్పం, సమ్యగ్వాక్కు, సమ్యక్కర్మ, సమ్యగ్ జీవం, సమ్యగ్వ్యాయామం, సమ్యక్స్మృతి, సమ్యక్సమాధి. అనేవి వీనిలో ఒకదానితో మరొకదానికి అధికమైన సంబంధం ఉన్నది.

సమ్యగ్ దృష్టి మేలైన— అంటే పవిత్రమైన చూపు. మొదట పట్టుబడవలసినది యిదే! మానవునికి ఉదారమైన దృష్టి ఉంటేనే గాని మనోవాక్కాయ కర్మలలోని మాలిన్యం నశించదు.

ఆతరువాతది సమ్యక్సంకల్పం. సమ్యగ్దృష్టి అలవడిన తర్వాత మానసిక సంస్కారం ఏర్పడి ఇది కలుగుతుంది. ఏ సత్కార్యాని కయినా — అసత్కార్యానికయినా సంకల్పం అవసరం. మానవునికి సత్సంకల్పమ్ అవసరం. చతురార్య సత్యాలను ఫలితావస్థకు తెచ్చుకొనే యత్నమే యీసమ్యక్ సంకల్పం.

మూడవది సమ్యగ్వాక్కు. మానవునికి ఉత్తమ సంకల్పం ఉన్నప్పుడు, దానిని ప్రకటించుటకు మాటకూడా పవిత్రమైనదిగానే ఉండవలెను.

సమ్యగ్వాక్కును అలవరచుకొన్న వ్యక్తి అసత్యం పలుకడు. పరుషంగా మాటలాడడు. పరులను నిందించడు. మృదుమధురంగా మాటలాడే వాడిని అందరూ గౌరవిస్తారు.

నాల్గవది సమ్యక్కర్మ. త్రికరణాలలో మనోవాక్కులు ఉత్తమములైనప్పుడు చేసే కర్మకూడా ఉత్తమంగానే ఉంటుంది. ప్రాణిహింస, చౌర్యం మున్నగు చెడ్డపనుల మీదికి బుద్ధి పోనే పోదు.

తర్వాతది సమ్యగ్ జీవం. మానవుడు జీవించడానికి ఏదో ఓ వృత్తిని ఆశ్రయించక తప్పదు. ఆవృత్తి మేలైనదీ, తనకూ, ఇతరులకూ హానిని కలిగించేది కాకూడదు. అట్టి జీవనమే సమ్యగ్ జీవం.

ఆరవది సమ్యగ్ వ్యాయామం చెడ్డ సంకల్పాలను మనస్సులో చేరనియ్యకుండా మనస్సును మంచి ఆలోచనలలో ప్రవేశపెట్టడం సమ్యగ్ వ్యాపారం.

తర్వాతది సమ్యక్ స్మృతి. శరీరం అపవిత్ర పదార్థాలతో నిండినదనే విషయం మరువక, వాటి అనర్థాలను గుర్తించుటయే సమ్యక్ స్మృతి.

చివరిది సమ్యక్సమాధి. పయి సప్త మార్గాల మూలంగా మానవునికి వైరాగ్యం కలుగుతుంది. దాని మూలంగా నిర్వాణాన్ని అంటే ముక్తిని పొందే అవస్థయే సమ్యక్సమాధి. దానివల్ల మానవునికి పునర్జన్మ లేకుండా పోతుంది.

కొత్త జీవితం

“ఏంటే? ఇక్కడ పడుకున్నారు! మీరింకా రాలేదేంటా అనుకుంటున్నాను. వడ్డించాను లేవండి” అంటూ మృణాళిని వచ్చింది.

“మృణా! నాకిప్పుడు అన్నం తినాలని లేదు. కాసేపు మాట్లాడించ బాకు” మనసంతా చిందరవందరగా వుంది. ఎవ్వరితోనూ మాట్లాడాలన్పించడంలేదు.”

“ఏంటండీ అలా వున్నారు! నేనేమైనా బాధ కల్గించానా? చెప్పండి ప్లీజ్... మీరట్లా వుంటే నేను చూళ్ళేను...” ప్రాధేయపడసాగింది.

మృణాళినలా బాధ పడ్తూంటే ఇంకా మాట్లాడకుండా వుండలేకపోయాను ఆమెతో చెప్పుకుంటే మనసుకి కొద్దిగనైనా ఊరట కల్గుతుంది. కానీ ఎలా చెప్పాలి?

“నీకు చూపించాను చూడు చక్కని జంటని ... అందులో అతను - విశ్వం ... సాయంత్రం బస్కిందపడి చనిపోయు ట్ట...” నా మాటలు నాకే ఎబ్బెట్టుగను, నమ్మలేనివిగానూ అన్పించాయి.

మృణాళిని షాక్ తింది ఆ మాటలువిని మొహం విషాదపూరితమైపోయింది. మాటా పలుకూలేకుండాలాగే కూర్చుండిపోయింది. ఆమెక్కూడా వాళ్ళిద్దరూ అన్యోన్యంగా తిరిగిన ఆ జ్ఞాపకాలే గుర్తుకొచ్చినట్లున్నాయ్! కళ్ళు చెమ్మగిల్లాయి. అతని మరణం మాకే ఇంత బాధని కల్గిస్తే ఆమె పరిస్థితెలా వుందో?

ఇద్దరిమధ్యా సరైన అవగాహన లేని వాళ్ళైతే ఆ షాక్కి కొంతవరకైనా తట్టుకోగ్గలు? అతను లేకుండా ఆమె, ఆమె లేకుండా అతను పొరబాటునకూడా బయటికొచ్చేవాళ్ళు కారు. ఎంతో అన్యోన్యంగా చూసేవాళ్ళక్కూడా ముచ్చట గొలిపేటట్లుండేవారు.

ఇంక జీవితాంతం ఆమె అతన్ని చూడకుండా వుండగల్దా? ... నో ... ఆవిడవల్ల కాదా పని. ఒకవేళ ఈ వార్త వినగానే ఆమెకూడా ... ఛీ ... ఛీ ... ఏమిటీ ఇట్లా ఆలోచిస్తున్నాను. నా ఆలోచన్లు నాకే చిరాకేశాయి.

వెంటనే ఆమెని చూడాలని బయల్దేరాను.

“ఇక్కడికి దగ్గరే వాళ్ళిళ్ళు ఇప్పుడే చూసొస్తాను...”

“పాపం...వెళ్ళిరండి...”

గబగబా బయటికొచ్చాను.

—వాళ్ళ సందులోకి ప్రవేశించగానే వో ఇంటిముందు జనం గుంపులు గుంపులుగా గుమికూడి వుండటం కన్పించింది. మామూలు చావుకి అంతమంది ముక్కూమొహం తెలీనివాళ్ళు రారు. ఇది యాక్సిడెంట్! చాలామంది జాలికంటె కుతూహలంతో వచ్చి చూసివెళ్తారు.

అప్పటికే మలక్పేటలో వున్న ఆ అమ్మాయి తల్లిదండ్రులు, ఇంకా వూళ్ళో వున్న బంధువులు వచ్చారు. మరీ దగ్గర వాళ్ళు దిగులుపడి కూర్చుంటే, కొద్దిగా దూరపు బంధువులు ఓదారుస్తున్నారు.

అతని తరపువాళ్ళు విజయవాడ నుంచీ రావాలట. టెలిగ్రామ్ లిచ్చారు. తెల్లారే లోపు రావచ్చును కుంటున్నారు.

ఆమెకోసం చూశానక్కడ.

ఈ వార్త తెలియగానే స్పృహతప్పి పడిపోయిందట. ఇంకా స్పృహ రాలేదట. లోపల గదిలో పడుకోబెట్టారు— ఎవరో ఇంకెవరికో చెప్తుంటే విన్నాను. శవంమీద పూర్తిగా గుడ్డ కప్పేశారు ఇంక అక్కడ నిలబడలేకపోయాను ఇంటికొచ్చేశాను.

ఆ రాత్రి భోజనం చేయాలనిపించలేదు. మృణాళిని కూడా నాతోపాటే అలానే పడుకుంది.

కళ్ళు మూసుకుంటే చాలు అతని నవ్వు మొహం, వాళ్ళిద్దరూ సర్దాగా కబుర్లు చెప్పుకుంటూ వెళ్తున్నట్లు కన్పించసాగింది.

అంత బరువైన బస్సు చక్రాలు మీదెక్కితే ఆ మనిషి బాధతో ఎంతగా తన్నుకుంటాడు! అంత బాధాకరమైన ఆ క్షణంలో అతనికి తప్పక భార్య గుర్తొచ్చుంటుంది. తన శారీరక బాధకన్నా చివరి క్షణంలో ఈ బాధే ఎక్కువగా అనుభవించుంటాడు!

ఆమె ఈ షాక్ నుంచి తిరిగి కోల్కోగలదా?

ఒకవేళ కోల్కున్నా అతని జ్ఞాపకాల్తో పిచ్చిదైపోతుందేమో!

భగవాన్! ఏమిటయ్యా నీ లీల!

...ఆలోచనల్తో బుర్రవేడెక్కిపోయింది.

మనసు బాగా చికాగ్గా వున్నప్పుడు సిగిరెట్లెక్కువగా తాగుతుంటాను. అలా ఆలోచిస్తూ ఎన్ని సిగిరెట్లు తాగానో నాకు తెలీదు. పెట్టెలో సిగిరెట్లైపోయేసరికి అప్పుడనిపించింది 'అప్పుడే సిగిరెట్లైపోయాయా!' అని.

''ఇంక పడుకోండి రెండవుతోంది'' నెమ్మదిగా అంది మృణాళిని. తనకీ నిద్ర పట్టడంలేదు. మా ఇద్దరికీకూడా ఇది పెద్ద షాక్!

మనసు బాగోనప్పుడు సిగరెట్లుండి తీరాలి. లేకపోతే మరింత అప్సెట్టైపోతాను.

''నువ్వు పడుకో నేనిప్పుడే వస్తాను'' బయటికి బయల్దేరాను సిగిరెట్లకోసం.

''ఎక్కడికండీ?'' కంగారుగా అడిగింది మృణాళిని.

''సిగిరెట్లు తెచ్చుకుంటాను'' బయటికొచ్చేశాను.

ఆమె అప్పుడు వద్దనిగాని, మరేమన్నా అన్నాగాని వినేస్థితిలో లేను. ఆమెకూడా అనేస్థితిలో లేదేమో! మరేమీ మాట్లాడలేదు.

బర్కత్‌పురా చౌరాస్తాదాకా నడిచివెళ్ళి వో టీతాగి సిగిరెట్లు తెచ్చుకున్నాను.

ఏ పనిచేస్తున్నా నా ఆలోచన్లు వాళ్ళిద్దరి చుట్టూనే తిరగసాగాయ్!

ఆ రాత్రి అలాగే గడిచిపోయింది.

*   *   *

శారద కన్పించడం లేదు.

స్థలం మార్చాల్సిన అవసరం ఆమెకెంతైనా వుంది. లేకపోతే అతని జ్ఞాపకాల్నే గుర్తుకు తెచ్చుకుంటూ ఆమె కోలుకోలేదు. అందుకనే ఆమెని వాళ్ళ నాన్నగారింటికి తీసుకెళ్ళుంటారు కన్పించడం లేదు.

ఇప్పుడామె ఎలావుందో? ఆ మాట తల్చుకుంటేనే గుండెలు జలదరిస్తున్నాయ్!

తర్వాత తెలిసింది ఆ ఇంటిని ఖాళీ చేయించి ఆమెని మలక్‌పేటలోనున్న వాళ్ళింటికి తీసుకుపోయార్ట వాళ్ళ నాన్నగారు.

ఆ అఘాతం నాకు ప్రత్యక్షంగా తగిలిందికాదు కాబట్టి క్రమక్రమంగా బాధ మర్చిపోగల్గాను. కానీ అప్పుడప్పుడూ గుర్తొచ్చినప్పుడు మనసు కలుక్కుమంటూనే వుంది.

మామూలుగా ఆఫీసుకి బయల్దేరే టైమ్‌లో బయల్దేరితే వాళ్ళిద్దరూ గుర్తొస్తున్నారు అందుకని ఆ టైమ్‌కి కాస్త ముందే బయల్దేరడం ప్రారంభించాను. అదీగాకుండా బస్సుని శంకరమఠం దగ్గర కాకుండా నల్లకుంటలో ఎక్కడం మొదలు పెట్టాను.

రోజులు గడుస్తున్నకొద్దీ మనసులోని గాయం మానుపట్టం ప్రారంభించింది.

మృణాళిని సాహచర్యంలో బాధలన్నింటినీ దూరంగా త్రోసి ఆనందంగా పరుగులెడుతున్నాయ్ రోజులు. క్రమక్రమంగా నెలలుగా మారిపోతున్నాయ్!

ఆ రోజు ఆఫీసు నించీ ఇంటికొస్తూ అలవాటు ప్రకారం గడ్డియ్య షాపు దగ్గర ఆగాను.


మామూలుగా ఫోర్‌స్క్వేర్ సిగిరెట్లందించాడు.

నెలాఖరు రోజులు. అందుకని జేబులో నోట్లు లేవు. చిల్లర లెక్కబెట్టిచ్చాను.

మృణాళిని దగ్గర మరో వింత అలవాటుంది.

ఏదైనా నోట్ మార్చగా వచ్చిన చిల్లర్ని సూట్‌కేసులో అడుగున పడేస్తుంది. ఒక చోట గుర్తుగాకాదు— సూట్‌కేసులో బట్టలమధ్య, ఏదో ఒక మూల!

నెలలో మొదటి మూడు వారాలు డబ్బుకి పెద్దగా తడుముకోవల్సిన అవసరం వుండదు. ఆ తర్వాత సూట్‌కేస్ దులుపుతాం చిన్నా పెద్దా నాణెలు సందుల్లోంచి జారిపడుతూంటే నిధులు, నిక్షేపాలు దొరికినట్లే వుంటుంది నెలాఖరుకి ఆ చిల్లర



కృష్ణార్జునులు కాబోతున్న గవాస్కర్-విశ్వనాథ్ లు

భారత క్రికెట్ ఓపెనింగ్ బ్యాట్స్‌మేన్ సునీల్ గవాస్కర్, అగ్రస్థాయి బ్యాట్స్‌మేన్ గుండప్ప విశ్వనాథ్ బావ బావమరుదులు కాబోతున్నారు. 1978 మార్చి 27వతేదీన గవాస్కర్ చెల్లెలు కవితా మనోహర్‌కి గుండప్ప విశ్వనాథ్‌కు వివాహము నిశ్చయమైంది. బొంబాయిలో ఈ వివాహము వైభవంగా జరుగుతుంది. విశ్వనాథ్ సంవత్సరంన్నర క్రితం నుంచి యీ ప్రయత్నంలోనే వున్నారు. కాని క్రిందటి సంవత్సరం అక్టోబరులోనే రెండు కుటుంబాల పెద్దల మధ్య అంగీకారం కుదిరింది.

గవాస్కర్‌ల కుటుంబానికి చేపలంటే ఇష్టం. విశ్వనాథ్ కుటుంబం గట్టి శాకాహారులు. విశ్వనాథ్ కు చేపలంటే ఇష్టం వుండదు కాని తతిమ్మావాటిని ఎక్కువగా తింటూ వుంటాడు. విశ్వనాథ్ ఇంటిలో కవిత శాకాహారాన్నే వండాలి. శాకాహారిగానే వుండాలి. ఈ దంపతులు బయట తమ స్నేహితులతో మాత్రం మాంసాహారాన్ని భుజించవచ్చును!

నాణేలు మేముహించనంత పెద్ద మొత్తాలై మమ్మల్నెంతో ఆదుకునేవి ?

గడ్డియ్య చిల్లర తీసుకున్నాడు.

"దునియా ఎట్లా మారిపోయింది చూశారాసార్ ?" అడిగాడు.

"ఏమైంది ?" ఏదో చెప్పడానికి అతని ఉపోద్ఘాతం ఆ ప్రశ్న అంచుకే వెంటనే అసలు విషయం కోసం అలా అడిగాను. ఆ ప్రశ్న వెయ్యకపోతే ఉపోద్ఘాతం పెరిగిపోయే ప్రమాదముంది.

"ఆ యమ్మకి మళ్ళీ లగ్గంటగదా ?"

"ఏ అమ్మకి ?"

"ఆ యమ్మేసార్! ఆ పక్క గల్లీలో వుండేవారు సూడండి! మొగుడు కాచీగూడ దగ్గర యాక్సిడెంట్లో పోయాడు... రోజూ పొద్దునా, సాయంత్రం ఇటుగానే వెళ్ళేవారు కదా సార్..."

షాక్ తగిలినట్లైంది.

ఆమె... ఆమె... శారద !

శారద...శారద...మళ్ళీ పెళ్ళి చేసుకుంటోంది !

ఛ...ఛ... అది జరగదు. ఇతను పొరబాటు పడుంటాడు. అతనే ఆమె ... ఆమే అతను ! అతను పోయి ఇంకా సంవత్సరం కూడా కాలేదు. ఇంతలోనే ఆమె అతణ్ని మర్చిపోయి మరొకతన్ని వివాహం చేసుకోబోతోందా ?

అసంభవం ...

ఇది నేనేకాదు— వాళ్ళతో పరిచయముండక్కర్లేదు వాళ్ళని చూసినవాళ్ళు కూడా నమ్మరు, నమ్మలేరు. —

కొత్త జీవితం

నా మొహంలోని భావాల్ని చదివేసినట్టున్నాడతను

"నిజంగానే దొరా! ఆమెకి పెళ్ళంట! అతను రైల్వేలో పనిజేస్తున్నాడంట...వచ్చే బేస్తవారమే లగ్గం. బాలాజీ భవన్లోట. ఆమె తండ్రి వచ్చి ఇదివరకున్న ఇంటివాళ్ళని పిల్చివెళ్ళాట్ట. ఆయనొచ్చి సిగిరెట్లు కొంటూ మరొకాయనతో చెప్తుంటే నేను విన్నాను. నాకూ ఆమేనా? కాదా ? అని అనుమానం వేసి అడిగాను. ఆమేనని చెప్పాడాయన! ఆయనే కాదు ఆమె పనిజేసే ఆఫీసులోనే పనిజేసె ఇంకొకాయన కూడా చెప్పాడీ విషయం. ఆయనకూడా మన కొట్లోకొస్తుంటాడు."

ఇక అక్కడ నిలబడలేకపోయాను.

'ఏ ఇంట్లో ఏం జరుగుతోంది? ఎక్కడ ఏమి విశేషం?—అని గ్రహించే తెలివితేటలు కొంతమందికే వుంటాయ్' నా మటుకు నాకా తెలివిలేదు ఆ విషయంలో గడ్డియ్య అపరిమితమైన తెలివిగలవాడు. ఆ ప్రాంతంలో ఏం జరిగినా అతనికి తెలియాల్సిందే!

...ఆ ప్రాంతంలోవున్న వాళ్ళ విషయాలే కాదు, ఇదివరకు వుండిపోయిన వాళ్ళ విషయాలుకూడా అతనికి క్షుణ్ణంగా తెలుస్తూ వుంటాయన్న విషయం అప్పుడే తెల్సింది!

అతను వ్యాపారంకోసం అక్కడ కొట్టు పెట్టాడా? లేకపోతే ఇక్కడుండే మనుషుల ప్రవర్తన గురించి తెల్సుకోడానికి బడ్డీ కొట్టు పెట్టుకున్నాడా? అనే అనుమానం ఇంతకుముందుకూడా ఎన్నోసార్లు వచ్చింది.

ఆసక్తిగా ప్రతీ విషయం గమనించడమే కాదు—అంత ఆసక్తిగా ఆ విషయాన్ని తన దగ్గరకి వచ్చిన వాళ్ళందరికీ చెప్తాడు !

దానివల్ల అతనికేమైనా లాభముందా ?

ఏమో —!

అతను కాస్త చదువుకునుంటే మంచి విలేఖరై వుండేవాడు, లేకపోతే గొప్ప డిటెక్టివన్నా అయుండేవాడు!

— శారద పెళ్ళి!

మళ్ళీ పెళ్ళి చేసుకుంటోంది శారద!

అంత ప్రేమగా చూసుకునే భర్త చనిపోగానే ఆమె గుండెలు పగిలిపోతాయ్, ఇంక జీవితంలో ఆమెకు దుఃఖం తప్ప మరేమీ మిగల్లేదనుకున్నాడు!

ఆమె మొహంలో కుంకుమే కాదు చిరునవ్వు కూడా శాశ్వతంగా చెరిగిపోయిందనుకున్నాడు!

'అతనింక తనకి కన్పించడు!' ఈ విషయం ఆమె మనసుని చెదరగొట్టేసి పిచ్చిదాన్ని చేస్తుందనుకున్నాడు. ఒకవేళ బాధ భరించలేక తనువు చాలించినా చాలిస్తుందనుకున్నాడు!

కానీ... కానీ...

ఆమెకి పిచ్చెక్కలేదు.

చనిపోలేదు.

సుబ్బరంగా అతన్ని మర్చిపోయింది!

మామూలుగా కే ఆఫీసుకెళ్తోందిట.

మరికొన్ని రోజులుపోతే విశ్వం స్థానంలో మరో మగాడ్నేసుకుని నవ్వుతూ, పిచ్చుపడుతూ తిరుగుతుంది!

ఆమె గుండె పగిలిపోతుందనుకున్నాడు కాని కొత్త లయతో కొట్టుకుంటుందనుకోలేదు!

మొహానికి కుంకుమ పెట్టుకోబోతోంది.

ఈ వరస చూస్తుంటే పెదాలకి చిరునవ్వేకాదు లిప్‌స్టిక్ పులుముకున్నా ఆశ్చర్యపడనవసరములేదు!

ప్రేమ, అభిమానం, అనురాగం— ఆమె భాషలో వీటికర్థాలేంటో ?

నిజజీవితంలో వాటికి నిజంగా స్థానం లేదేమో ?

ఆమేకాదు— అక్కడ మరో ఆడమనిషున్నా అలానే చేస్తుందా...

ఏం ఆడవాళ్ళు!

"ఛా!" కసిగా వుమ్మేసి గుమ్మంలోకి అడుగు పెట్టాను.

అక్కడే తారట్లాడుతోంది మృణాళిని...

ఆమె నా కోసం అలా ఎదురు చూస్తుంటే రోజూలా ఆనందం, తృప్తి కల్గడంలేదు వైరాగ్యం, నిర్లిప్తత కల్గుతున్నాయ్!

ఒకవేళ నేను చనిపోతే మృణాళిని కూడా శారద లాగావే చేస్తుందా! శారదకిలా చేయడానికి దాదాపు సంవత్సరంకావల్సొస్తే ఈమె కెంతకాలం కావాలో ...? కనీసం సంవత్సరమున్నా ఆగుతుందా లేకపోతే ...

చిరాగ్గా వరండాలోవున్న పడక్కుర్చీలో కూలబడ్డాను. ఆలోచన్లెటో పరుగెడుతున్నాయ్...

మనిషి ప్రక్కనున్న వ్వాళ్లేనేమో ఎవరికైనా ఈ ప్రేమలు, అభిమానాలూను!

మృణాళిని ఏదో అడగాలని దగ్గర కొచ్చింది.

కళ్లు మూసుకున్నాను.

మౌనం...

రెండు నిముషాలు గడిచిపోయాయి.

"ఇదిగోనండీ కాఫీ" కళ్లు తెరిచాను.

చింత దీక్షగా ఆమె మొహంలోకి చూసినా నాక్కనిపించింది అమాయకత్తో కూడిన ప్రేమే!

కాఫీ తాగకుండా గ్లాసుని పక్కనే బెట్టాను. మృణాళిని వయోమయంగా చూస్తోంది నా వంక. ఇంటికొచ్చి ఆమెని చూసింతర్వాత మనసింకా పిచ్చిగా అయిపోయింది.

ఈ అన్యోన్యత, ప్రేమ, అనురాగం — ఏన్నాళ్ళు?

"కాఫీ తాగండి" నెమ్మదిగా అంది.

"మృణా! నే మాటడుగుతాను నిజం చెప్పు. నేను చచ్చిపోతే నువ్వు మళ్లీ పెళ్లి చేసుకోడానికి ఎన్నాళ్ల వ్యవధి కావాలి?" నా గొంతు నాకే భయంకరంగా వినబడుతోంది.

నిర్ఘాంతపోయింది.

"చెప్పు..." పెద్దగా అరిచాను.

"ఆ దౌర్భాగ్యుడు విశ్వంలేడూ...బస్సు కిందపడి చచ్చిపోయాడు ... వాడి పెళ్లాం మహాపతివ్రత, అనుకూలవతి! వాళ్లది గొప్ప ఆదర్శ దాంపత్యంలే! అందుకనే ఆ నిర్భాగ్యుడ్ని మనంకూడా ఇంకా మర్చిపోలేదు ఆమె మళ్లీ పెళ్లి చేసుకుంటోంది. మళ్లీ ఎదురుకోళ్ళు, వేడుకలు, కన్యాదానాలు, అలక పాన్పులు, శోభనం రాత్రులూను.

చెప్పు, మృణా... రేపొకవేళ నేను చచ్చిపోయానే అనుకో నువ్వు వెంటనే పెళ్లి చేసుకుంటావా?... అలాంటి వుద్దేశమే వుంటే ఇప్పట్నించే మరోవాణ్ణెవణ్ణో నా నిర్ణయించి పెట్టుకో. శారదలాగా అన్నాళ్ళు వెయిట్ చెయ్యాల్సిన అవసరముండదు..." కర్కశంగా మనసులో లావాలాగా పొంగుతున్న భావాలన్నింటినీ బయటి కెళ్లగక్కేశాను.

వళ్ళు వేడెక్కిపోయింది, జ్వరం వచ్చినట్లుంది.

"ఏమిటీ... శారదకి మళ్లీ పెళ్ళా...?"

"ఏం... ఆశ్చర్యమేముంది? ఆ నాటక మైపోయింది. కొత్త నాటక మాడబోతోంది! అందులో విశ్వం హీరో.ఇందులో మరొకడు హీరో! మహా నటిలే! సీత, సావిత్రి, అనసూయ మొదలైన వాళ్ళందరి వేషాలూ ఒకేసారి వేసేస్తుంది! మహా ఉదాత్తంగా నటించేస్తుంది... మంచినీళ్ళు తాగినంత తేలిగ్గా. న్యాలోజులాగాక మనమంతా చక్కగా మరో నాటకాన్ని చూడొచ్చు వోహో స్థలం మారిపోయింది కదూ! పోన్లే ప్రేక్షకులు కూడా మారిపోతారు. నాలాంటి మరి కొంతమంది వెధవలు ధిల్‌తో చూస్తారు, తరిస్తారు."

"కోపం తగ్గించుకుని సరిగ్గా చెప్పండి అసలేం జరిగింది?"

ఆవేశాన్ని చంపుకుని అతి బలవంతాన అంతా చెప్పేశాను.

"ఇప్పుడు చెప్పు మృణా! నిజంగా చెప్పు. నేను ఒకపోళ చచ్చిపోతే నన్ను వెంటనే మర్చిపోతావ్ కదూ? అప్పుడీ అభిమానం, ప్రేమ—ఇవన్నీ పిచ్చిగా అనిపిస్తాయి కదూ? నిజం చెప్పు..." మాటలు పెగలడంలేదు. కన్నీటి పొర కప్పేసి మృణాళిని మొహంలోని భావాలు సరిగ్గా కన్పించడం లేదు.

మృణాళిని మాట్లాడకుండా లేచి—వాకిలి తలుపేసి వచ్చింది. నన్ను లోపలికి తీసుకెళ్లి మంచంమీద పడుకోబెట్టింది. తను పక్కనే కూర్చుని నా తలమీద రాస్తూ—


"ఎంత సున్నిత మనస్కులండీ మీరు! దేవుడు మనల్ని చల్లగా చూస్తాడు. పది కాలాలపాటు హాయిగా వుంటాం. ఏవరో దురదృష్ట జాతకులకైనట్లు మన కెందుకు జరుగుతుంది? మీరు లేకుండా నేను ఒక్క క్షణం కూడా ఈ ప్రపంచంలో వుండలేను" ఆమె కళ్లవెంట కన్నీళ్ళు రాలి నా తలమీద పడ్డాయ్.

మనసులో ఎన్నో భయాలు, అనుమానాలు...

ఆలోచించలేక తలని ఆమె గుండెల్లో దాచుకున్నాను.

"నువ్వు లేకుండా నేనూ బ్రతకలేను మృణా..."

"నేను మాత్రం బ్రతగ్గలనా?" అంది మృణాళిని పమిట చెంగుతో నా మొహం తుడుస్తూ.



కొత్త జీవితం

ఆమె అలా లాలిస్తుంటే కన్నీళ్లు విపరీతంగా వచ్చేస్తున్నాయ్. మనసులోని భయాన్నంతా ఆమె దగ్గర అలా కన్నీళ్ళ రూపంలో బయటికి నెట్టేస్తూ ఓదార్పు పొందాను..

* * *

నా మనసుని పూర్తిగా చదివేయగలది కాబట్టే మృణాలిని అప్పట్నించీ నన్ను మరింత సున్నితంగా చూసుకోవడం మొదలు పెట్టింది.

ఆమె ఆదరణ, ఆప్యాయత నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఆమె సాన్నిధ్యంలో ఎంతో మానసికానందాన్ననుభవిస్తున్నాను.

జన్మ జన్మలకీ ఆమే నా భార్యగా కావాలి.

ప్రతి చిన్న విషయానికి అతిగా ఆలోచించి విపరీతమైన మానసిక క్షోభ ననుభవించే బలహీనత నాలో వుంది. అటువంటప్పుడు అమితంగా ఆదరించి వోదార్చే తోడు కావాలి. మంచిలోను, చెడులోను, సంతోషంలోనూ, దుఃఖంలోనూ మృణాలిని ఎంతో అండగా నిలుస్తుంది. అటువంటి భార్య దొరకడం అదృష్టం కాదామరి!

రోజులామె సాహచర్యంలో ఎంతో హాయిగా గడిచి పోతున్నాయి.

"సాయంత్రం ఆఫీసు నించీ పెందరాడే వస్తారు కదూ?"! ఆ రోజాఫీసుకి బయల్దేరుతుంటే అంది మృణాలిని.

ఆమెని కాసేపు వుడికించాలనిపించింది.

"లేదు ఇవాళ కొద్దిగా లేటవుతుంది. మా ఫ్రెండొకరు పార్టీ ఇస్తున్నాడు" అన్నానామెని చిలిపిగా చూస్తూ.

నా చూపులో ఆమె నన్ను చదివేసినట్టుంది.

"సర్లెండి. ఇవాళ రాత్రి మొదటాట సినిమాకి నేను, రాణి వెళ్తున్నాం ... వంట వండేసే వెళ్తాను..."

నా గుండెల్లో రాయి పడింది. కొంప తీసి నే నన్నమాటలు నిజమనుకొని ఈమె పక్కింటి రాణితో సినిమాకి చెక్కేయదుకదా!

"అబ్బే... వూరికే అన్నాను...మామూలుగానే వచ్చేస్తాను."

భళ్ళున నవ్వేసింది.

న్యూట్రాన్ బాంబు వల్ల కణితి వ్యాధి

న్యూట్రాన్ బాంబు అతి ప్రమాదకరమైన వ్యాధిని వ్యాప్తిచేసే ఆయుధమని సోవియట్ వైద్యశాస్త్ర పరిషత్ ఉపాధ్యక్షులు అలెగ్జాండర్ పావులోవ్, నొవోస్తి విలేఖరితో వ్యాఖ్యానించారు.

మానవుల్లో కణితి వ్యాధిని చికిత్స చేసే సామర్థ్యం న్యూట్రాన్ ధార్మిక శక్తికివుంది. కాని న్యూట్రాన్‌బాంబు యజమానులు దీనిని ఆయుధంగా రూపొందించారు. న్యూట్రాన్ బాంబు ప్రేలినప్పుడు విడుదలయ్యే న్యూట్రాన్ల దానివాతపడిన వ్యక్తుల్లో అతితీవ్ర ధార్మిక వ్యాధి సోకుతుంది. 'గామా' కిరణాలకన్నా దీని ప్రభావం చాలా ఎక్కువ.

ఈ న్యూట్రాన్ ధార్మికశక్తినుంచి రక్షణ ఏర్పాటు చేసుకోలేని అమాయిక ప్రాణాలు ముఖ్యంగా ఈ సామూహిక విధ్వంసక న్యూట్రాన్ బాంబు వాత పడతారని ఎకడమీషియన్ పావులోవ్ పేర్కొన్నారు. న్యూట్రానులు సోకిన వారికి మరణం తప్పదు. యీ చావు గంటలా, రోజులా, వారాలా అన్నది ఏ మోతాదులో ధార్మికశక్తి సోకిందో దానిమీద ఆధారపడి వుంటుంది. మొదట మెదడు దెబ్బ తింటుంది. వాంతులు ప్రారంభమవుతాయి. కళ్లు తిరిగి పడిపోతారు. డీలాపడిపోతారు. ధార్మికశక్తి సోకినవారు 48గంటలలో మరణిస్తారు. ఒకవేళ ధార్మిక శక్తి ఎక్కువ మోతాదులో సోకితే చిన్న ప్రేవులు ముందుగా దెబ్బతింటాయి. అక్కడినుండి దీని ప్రభావం మెదడుకు వ్యాపించి మరణానికి దారితీస్తుంది. నీళ్ళ విరోచనాలు ప్రారంభమై శరీరంలో నీరు హరించుకు పోతుంది. న్యూట్రాన్ బాంబు ధార్మికశక్తి యొక్క అవశేషం తాకిడి నేలపై, భవనాలపై, ముఖ్యంగా లోహ పదార్థాలపై వుంటుంది. దీని మూలంగా, న్యూట్రాన్ ధార్మిక శక్తి సోకిన ప్రజలకు సకాలంలో సహాయం అందదని పావ్‌లోవ్ తెలియ జేశారు.

[సో.వా.సం:]

"నేనూ వూరికే అన్నాను. మీరు లేకుండా నేనెక్కడికైనా వెళ్తానుటండీ?"

నిజమే! నేను లేకుండా తనెక్కడికీ వెళ్లదు. ఆ విషయం తెల్సికూడా అనవసరంగా కంగారుపడి పోయాను.

"మాష్టారూ! మీరివాళ పెందరాడే వస్తే మనం బజారు వెళ్ళాలి.

"ఎందుకూ?"

"బావుంది! రామాయణమంతా విని రాముడికి సీతేమవుతుంది అన్నార్ట వెనకటికి మీలాంటివారే ఎవరో! స్వామీ ఎల్లుండి మీ పుట్టింరోజు. ఇవాళ సాయంత్రమైనా గుడ్డలు తీసుకుని టైలరు కివ్వకపోతే ఎల్లుండికందవు."

"నా కిప్పుడు గుడ్డలెందుకు మృణా! సర్దాగా పుట్టింరోజు చేసుకోడానికి నే నేమైనా పిల్లాణ్ణా?"

"అహాఁ... కాదు ముసలాళ్ళు!" సీరియస్‌గా మొహం పెట్టేసింది. ఆమెనలా చూసేసరికి నవ్వాపుకోలేక పోయాను. గట్టిగా నవ్వేశాను.

"ఎందుకూ నవ్వుతారు?"

"నా ఇష్టం. నేను నవ్వుకోవడం ఎందుకో కూడా నీకు చెప్పాలా?" చిరుకోపాన్ని ప్రదర్శించాను.

"అక్కర్లేదులెండి. నాకేమీ చెప్పనక్కర్లేదు. మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండి" గిరుక్కున వెళ్ళి మంచంమీద పడుకుంది. కళ్లనీళ్ళు బలవంతాన నొక్కిపడుతోంది. జాలేసింది.

"మృణా! నా సంగతి నీకు తెలీదా? సర్దాగా ఏడిపిస్తే అంత బాధపడిపోతావెందుకు?" ఆమె పక్కనే కూర్చుని తల నిమురుతూ అన్నాను.

చెయ్యి నెట్టేసి పక్కకి తిరిగిపడుకుంది

"మృణా! ప్లీజ్... అలా వుండకు... నువ్వలా వుంటే నే నాఫీసు కెళ్లలేను..." నెమ్మదిగా ఆమె మొహాన్ని పక్కకు తిప్పుకున్నాను.

కిసుక్కున నవ్వేసింది.

కొంగుతో కళ్ళు తుడుకుంటూ లేచి కూర్చుంది.

చటుక్కున దగ్గరకి లాక్కున్నాను.

నా గుండెలమీద వాలిపోయింది.

"నామీద కోపం పోయిందా?" ఒక చేత్తో ఆమె నడుముని చుట్టేసి, మరో చేత్తో ఆమె తల నిమురుతూ అన్నాను.

"ఛ! మీమీద నా క్కోపమేమిటండీ?"

"కోపం కాకపోతే అలక...!"

"పోలేదు, పోదు" రక్కున నా నుంచి దూరంగా జరుగుతూ అంది.

"అదేంటి?"

"అదంతా నే చెప్పిన వాటికి 'యస్' అంటేనే..."

"చూడు మృణా! నువ్వన్నదాని కెప్పుడైనా 'నో' అన్నానా? మేడమ్! అయామ్ ఆల్వేజ్ ఎట్ యువర్ డిస్పోజల్" లేచి వినయంగా నించొని అన్నాను.

"సరే సాయంత్రం ఆరుగంటలకల్లా ఇక్కడుండండి: వెళ్లండి ఆఫీసుకి" తనూ లేచి నుంచుని గంభీరంగా అంది. కానీ ఆ గంభీరమంతా చివరక్షరం నోట్లోంచి వచ్చి రాకముందే నవ్వుగా మారిపోయింది నేనూ నవ్వేశాను.

"మరి ఆఫీసుకి టైమైపోయింది వస్తా..." అద్దంలో మరోసారి చూసుకుని, తల చేత్తో సర్దుకుని బయల్దేరాను.

తనూ వాకిట్లోకి వచ్చింది.

ఆమెను వదలి వెళ్లాలంటే అడుగులు ముందుకు పట్టంలేదు. రెండడుగు లేసి వెనక్కి తిరిగాను.

ఆమె అక్కడే నించొని చెయ్యూపింది.

నేనూ చెయ్యూపి త్వరత్వరగా బయల్దేరాను.

కొంత దూరం పోయింతర్వాత గుర్తుకొచ్చింది గడ్డియ్య కొట్లో సిగరెట్లు కొనలేదని. ఒక్క క్షణం వెనక్కి రావాలనిపించింది కాని శంకరమఠం దగ్గర తీసుకోవచ్చు లెమ్మని నడక వేగం హెచ్చించాను.

(ఇంకా వుంది)

మంథా వెంకట రమణారావు

'బరువు'



"గాజులు ! గాజులేయ్ !" అన్న కేకకు ప్రతిధ్వనిగా, "గాజులు ! గాజులు !" అంటూ మరో చిన్నకేక

కావడి మోస్తూ ఒక మనిషి — కావడి మొయ్యకుండా ముందు నడుస్తూ ఒక మనిషి. కావడి మోసేవాడు కూలీ ! కావడి ముందు వాడు యజమాని !

యజమాని షెరాయి, కమీజూ, కాళ్ళకి జోళ్ళు వేసుకున్నాడు—మే నెల ఎండ తగలకుండా గొడుగు వేసుకున్నాడు. గడ్డం, ముస్లిమ్ సాంప్రదాయ ప్రకారం ఒక పావు అంగుళం మొలిచి ఉంది. అక్కడక్కడ నెరసిన వెంట్రుకలు— బుగ్గలో కారాకిళ్ళీ తుపుక్ తుపుక్ మని అప్పుడప్పుడూ రోడ్డు మీద కిళ్ళీ రసాన్ని ఉమ్మి తున్నాడు. కిళ్ళీలోని జర్దాపాన్ ఒంటికి నిషా ఇవ్వగా మహా హుషారుగా అడుగులు వేసుకుంటూ నిముష నిముషానికి "గాజులు ! గాజులు!" అంటూ నడుస్తున్నాడు.

కావడిలో రెండు పెద్ద ట్రంకు పెట్టెల నిండా ఉన్న గాజులని ఇటూ అటూ పెట్టి మోస్తున్నాడు కూలీ. గబగబా చిన్న పరుగుతో నడుస్తూ ఉండే కుదుపుకి రెండు పెట్టెలూ లయబద్ధంగా కిందకీ మీదికీ కదులుతూ కడ కడ, కడ కడ మని చప్పుడు చేస్తున్నాయి. కావిడిబద్ద ఎడంభుజంమ్మీద బాగా మోసింది. పెద్ద గరుడపక్షి రెక్కలు రాటించినట్టు కిర్రు కిర్రు మని చప్పుడు చేస్తూ కిందామీదా అవుతోంది కావిడిబద్ద.

కూలీ ఒంటిమీద చొక్కాలేదు, బనియ

నన్నాలేదు తలకి పాగాలేదు. కాళ్ళకి చెప్పులు లేవు నడుమునుంచీ, మోకాళ్ల వరకూ మర్యాద కాపాడ్డాని కన్నట్టు, ధూళి పట్టి మరకలుపడ్డ ఒక పొట్టి చిరుగుల పంచ ఉంది. ఆ పంచ వెడల్పు మూడు అడుగులు— పొడవు ఆరడుగులు. నడుం చుట్టూ వో చుట్టు చుట్టి, గోచీ కచ్చ కట్టేడు. వాడి తొడల నలుపు కనిపిస్తోంది పంచ లోంచి. ఒళ్ళు గురుకుదేరిన నల్ల సీనం రాయిలా ఉంది.

కూలీ చర్మంలోంచి చెమట చిమ్మి ఒంటిని తడుపుతోంది. బిందువు పుట్ట గానే సూర్యకాంతి పడి ముత్యంలా మెరిసి కరిగి పారుతోంది. ఎన్నో ముత్యాలు—ఎన్నో ధారలు. కూలి వెంట్రుకలు పండలేదు — కాని ముఖం ముడతలవల్ల వయసు యాభై పైన అని తెలుస్తోంది. బరువు వల్లా, నడక అలసటవల్లా ముక్కుపుటాలు ఎగిసి కావిడిబద్ద ఆనేచోట కాయ కట్టింది. పూజ ఎద్దుకిలా. కాళ్ల పిక్కలమీద నరాలు పైకి ఎగతన్నేయి ఎన్నోవేల మైళ్లు నడిచి నడిచి కాళ్ల పాదాల చర్మం, మనిషి చర్మంతో కుట్టిన చెప్పుల్లా తయా రయ్యేయి.

ముందు నడుస్తున్న మనిషి పేరు మాలిక్ మియా బరువు మోస్తున్న కూలీ పేరు తవిటయ్య మాలిక్ అంటే దేవుడని అర్థముంది; యజమాని, అధికారి అని కూడా అర్థాలున్నాయి. కాని దేవుడు తన మాలిక్ గిరీ కొందరు మనుష్యుల కప్పగించే సేడు... రాజుల కాలంలో రాజులకీ— ఈ కాలంలో మంత్రులకీ, డిక్టేటర్లకీ—మదుపు పెట్టి పరిశ్రమలూ, వ్యాపారాలూ నడిపే వాళ్లకి, బ్యూరోక్రాట్లకీ—వీరు అధికారాన్ని కొంత అప్పగించగా. వాళ్ళు వారి కిందవారికి కొంత అధికారం వెదజల్లగా, వాళ్ళు వాళ్ళ కిందవాళ్ళకి... అలా అలా, పవరూ పైసా పరపతీ ఉన్న ప్రతివాడూ ఛోటా మాలిక్‌గా తయారయ్యేడు అలా భగవంతుడే అసలు మాలిక్ అయినా అతడు ఈ కోటానుకోట్ల జీవుల ద్వారా తన యాజమాన్యాన్ని నిరూపించుకుంటున్నాడు.

అదే విధంగా, బరువు మోస్తూ నడిచే కూలీకి, ముందు నడిచే యజమాని మాలిక్.

బాబులందరూ ఆఫీసులకిపోయి, అమ్మ లందరూ అన్నంతిని కబుర్లాడుకునే వేళ మధ్యాహ్నం రెండు. ఆ రెండు గంటల వేళ ప్పుడు కావిడి భుజానవేసి నడక ఆరంభిస్తే సాయంత్రం ఆరు వరకూ నాలుగు గంటల మోత. నడక! ఎవరన్నా "ఏయ్‌గాజులూ!" అని పిలిస్తే ఆ యింట ప్రవేశించి గాజుల కావడి దించడం జరుగుతుంది. అప్పుడు కూలిపని ఆఖరు. యజమానిపని మొదలు— క్షణకాలం బరువునించి విముక్తి!

చాలా మంది అమ్మలు, అమ్మాయిలు పిలిచి, చూసి, బేరంచేసి. మూతులు విరుచుకొని, "అబ్బే! షాపులో యింతకన్నాచవగ్గా యింతకన్న మంచి గాజులు దొరుకుతున్నాయి!" అని పంపించేస్తారు. కావిడి భుజాన వేసుకుని మళ్ళా నడక ప్రారంభం.


ఇవాళ రెండు గంటలనించీ, నాలుగు వరకూ మోత అయింది కాని ఎవరూ పిలవలేదు. "గాజులు గాజులేయ్!" కేక వేసేడు తవిటి ఆర్తనాదం చేస్తున్నట్టు.

ఔను ఆర్తనాదమే! మూడు రోజులయి కూలీడబ్బు లివ్వలేదు మాలిక్ మియా. నాలుగు గంటలు బరువు మోస్తూ పరుగు లిసినందుకు రోజుకి కూలీ రెండు రూపాయలు. బేరం ఉన్ననాడు ఇస్తాడు—లేనినాడు బాకీ పెడతాడు. బాకీ డబ్బు వసూలు కష్టం! ఇప్పుడో అర్ధా, అప్పుడోరూపాయీ ఇస్తాడు. రెండ్రోజులయి బేరంలేదు... అందుకు కూలిడబ్బు లందలేదు.

ఈ పట్నంలోని రెండుపేటలు లిరగడం అయింది అలసటతో ఎగిస్వాస వచ్చేస్తోంది. మాలిక్ ఇంతవరకూ ఒక కప్పు 'టీ' అన్నా పోయించలేదు. నిన్నట్నించి పస్తు— ఇవాళ పకాళ తినేదు... అంబలి తాగలేదు— ఊరవతల సీవేజ్ కాలవ పక్కన వేసుకున్న పాకలోని తన సంసారమూ తనలానే పస్తు లుంది పెళ్లాం, కూతురూ, ఇద్దరు కొడుకులూ సంసారం. ఇదివరకు పెళ్లాం అసిరి పాచిపన్లుచేసి తనూ ఆర్జించేది. రెండు సంవత్సరాలయి పాకలోనే పడుంది. సాయంత్రాలుజ్వరం; దగ్గు నిత్యం. ఓ డాక్టరమ్మ ఇంట గాజులమ్ముతూ (కోడలికి) సంగతి చెప్పగా ఆదివారం తెమ్మంది అసిరిని. లక్షణాలన్నీ చూసి "క్షయ" అని చెప్పింది. రోగం ఏమిటో ఉత్తనే చెప్పింది కాని, మందు ఉత్తనే ఇవ్వదుకదా? వచ్చే కూలి లోంచి నాటు మందులు కొని వాడేడు. రక్తం పడడం ఆరంభం అవడం తప్ప మెరుగు పడలేదు — మంచంమీది పడుంది. ఎప్పుడో వోనాడు గుటుక్కుమంటుంది.

పెద్దపిల్ల నూకాలు పెద్దమనిషయి ఆరేళ్లయింది. వో ఇళ్లుకట్టే కంట్రాక్టర్ దగ్గర కూలిపని చేస్తుంది పని ఉన్నప్పుడు రోజుకు రెండు కూలి. సిమ్మెంటు లేదుట. కట్టడం పనులన్నీ ఆగిపోయేయి. బాకీలు పెట్టి ఆ కంట్రాక్టరు మాయమయ్యేడు. అదీ ఇంటి దగ్గర కూసుంది. ఏదో వో రోజున వో మగాడ్ని తీసుక లేచి పోతుంది తప్పదు... ఎందరో దానికంట పడ్తారు...

ఇంక ఇద్దరు కొడుకులూ... చదువులేక సంధ్యలేక... ఫైటింగు సినిమాలు చూసి దొంగతనం ఆరంభించేరు— వో రోజు



సినిమాహాల్ దగ్గర సైకిల్ చోరీచేస్తూ దొరికిపోయి జైల్లో పడ్డారు... మరో ఆర్నెల్లవరకూ రారు...!

"గాజులు... గజులేయ్!" మొయ్యడమే కాక అరవడం కూడా పనిలోని భాగం. దాహంతో గొంతుక ఆర్చుక పోతోంది. ఎండ కారంలా ఒంటికి పూత పూస్తోంది వేడిని.

"రోజుకి' పది రూపాయలిస్తాను... నీ అసిరికి వొయిద్యం చేయిస్తాను... నీ కూతుర్ని నా కప్పగించీరా తవిటిగా! ఆయిగ కాలుమీద కాలేసుక్కూకో! అడ్మాన్ను ఐదొందలు సేతులెడతాను!" అంటూ మంతనాలు జరపబోయింది వేశ్యల కంపెనీ నడిపే పాపమ్మ. ఎన్నో పాపాలు చేసిన పాపమ్మ ఇలా ఒక కుటుంబాన్ని ఆదుకొని పుణ్యం సంపాదించుకోవా లనుకుంది. తవిటయ్య... "ఛీ!దూ! నాపేణంపోవాల! మరెపుడూ యీ కబురు సెప్పకు!" అన్నాడు. గాజుల బేరానికి పాపమ్మ కంపెనీ మంచి కష్టమర్. తరవాత పాపమ్మ మాలిక్ మియా దగ్గర గాజులు కొనడం మానింది.

"వో కప్పు టీ యిప్పించు మాలిక్ బాబా!" తవిటయ్య ఆయాసపడుతూ అన్నాడు–

"అప్పుడే అల్సిపోయేవా? సరేపద!" అన్నాడు మాలిక్ మియా ఏ కళలోఉన్నాడో

వీధి కొసని ఒక టీ దుకాణం వుంది. పొయిలో కుంపటిమీద ఎల్యూమినియమ్ గిన్నెలో పాలతో కలిసిన నీళ్ళు మరుగుతున్నాయి. మాసిన కాకీ నిక్కరు తొడుక్కున్న పన్నెండేళ్ల కుర్రాడు సిసింద్రీలా వుషారుగా పనిచేస్తున్నాడు. చకచకా అరు పెద్ద చెమ్చాల పంచదారవేసేడు నీళ్లలో. పంచదారని నీరు జీర్ణింపజేసుకున్నాక, నాలుగు చెంచాల డస్ట్ టీ గుండ వేసేసరికి బుస్ మని కషాయం మీదికి పొంగింది. కనిపిస్తే అందరూ తాగేస్తారని భయపడిందేమో మళ్ళా కిందకి దిగిపోయింది. వో రెండు నిముషాలు కళపెళ మరగనిచ్చి కెటిల్‌లోకి వడబోసేడు. కెటెల్ మూత పెట్టి. అక్కడున్న మూడు ఔన్సుల గ్లాసులలోకి, ఔన్సున్నర చొప్పున పోసి కష్టమర్లకి అందించేడు.

గాజులు కావడి బరువు దిగింది. నుదుట

బరువు

పట్టిన చెమటని వేళ్ళతో తుడుచుకున్నాడు, తవిటయ్య. "హో గళాసుడు నీళ్ళియ్యి!" ఆర్డరిచ్చేడు మాలిక్. "టీ ఇచ్చేదేటి గాజుల గురూ!" అడిగేడు సిసింద్రీ. "ముందు నీరియ్యి... తరువాత రెండు హాఫ్ టీ ఇయ్యి!" చిరాగ్గా అన్నాడు మాలిక్ మియా.

రెండు పెద్ద ఎల్యూమినియమ్ గళాసులు కుండలో ముంచి నీళ్లిచ్చేడు సిసింద్రీ. గ్లాసులు సొట్టలుపడి ఉన్నాయి. సొట్టలకి మకిలి పట్టింది. ఆ నీళ్లతో ముఖం కడుక్కొని, చేతిలో నీరు పోసుకుంటు తాగి, మరికొన్ని నీళ్ల డిగేడు తవిటయ్య. "నీల్లు దొరకడంనేదు! టిఫినన్నా జేసుంటే మర్రెండు గళాసుల్ని లిద్దును!" అని గొణిగి, వో అరగ్లాసుడు నీరు పోసేడు సిసింద్రీ.

రెండు చిన్న గ్లాసులు అరచేతిలో నొక్కిపట్టుకొని, 'టీ' కెటిల్‌లోంచి ఔన్సున్నర చొప్పున పోసి అందించేడు సిసింద్రి, మాలిక్‌కీ, కూలికీ.

"వొర్సాలు పడ్డంనేదేటి!? యేడి జబర్దస్తీగా ఉంది!" అన్నాడో టీ పానీయుడు. "యేడి బొక్కబద్దలు కొడుతన్నాది..." వొర్సాలు గూడా జబరుగుంటయి!"అని ఘాటుగా వాతావరణ జ్యోతిష్యం చెప్పేడు, 'టీ'కి రెండోపట్టు పట్టేసరికి అయిపోగా "ఏటెంత తక్కువిచ్చినావ్!" అంటూ తోక తగిల్చి మీసాల నాయుడు... చుట్టకోసం జేబు తడుముకుంటూ—

"ఈ యేళ బేరమేనేదు!" అన్నాడు తవిటయ్య టీ చప్పరిస్తూ విచారంగా.

"మగ నా కొడుకులు గాజు లేయించుకుంటే నీ గాజులకి మంచి గిరాకీ!" ఒక విట్టు విస్టేడు రాజబాబులా కనిపిస్తున్న వో కుర్రాడు. "యిపుడు వేయించుకోలేదా మగాళ్ళు గాజులు? కానయితే యీ గాజులు పైకి కనిపించవ్!" -అన్నాడు పత్రికలోని "సామాన్యుడి సణుగుడు" లోని విసుర్ని టీతో సహా ఎంజాయ్ చేసిన వో పిల్ల సైజు పొలిటికల్ కమెంటేటర్ పత్రిక ముడిచేస్తూ— "యీ ఫేషన్లొచ్చి సేక గాజులు చెల్లడంనేదు బాబా!" అన్నాడు

మారిక్. "గాజు గాజులు సరసానికి పనికి రావయ్యా ?" మరొక మధ్య వయస్కుడు. "ఏం బాబూ ?" "చప్పుడు చేస్తాయి ... విరుగుతాయి...గుచ్చుకుంటాయి... గుప్‌చిప్ వ్యవహారాలెక్కువ కదయ్యా ఇవాళా రేపు? అందుకు గుప్‌చప్ గాజులు కావాలి.," "అవీ ఉన్నాయి బాబూ ! తమరిల్లు ఇక్కడేనేటి బాబూ ?" "మాకు గుప్‌చప్ వ్యవహారాలు లేవోయి !" "గాజు గాజులు కూడా ఉన్నాయండి !" "వొద్దు లేవయ్యా..."

టీ తాగడం అయింది, సరిగ్గా ముప్పయి పైసలు తీసి ఇచ్చేడు మారిక్.

కావడి తవిటి భుజంమ్మీదికి వెళింది. "గాజులు గాజులేయ్ !" మారిక్ అరవగా ..."గాజులోయ్ గాజులు!" అంటూ టీ ఇచ్చిన శక్తితో అరిచేడు తవిటయ్య.

"ఏయ్ గాజులూ !" ఎక్కడ్నించో ఆడ గొంతు. మారిక్ ఆగేడు- ఆశగా వెతికేడు పిలిచే ముఖం కోసం. ఓ మేడ యింటి గడప మీంచి వో పదేళ్ల పిల్ల పిలుస్తోంది. తవిటయ్య మనసులో ఆశ చిగురించింది వో నాలుగురూపాయల గాజులన్నా మేడింటి అమ్మ కొంటే అందులోంచి రెండు రూపాయలు రాబట్టొచ్చు మారిక్ కాళ్ళమీదపడి. ఈ బేరం దక్కాలని దేవుడికి మొక్కేడు. పిలుస్తారు- "ఫలానా రకం గాజులున్నాయా ?" చీర డిజైన్లలా ఎన్నో డిజైన్ల గాజులులొస్తున్నాయి ... ఎన్నని ఉంచడం! లేనివే అడుగుతారు... ఎప్పుడో ఎవరో బంధువు బొంబేనించో, ఢిల్లీనించో వో ఫేన్సీ గాజు వేసుకొస్తుంది- అటువంటి గాజు కోసం తవిటయ్య పెట్టెలు వెతుకుతారు- లేకపోతే పొమ్మంటారు.

కింది భాగంలోని, ముందు గదిలో కావిడి దించేడు తవిటయ్య పెట్టెలోని చిన్న జంబు ఖానా తీసి మారిక్ కూచుందుకి పరిచేడు- తవిటయ్యకి విశ్రాంతి ... మారిక్‌కి పని.

జిగి జిగి మెరిసే జిగినీవాను ప్రౌఢ, మత్సరం వోడుతూ మారిక్‌కి మారిక్‌లా ఆదేశించింది. "ఏమేం రకాలున్నాయో చూపించు !" షాపుల కెళితే అక్కడి గాజుల మనిషిని ఏమండీ అంటారు...ఇంటి కొస్తే ఏకవచన ప్రయోగమే.

"రబ్బరు వున్నాయి—లక్క వున్నాయి— గాజూలక్కా కలిసినవీ— పూసలూ లక్కా కలిసినవీ— ఉత్తగాజువీ... రక రకాలున్నాయమ్మా..." "చూపించండి" ... 'చూడండి...'

గాజులు మెరిసి పోతున్నాయి— మురిసి పోతున్నాయి వాటిలో అవి. మురిపించి, లతాలవంగుల, కోమల పల్లవ పాణులను పెనవేసు కుందామని అనుకుంటున్నాయి. సంభాషణ ఇలా నడిచింది— గాజుల బేరం గలగలా ప్రతిధ్వనించింది.

విలా ఈ గాజులు ? రూపాయికి రెండమ్మా ! అంత ఖరీదే ? రూపాయికి

విప్లవకారుడు

హుస్సేన్‌సాగర్ కట్టవిూన
ఒక్కనాటి ఉదయాన
హుష్నారు పుట్టింది
ఉరికిందు, ఉరికిందు, ఉరికిందు,
ఉరికిందు
బోర్లపడి మోకాల్చిప్ప పలిగింది
తలకు దెబ్బ తలిగింది
భోరుమని ఏడ్సిండు
ఐడింగు రాసిండు
ఉష్నారెందుకు ? ఉరుకుడెందుకని ! ?
ఊల్లెకచ్చిండు
తలకు తాకిన దెబ్బ తలపులను
మార్చింది
తలలు తీసుడెందుకు ? తనువులు
సాలిచ్చేదెందుకని
తనోల్లలో కలిసిండు
హైరానెందుకని హర్యానాచద్దర్‌కప్పు
కున్నడు
పరేషానెందుకని పప్పు షారు తాగి
పండుకున్నడు !
—రాజేంద్ర

ఖరీదెక్కడుందమ్మా ? ఏం ? ఎందుకు లేదు ? కిలో బియ్యం రెండున్నరమ్మా — కందిపప్పు నాలుగు— కిలో దుంపలు రూపాయిన్నర—పాలు మూడు రూపాయలు— ఎన్ని రూపాయల గాజులమ్మితే నాకు కిలో బియ్యం డబ్బు. ఈ కూలివాడి కూలీ కిడతాయి చెప్పండి— రెండు రోజులయి కూలి ఇవ్వలేదు నేను... ఇంక ఈ గాజుల విరుగూ తరుగూ ... రోజుకి రెండా కూలి? ఇంత తక్కువా మైగాడ్ ! రిక్షా వాడు మైలుదూరం లేని సినిమా హాలుకి రెండ్రూపాయ లడుగుతాడే ? చూశారా అమ్మా... మీరే ఒప్పుకుంటున్నారు ... రూపాయికి విలువలేదని ! మరి రూపాయికి రెండు గాజులంటే చవకే కదమ్మా ? ఈ ప్రపంచంలో చవకయినవి డబ్బూ, మనుష్యులే... తక్కినవన్నీ ప్రియమేనమ్మా! నన్ను అమ్మా బామ్మా అనకు ... నేను అమ్మనీ అమ్మమ్మనీ కాను— క్షమించండి అమ్మాయిగారూ! ఈ గాజు లెంత? ఒక్కో గాజు రెండ్రూపాయలు అమ్మాయి గారూ ... వాట్ ! రెండ్రూపాయిలే ! ... సిరిసిరిమువ్వ గాజులండి... జయప్రద సిల్మలో యీ గాజులే వేసుకుందండి! అవి తొడుక్క చూడండమ్మగారూ ... జయప్రద పెర్సనాలిటీని మించి పోతారండి ! అందులో మూగదిగా? అయితేనేమండి? గాజుల గలగల ముఖ్యమండి !

ఇలా అరగంట నడిచింది బేరం. ఇంతలో ఐస్‌క్రీం బండివాడు రాగానే పదేళ్ల పిల్లతో సహా మరో ముగ్గురు పిల్లలూ మారాం చేస్తే, పిల్లలమీది ప్రేమపట్టలేక, "కొనుక్కోండమ్మా!" అంటూ పదిరూపాయల కాగితం పర్సులోంచి తీసిచ్చింది జిగినీవాను. అమ్మాయి గారని పిలిపించుకున్న అమ్మగారు. కప్పు ఐస్‌క్రీమ్... పిస్తా కలిసినవి సంబరపడుతూ కొనుక్కున్నారు పిల్లలు— అమ్మకీ ఒకటిచ్చేరు... పెద్ద సైజు కప్పులు... పది రూపాయల కాగితం జేబులో పడేసుకొని బండి తోసుకుంటూ పోయేడు 'క్వాలిటీ' క్రీమ్‌వాడు. బేరాలు లేనేలేవ్... తర్జన భర్జనలు అసలే లేవు... జయప్రదలూ... వాణిశ్రీలూ దింపబడలేదు... నోటు. కాగితపు ముక్కలా విసరబడింది... కప్పులు చేతులలో కొచ్చేయి... క్రీము నోట్లలోకి, చల్లచల్లగా... మెల్లమెల్లగా... స్వీట్ స్వీట్‌గా వెళ్ళింది... ఓ హో! నైస్ !

"ఒద్దయ్యా మాకేం నచ్చలేదు గాజులు షాపుకెళ్ళి కొనుక్కుంటాం..." జిగినీవాను బిగిబిగి భావం పెదవివిరిచి, క్రీమ్ చప్పరించి కళ్లు మూసుకుంది... వలం అయితే అయ్యేరు గాక... ఈ ఆనందం వదులుకోగలనా! సన్నపడమంటారు శ్రీవారు! సారీ పేర్!

బరువు

బరువు తవిటయ్య భుజం ఎక్కింది... "గాజులు... గాజులోయ్!" మాలిక్ అరవగా నీరసంగా... "గాజులోయ్... గాజులు!" తవిటయ్య అరిచేడు. సూర్యుడు పడమటికి దిగిపోతున్నాడు... ఎన్నో వీధులు...ఎన్నెన్నో వీధులు తిరిగేసరికి... ఆరు దాటిపోయింది.

"ఇయ్యాళన్నా నా కూలిప్పించండిదొరా" తవిటయ్య ఒగర్చేడు. సత్తువంతా సన్నగిల్లింది. ఈ బరువు దించి ఇంటి వరకూ ఒంటి బరువుని మొయ్యగలనో లేనో అనుకున్నాడు.

"నువ్వే చూస్తున్నావ్? నాకేమన్నా డబ్బులు కిడితేకదా? నాకులేందే నీకేం ఇస్తాను? ఈ గాజులు అరువు తెచ్చేనుకదా? ఆ హోల్‌సేలర్‌కి నాలుగొందలు బాకీరా! దానిమీద వడ్డీ కూడా ఇచ్చుకోవాలి!

"మాలిక్! రూపాయి డబ్బులు తమకేపాటి! ఓ రూపాయిప్పించండి!" ఆశగా చూసేడు.

"చెట్టుంటే దులుపుదును! రూపాయంటే మాటలా?"

"రూపాయి సవకని ఆయమ్మతో తమరనలేదా దొరా?"

"ఆ యమ్మకి రూపాయి సవకరా! నాక్కాదు! అయిన్‌కీవ్ఁ కిచ్చింది వది! ఓ రూపాయిచ్చి గాజులు కొందిరా? ధరెక్కువుట...! ప్రియవట...! హాయ్ అల్లా!" అని మూలిగేడు మాలిక్...

చీకటి పడిపోయింది... ఓ రూపాయన్నా కళ్ళపడలేదు...

"ఎంకట్రమణా! బుజాల మించీ బరువెప్పుడు దిగుద్ది? ఊపిరాడక అలుపెప్పుడు పోతది? కడుపుల కుసింత గంజి నీరెప్పుడు పడతది? నా బారియ చయరోగ మెప్పుడు మానతది? నా బొట్టె నూకాలెవడ్నో నెగదీసుక పోకండ ఉంటదా?" తవిటయ్య మనసులో లక్ష ప్రశ్నలూ సందేహాలూ — ప్రశ్నలు సందేహాలుగానే ఉండిపోయేయి.

మాలిక్ మియా ఆగేడు, ఒక బ్రహ్మాండమైన ఐడియా రాగా— "తవిటీ! మరిచేపోయేను! బస్‌స్టేండ్ దగ్గర మైదానంలో కార్నివాల్ ఎగ్జిబిషన్ జొతోంది కదరా? అక్కడకెళ్ళి బయట కూచున్నా మంటే గాజులు చెల్లుతాయొరే!"

శంకర పాళీలు

కావలసిన సామానులు : మైదాపిండి — పావుకిలో, గోధుమపిండి— పావుకిలో, పంచదార— ఒకకిలో, నెయ్యి— అరకిలో, పాలు— ఒక గరిటెడు.

తయారుచేయుట : మొదట మైదా పిండినీ, గోధుమ పిండినీ బాగా మెత్తగా జల్లించి, రెండు పిండిలూ కలిపి, అందులో కొద్దిగా నెయ్యీ, పాలూ, కలిపి, బాగా పిసికి, పూరీల పిండిలా గట్టిగా మెత్తగా పిసకాలి. తరువాత, ఈ పిండిని నిమ్మకాయ సైజులో ఉండలుగా చేసుకుని, పల్చగా పెద్దగా అప్పడాలలా వత్తుకోవాలి. ఆ తరువాత, ఆ అప్పడాలను చిన్నచిన్న ముక్కలుగా గుండ్రంగా కానీ, కాజాలుగా కానీ కోసుకునుంచుకోవాలి. అలా అన్నీ కోసుకున్నాక, పంచదారని లేత తీగపాకం పట్టుకు నుంచుకోవాలి. ఆ తరువాత కోసుకుని వుంచుకున్న ఆ ముక్కలను నేతిలో వేసి ఎర్రగా దోరగా వేయించుకుని పాకంలో పడేస్తూండాలి. కొద్దిసేపటికి ఈ ముక్కలు పాకాన్ని పీల్చుకుని, ఉబ్బి, గట్టిపడి కరకర లాడేలా తయారవుతాయి. యివి 3 నెలలు పైగా పాడవకుండా, రుచి చెడకుండా, ఈ శంకర పాళీలు నిలవ ఉంటాయి.

— జి. రామలక్ష్మి.

ఎక్కడ ఎగ్జిబిషను... మరో నాలుగు మైళ్ళ నడక!

మరో అడుగు వెయ్యలేక తవిటయ్య, క్షణక్షణానికి భారమయి పోతున్న కావిడి దించేడు. ఏదురుగా అగపడే, ఎంతకీ తరగని ఎత్తయిన చీకటి దారికేసిచూసేడు.

అలసటతో... నీరసంతో... ఆకలితో... ఎప్పటికీ అంతమవని బెంగతో ... భావి అంటే భయంతో...వర్తమానం అంటే వెరపుతో... ఎప్పటికీ దిగని బరువుతో ... ఆ రోడ్డు మీద కుప్పగా కూలబడి, "నా నింకీ బరువు మొయ్యలేను దేవుడా!" అంటూ ముఖం రెండు చేతులా కప్పుకొని భళ్ళున ఏడ్చినాడు.

రాగమాలిక

శ్రీమతి మాధవపెద్ది పుణ్యశీలాప్రసాద్

(గత సంచిక తరువాయి)

నాకేమౌతోందో నాకే తెలీలేదు. అన్నయ్య గబుక్కున లేచి నేను పడిపోకుండా పట్టుకోవడం లీలగా తెలిసింది నాకు. అంతే!

తరవాత అంతా అంధకారం!

అంధకారంలో రూపం లేని నేను ప్రయాణం చేస్తున్నాను.

అంటే — అంటే — అది నా ఆత్మ అన్న మాట! అంటే నేను చచ్చిపోయాను!!

అయ్యో నా పిల్లలు?

ఏరీ?

ఎవరో ఎదురు వస్తున్నారు. వాళ్ళు చాలా భయంకరంగా వున్నారు. అయితే వాళ్ళు యమదూతలా? చీకట్లో కూడా వాళ్ల భయంకరాకారం స్పష్టంగా కనబడుతోంది.

''అవును. మేము యమదూతలమే! నువ్వు ఘోరమైన పాపం చేశావు పాటి ఆడదాని చావు కోరుకున్నావు. నీ మొగుణ్ని మానసికంగా చాలా బాధించావు. నీ దురభిమానంతో నీ మొగుణ్ని చిత్రహింస చేశావు. నువ్వు శాశ్వతంగా నరకంలోనే వుండాలి. వుండాల్సిందే!''

''నేను బతికివుండగానే నరకయాతనంతా అనుభవించాను గదా?'' నా ఆత్మ ప్రశ్నించింది.

''అది చాలదు. అది చాలా స్వల్పం. రా—రా—'' వాళ్ళు నా ఆత్మని ఎక్కడికో అగాధంలోకి ఈడ్చుకుపోవడం ప్రారంభించారు.

నేను ఆ బాధ భరించలేక పెద్దగా అరుస్తున్నాను.

''అమ్మా సుధా—నాన్నా మధూ—అన్నయ్యా—వదినా—రాధా—రామం...''

ఎవరూ నా మొర ఆలకించడంలేదు. నేను అట్లాగే కుళ్లి కుళ్లి ఏడుస్తున్నాను

అంతలో నా భుజంమీద చెయ్యిపడ్డది ఉలిక్కిపడ్డాను.

బాబ్డ్ హెయిర్ — నీలికళ్లు — గౌనుతో ఒక ఆవిడ — ఆవిడేనేమో — మరి! నా వెనకే నిల్చొని వుంది!

అమాంతం ఆవిడ కాళ్లమీద పడ్డాను నేను

''నన్ను క్షమించమ్మా - నన్ను క్షమించు — తల్లీ! నువ్వు నా భర్తతో సుఖంగా వుండు — నేను నిన్ను మనసారా — ఇది కోరుకుంటున్నాను'' అన్నాను ఏడుస్తూ.

నవ్వూ—ఆశ్చర్యం కదలాడాయి ఆ కళ్లల్లో! తరవాత నాకు కనబడకుండా మాయమైపోయింది — ఆవిడ!

అంతలో — అంతా దివ్యమైన వెలుతురు కమ్ముకుంది భయంకర స్వరూపులు మాయమైపోయారు చీకటితో బాటుగా!

చల్లని చిఱునవ్వుతో ఆ దేవదేవుడు పద్మావతీ రమణుడు — సతీసమేతుడై అభయహస్తంతో దర్శనమిచ్చాడు

నా పెదిమెలు చిఱునవ్వుతో విచ్చుకున్నాయి. రెండు చేతులూ జోడించాను.

ఎవరో 'మంజూ—మంజూ—' అంటూ అతి మెల్లని స్వరంతో పిలుస్తున్నారు.

నెమ్మదిమీద గుర్తుపట్టాను. ఆ గొంతు ఎవినది. మెల్లిగా వదిన స్వరూపం నాకు కనబడింది

''అంతా కలా? నేను చచ్చిపోలేదా?'' మెల్లిగా గొణుక్కున్నారు.

''మంజూ! మెలకువవచ్చిందా? ఇదిగో! కాస్త నోరు తెరు - గ్లూకోజునీళ్లు తాగుదువుగాని.''

''నిజంగానె నేను బతికున్నాను ఔను. నిజమే!'' అనుకుంటూ లేవబోయాను.

వళ్లంతా నొప్పులు!

''లేవద్దమ్మా మంజూ! చాలా నీరసంగా వున్నావు.'' మళ్లీ వదినే అంది.

వదిన పోసిన గ్లూకోజు నీళ్లన్నీ తాగాను.

''నాకేమైంది వదినా? నేను చాలాసేపు నిద్రపోయినట్లున్నాను గదూ? నువ్వెప్పుడు వచ్చావు? బాబిగాడేడి?''

''చెప్తానమ్మా, అన్నీ చెప్తాను. ముందు నువ్వు కాస్త విశ్రాంతి తీసుకో మమ్మల్ని హడలగొట్టేశావు ఈ మూడురోజులూను

నవ్వుతూ అంది వదిన.

ఆ నవ్వులో మరో గొంతు కలిసింది.

అది రాధది.

అప్పుడు చుట్టూ కలియజూశాను. అది నా రూము నేను నా పక్కమీద పడుకొనివున్నాను నా చుట్టూ రామం, పాపతో రాధ, వదిన వున్నారు. బాబు దూరంగా ఆడుకుంటున్నాడు గుమ్మం దగ్గిర

''అన్నయ్యేడి వదినా?'' అడిగాను

''ఊరెళ్లారు—వస్తారు—'' అంది వదిన.

జరిగిన సంఘటనలు గుర్తుకురాసాగాయి!

''అయితే — ఆవిడ పోవడం నిజమేనా — వదినా?''

''నిజమే మంజూ! మీ అన్నయ్య ఇప్పుడు అక్కడే వున్నారు.''

''నువ్వెప్పుడొచ్చావు?''

''ఆ సంగతి వింటూనే నువ్వు స్పృహ తప్పి పడిపోయావుట మీ అన్నయ్య నాకు ట్రంకాల్‌చేసి పిలిపించారు. ఆయనక్కడికి వెళ్లాలిగదా? అయినా అంత షాక్ తిన్నావేం మంజూ? మూడురోజులూ వళ్లెరగని జ్వరం—కలవరింతలు! ఇది దేనికి దారి తీస్తుందోనని చాలా భయపడ్డాం! మేమే కాదు — డాక్టరుగారుకూడా! ఇవాళకూడా స్పృహ రాకపోతే హాస్పిటల్లో చేర్పించవలసివస్తుంది — అన్నారు రామం రాధ నాకు సహాయంగా వున్నారు కాబట్టిగానీ — లేకపోతే — నిజంగా నాకు కాళ్లూ—చేతులూ ఆడలేదు! ఈ మూడురోజులూ మన డాక్టరుగారు ఇక్కడే వున్నారు. ఇప్పుడే అట్లా వెళ్లారు. పోనీలే- ఆ భగవంతుడి దయవల్ల మళ్లీ మనుషుల్లో పడ్డావు— అంతే చాలు!!'' అంది వదిన నా తల నిమురుతూ!

జరిగిన కథ - 10 నిద్రమాత్రలు వేసుకుంటేగానీ నిద్రపట్టని జీవితం మంజులది. సంవత్సరమంతా అంధకారంలో గడిపే మంజుల జీవితంలోకి వెలుగుని తెస్తారు శలవులకి ఇంటికొచ్చే సుధ, మధులు. కానీ అందులోనూ అసంతృప్తే. కొడుకు వస్తే కూతురో, కూతురువస్తే కొడుకో ఎవరో ఒకరు తండ్రిదగ్గర కెళ్లిపోతారు. ఇద్దరూ ఎప్పుడూ కలిసిరారు. చిన్ననాటి స్నేహితుడు రామం కలసి గుర్తుపడ్తాడు మంజులని. రామం భార్య రాధ. బారసాల చేసుకున్న తర్వాత భార్య సుశీలని తీసుకుని చెల్లెలు మంజుల దగ్గరికి వస్తాడు రాజు. మధు అనారోగ్యం మంజులని మరింతగా కృంగదీస్తుంది. రామంతో పెళ్లి కాకముందు తనకోసారి పెళ్లయిందని రాధ నోట విని ఆశ్చర్యపోతుంది మంజుల. రాధ సంగతంతా తెలిసే పెళ్లి చేసుకున్నానుగానీ ఆమెకోసారి పెళ్ళయిందనే విషయం నన్నామెపట్ల రాక్షసుడిలా ప్రవర్తించేలా చేసేది ... అని మంజులతో చెప్తాడు రామం నీ కడుపులో బిడ్డకి తాను తండ్రి కాదన్న రామం మాటలకి మానసికంగా దెబ్బతిన్న రాధ మృత శిశువుని ప్రసవిస్తుంది. నువ్వూ, నాన్న కలిస్తే చాలా బావుంటుందమ్మా అంటూ ఉత్తరం రాస్తుంది సుధ మంజులకి. అమ్మా నాన్నకీ నీకూ మధ్య అసలేం జరిగింది? యెందుకు విడిపోయారు అని అడుగుతుంది సెలవులకి యింటికొచ్చిన సుధ. తనతో కలసి బతకటానికి విముఖత చూపిన రాధని మంజుల దగ్గర దింపుతాడు రామం. మంజుల సహచర్యం రాధలో మార్పు తీసుకొస్తుంది. రాధకు ఆడపిల్ల పుడుతుంది. తన భర్త ప్రేమించి పెళ్లి చేసుకున్న ఆమె క్షయ వ్యాధితో మరణించిందని తెలిసి కలవరపడుతుంది మంజుల.

అంతలో డాక్టరుగారు వచ్చారు.

"ఏమ్మా మంజూ- లేచావా ? హౌ ఆర్ యూ ఫీలింగ్ నౌ?" అంటూ!

*   *   *

మరోవారం వరకు అన్నయ్య రాలేదు

వదిన, రామం, రాధలు నన్ను కంటికి రెప్పలాగా చూసుకున్నారు

నేను కొద్దిగా కోలుకున్నాను.

ఆ 'కల' గుర్తుకువస్తే మాత్రం ఇంకా భయపడిపోతూనే వున్నాను

అది నిజంగా జరిగినట్లేవుంది మరి!

వారం తరవాత ఆవిడకి మన భారతదేశ ఆచార ప్రకారమే దహనక్రియలు దగ్గిరుండి జరిపించి వచ్చాడు అన్నయ్య.

ఆయనే చెప్పారుట -- మన సంప్రదాయ ప్రకారమే జరగాలని!

అన్నయ్య వచ్చాక నాతో ఆ విషయమే మాట్లాడలేదు

నా ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకుని, కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు!

ఏదేమయినా నేను కోలుకుంటున్నందుకు చాలా సంతోషించాడు వాడుకూడా!

నాకు ఆయన ఎట్లావున్నారో అనే ఆదుర్దా పట్టుకుంది. కానీ, అన్నయ్యని అడగలేకపోయాను తరవాత వదినే చెప్పింది నాకు

ఆయన రెండు నెలలు సెలవు పెట్టి, మనశ్శాంతికోసం ఊళ్ళు తిరగడానికి వెళ్ళారని!

నాకేదో తెలియని నిరాశా, బాధా కలిగాయి!

20

నేనుగూడా వదిన బలవంతంమీద కొన్నాళ్ళు సెలవుపెట్టి బెజవాడ వెళ్ళాను అన్నయ్యా వాళ్ళతో సెలవయినాక తిరిగివచ్చినా -- నాకు మనశ్శాంతి దొరకలేదు. ఒకటే దిగులు -- చింత! రాత్రయితే చాలు భయంకరమైన ఆలోచనలు ముసురుకునేవి.

నేనేదో తప్పుచేసినట్లు ఫీలవసాగాను --

అట్లాగే రోజులు దొర్లిస్తూ వచ్చాను.

రెండు నెలలూ గడిచాయి.

మూడోనెలకూడా గడిచిపోయింది.

ఆయన తిరిగి వచ్చారో--లేదో ?

వస్తే నా దగ్గిరికి వస్తారా?

నేనే పిల్లలతో ఆయన దగ్గిరికి వెళ్ళిపోతే ? పిటికెలో మనశ్శాంతి నీయగలను -- ఆయనకి! ఆయన సాన్నిధ్యంలో నేనూ సర్వం మరిచిపోగలదు!

కానీ ఆయన పిలవందే--నేనెట్లా వెళ్తాను?

నేను రమ్మనందే ఆయనెందుకు వస్తారు ?

ఇది తెగేదెట్లా ?

నేనిట్లాంటి సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతుంటే అన్నయ్య చెప్పాడొక పిడుగులాంటి వార్త! ఆయన ఉద్యోగానికి రిజైన్ చేసేశారట! ఎక్కడికి వెళ్ళారో -- ఎక్కడ ఉన్నారో -- ఎవరికీ తెలీదుట! ఉంటున్న ఇల్లుకూడా ఖాళీ చేసేశారుట!

నా నవనాడులూ కుంగిపోయాయి. ఇంక ఏ ఆశతో బతకను ?

పిల్లల గతేమిటి ? ఆయనకి పిల్లల ముద్దుమొహాలన్నా గుర్తుకి రాలేదా ? వాళ్ళని తల్చుకునైనా ఆయన తన ఆలోచనలని మార్చుకోలేదా ? ఆవిడ పోయేటప్పటికి అంతగా దిగజారిపోయారా ?

అవును. ఆవిణ్ని ప్రేమించి పెళ్ళి చేసుకుని తెచ్చుకున్నారు అపురూపంగా చూసుకున్నారు. సేవలు చేసి శాయశక్తులా బతికించుకోడానికి ప్రయత్నించారు. ఆయన శ్రమ ఫలించలేదు, ఆవిడ పోతే ఆయన పిచ్చిపట్టినట్లు తిరగడంలో ఆశ్చర్యంలేదు.

ఆవిడెంత అదృష్టవంతురాలు !

ఆవిడ చచ్చిపోయినా ఆయనకి దగ్గిరగానే వుంది ! నేను బతికున్నా ఆయనకి దగ్గిర కాలేను ! ఇది నా కర్మ ! అంతే ఇదంతా కర్మ అనే అనుకోవాలి.

అన్నయ్య ఈ వార్త తెలిసిన వెంటనే ఆయనకోసం వెతకడం ప్రారంభించాడు.

కావాలని ఏవేవో ఊళ్ళు కాంప్ వేసుకుని, ఆ ఊళ్ళ చుట్టుపక్కలంతా గాలించిరావడం మొదలుపెట్టాడు.

రామం కూడా అన్నయ్యతోబాటు, విడిగా కూడా ఆయనకోసం వెదకడం తనూ ప్రారంభించాడు

దేవుడు నా నుదుట ఇంకా ఏం రాశాడో ?

రాధ వచ్చి కొన్నాళ్ళు నా దగ్గిరే వుంది -- పిల్లలతో. నాకు మాత్రం ఎక్కడికీ వెళ్ళాలనిలేదు.

అసలు ఇంటిబయట కాలుపెట్టడమే మాను కున్నాను. కాలేజీకి మాత్రం తప్పనిసరై వెళ్తున్నాను--అంతే.

అన్నం ఒక్కపూట -- అదీ రాధ బలవంతం మీద తింటున్నాను.

నిద్ర అసలే లేదు.

పిల్లలు సెలవులకి వచ్చారు మళ్ళీ.

సుధ ఇంక నన్ను వదిలి వెళ్ళనని మొండికేసు క్కూర్చుంది.


నేనెన్ని విధాలో బతిమాలాను.

"ఉహూం! ఇంక నిన్ను ఒంటరిగా వుండ నీను ఇక్కడే ఏదన్నా స్కూల్లోచేరి చదువు కుంటాను. మధుని కావాలంటే అక్కడే వుండనీ-- నేను మాత్రం ఇంక నిన్ను విడిచి వెళ్ళనుగాక వెళ్ళను. అంతే !"

ఖచ్చితంగా చెప్పేసింది

"చూడు సుధా-ఇంకో మూడేళ్ళు అక్కడ చదివావంటే తరవాత ఇంక నా దగ్గిరే వుండవచ్చు గదా? నేనుగూడా ఇంకనించీ ప్రతి టర్మ్ అక్కడి కొచ్చి రెండు--మూడురోజులు గడపదల్చుకున్నాను. మీ స్కూలు చాలా బావుంటుందిట గదా?"

"నువ్వట్లాగే అంటావు -- మాట తప్పించ



డానికి. నేను చేరిన ఇన్నేళ్లలోనూ నువ్వు ఒక్కసారిగూడా రాలేదు. నేను నిన్ను నమ్మను.''

''ఈసారి తప్పకుండా వస్తాగా? ఒట్టు! నన్ను నమ్మ ఈ ఒక్కసారికీ! నా మాట నేను నిలబెట్టుకోకపోతే అప్పుడే నువ్వు స్కూలు మానేద్దువుగాని కానీ, ఇప్పటికి మాత్రం ఆ స్కూలు వదలకమ్మా? మా అమ్మవిగదూ? ఆ స్కూలు నిజంగా మన కెంతో మేలు చేసింది. తల్లిదండ్రులుగా మేము మీకు చేసింది ఏమీలేదు ఆ స్కూలు మీకు మాకన్నా ఎక్కువ వాత్సల్యాన్ని అందించింది. మాకన్నా బాధ్యతగా చూసింది నీకు తెలీదూ?''

''అమ్మా...'' అంది సుధ.

''అవునమ్మా! నాకా స్కూలంటే ప్రాణమే కానీ, నీకోసం...''

''నాకోసమే నువ్వక్కడ వుండాలి.''

ఇంకేం మాట్లాడలేదు సుధ.

ఈ సెలవుల్లో వాళ్ళా ఆనందంగా గడపలేక పోయారు నేనూ వాళ్ల సంగతి పట్టించుకోలేక పోయాను

కానీ. రాధ, రామం బాగా ఎంగేజ్ చేశారు వాళ్లని సెలవుల్లో ఈసారి నేను వాళ్లతో కలవలేదు. దేనిమీదా ఆసక్తి లేదు నాకు

కాలేజీలో పిల్లలకి గూడా ఆసక్తిగా పాఠం చెప్పలేకపోతున్నాను. ఒక్కొక్కసారి ఈ ఉద్యోగానికి రిజైన్ చేసేద్దామనిపిస్తుంది. కానీ, ఆమాత్రం కాలక్షేపమన్నా లేకపోతే నేనసలు ఈమాత్రమన్నా బతకలేనేమో!

వెలుగు—నీడలు; సుఖదుఃఖాలు అంటారు.

నా జీవితంలో అంతా చీకటేనేమో? వెలుతురే లేదేమో అంతా దుఃఖమే — సుఖమనేది లేదు! సుధ వెళ్తూ—వెళ్తూ నాచేత ఒట్టు వేయించుకుని మరీ వెళ్లింది

రోజులుకూడా తనే ఫిక్స్‌చేసింది.

ఆగష్టు మూడోవారంలో నాలుగు రోజుల ఫిక్స్ చేసింది అక్కడికి నేను వెళ్లడానికి!

నేనూ వెళ్దామనే నిశ్చయించుకున్నాను.

రోజులు మందకొడిగా సాగుతున్నాయి.

అన్నయ్య వచ్చినప్పుడల్లా బతిమాలుతూనే వున్నాను -

''అన్నయ్యా— ఆయన సంగతి విచారించరా? పేపర్లలో వేయించరా? ఎక్కడున్నారో—ఏమిటో— ఓసారి సెలవుపెట్టి వెతకరా!''

''మంజూ! నువ్వు నాకంతగా చెప్పాలా? దీంట్లో నాకు మాత్రం బాధ్యతలేదూ? నా ప్రయత్నాలన్నీ నేనూ చేస్తూనే వున్నాను. అవతల రామం — మనకోసం శ్రమ తీసుకుంటున్నాడు. మొన్ననే గదా—రామకృష్ణ మిషన్—రమణాశ్రమం వీటన్నిటిలో వెతికింది? ఫలితం శూన్యం! కానీ అక్కడికి వచ్చి వెళ్లినట్లు అక్కడివాళ్ళు చూచాయిగా చెప్పారు. మళ్లీ ఎక్కడికి వెళ్లాడనేది ఎవరూ చెప్పలేకపోతున్నారు.''

అయితే నా జీవిత మింతేనంటావా?'' అంటూ ఏడిచాను.

''ఊరుకోమ్మా, ఊరుకో తల్లీ! నిన్నిట్లా చూస్తుంటే నాకెంత బాధగావుందో! ఆయనేదో కొన్నాళ్లు అజ్ఞాతంగా వుండదల్చుకున్నాడేమో? లేకపోతే పిల్లలమీద ఆయనకి ఎంత మమకారమనుకున్నావు? నీకు తెలీదూ? అది తొలిసిరాజసి ఎక్కడికీ వెళ్లలేదు ... వాళ్లకోసమయినా తప్పకుండా తిరిగి వస్తాడు నువ్వేం భయపడద్దు. ఇదిగో, రేపే పిల్లలు వేసినట్లుగా పేపర్లలో వేయిస్తాను సరేనా?''

నా కన్నీళ్లు తుడిచాడు అన్నయ్య.

నేనే అవకాశాన్ని జారవిడుచుకున్నానేమో? ఆయన ఆవిడకి వంట్లో బాగాలేక అవస్థపడుతున్నప్పుడు, నా చెయ్యి ఆసరాగా యిచ్చివుంటే అసలింతదాకా వచ్చేదా?

ఏం చేస్తాను? అంతా నా దురదృష్టం!

ఆ మర్నాడే అన్నయ్య పేపరుకి మాటరు పంపించాడు పిల్లల పేరిట

అది చూస్తే తప్పకుండా ఆయన ఎక్కడున్నా రావలసిందే పిల్లల దగ్గరికి!

కానీ. పదిరోజులు గడిచినా నేనాశించినట్లుగా ఆయన సమాచారం ఏమీ తెలియలేదు.

ఆయన రాలేదు — ఉత్తరమూ లేదు

అది చూస్తూనే పిల్లల దగ్గర్నించి ఉత్తరాలు వచ్చాయి కంగారుపడుతూ రాశారు వాళ్ళు.

అన్నయ్య వెంటనే వెళ్లి వాళ్లకి సర్దిచెప్పి, ఊరుకోబెట్టి వచ్చాడు.

ఈ పేపరు ప్రకటనవలన కాలేజీలో నామీద ఎమర్శలు బయల్దేరాయి

చాలామంది నన్ను చూసి గుసగుసలాడటం ప్రారంభించారు

అపహాస్యంగా నవ్వడం మొదలుపెట్టారు

ఇన్నాళ్ళా పతి పరిత్యక్తగా అవమానం పొందని నేను, కాలేజీలో ఇప్పుడు ఘోరావమానం పొందుతున్నాను

ఇంటా బయటా కూడా శాంతిలేకుండా పోయింది నాకు

పిల్లల ఉత్తరాలు ఎక్కువయ్యాయి

''నాన్న వచ్చారా? నాన్న కనిపించారా?'' ఇదే సంగతి ఉత్తరాల్లో!

ఇట్లా రోజులు గడపడం చాలా కష్టమై పోతోంది నాకు

ఏదో మార్పు కావాలి — మార్పు కావాలంటూ తహతహలాడసాగింది నా ప్రాణం!

ఇంతలో ఆగస్టు వచ్చేసింది!

పిల్లల స్కూలుకు నా ప్రయాణం దగ్గర పడుతోంది. ఎందుకో ఆ ఊరు వెళ్ళాలని నా మనసు తెగ ఆత్రుతపడుతోంది

ఎడమకన్ను అదరడం ప్రారంభించింది.

నాలో నేనే నవ్వుకున్నాను ఇంతలో నాకు జరగబోయే శుభ మేమిటా అని! ఆఁ! అన్నీ మూఢనమ్మకాలు — అనుకున్నాను

అన్నయ్య వచ్చినప్పుడు అడిగాను — ''మీరు కూడా రండిరా నాతో'' అని!

''నాకూ రావాలనివుందే! కానీ, సరిగ్గా ఆ మూడురోజులే నేను చాలా అర్జెంటు పనిమీద బొంబాయి వెళ్లాల్సి వస్తోంది.'' అన్నాడు అన్నయ్య.

రామం, రాధలని రమ్మన్నాను.

''చిన్నపిల్లతో ప్రయాణం కష్టం రాలేమన్నారు!''


నేనొక్కదాన్నే ప్రయాణమయ్యాను


ఒక్కరాత్రి ప్రయాణం. నేను ఒంటరి ప్రయాణాలు ఎప్పుడూ అంతగా చెయ్యలేదు

అన్నయ్య, రామం స్టేషనుకి వచ్చారు

రైలెక్కాను.

రైలు కదుల్తుండగా ''విష్ యూ ఆల్ ది బెస్ట్ మంజూ!'' అన్నారు ఇద్దరూ ఒక్కసారిగా!





రా గ మా లి క

నేను నవ్వాను — చెయ్యూపి!

స్టేషన్ దూరమయింది క్రమంగా!

కదుల్తున్న రైలు ఉయ్యాలలాగా వుంది

కళ్ళు మూతలుపడ్డాయి

ఎంతసేపు గడిచిందో!

సన్నగా ఏడుపు వినబడితే, కళ్ళు తెరిచి చూశాను

నా ఎదురుగ్గా ఒక జంట కూర్చునివుంది.

ఆవిడ ఏడుస్తోంది

చేతిలో పసిపాప!

ఆయనేం పట్టనట్లు విసుగ్గా ముఖం పెట్టుకుని వున్నాడు — కిటికీలోంచి బయటికి చూస్తూ.

''నాలో ఏం తక్కువైందని దాన్ని కట్టుకున్నావు? పురిటికి పోతే మూణ్ణెల్లు వుండలేకపోయావా? నేను, పిల్ల ఏమైపోవాలి? ఇది నీకు న్యాయమేనా?''

ఇంకా ఏమేమిటో అంటోంది ఏడుస్తూ! ఆ రెండు మాటలూ నా చెవిన బడ్డాయి.

అంతే! త్రుళ్ళిపడ్డాను.

''ఎవరో చెప్తే నమ్మలేదు. నిజమేనన్న మాట! నేను నీతో రాను. నన్ను దింపెయ్ కిందికి! లేకపోతే పిల్లతోసహా కిందికి దూకేస్తాను నీకు పీడావదిలిపోతుంది — దాంతో హాయిగా కులకచ్చు.''

పెద్దగా ఏడ్చింది.

''దూకు ... నిజంగా పీడావదుల్తుంది!'' కసిగా అన్నాడు ఆయన.

సందేహంలేదు. నా జీవితంలాంటిదే మరో జీవితం! మరేం వినబడలేదు నాకు. కళ్ళు మూసుకుని వెనక్కి జారగిలబడ్డాను మళ్ళీ!

నా మనసు గతంలోకి పరుగులుతీసింది!

21

అప్పుడే కాలేజీనించి ఇంటికి వచ్చాను నేను

ఇల్లంతా హడావిడిగా వుంది.

నాన్న వాకిట్లో కూచునివున్నారు.

''వచ్చావా తల్లీ...'' ఆప్యాయంగా అన్నారు నాన్న

''అమ్మా, సుశీలా! అమ్మాయొచ్చింది.'' అన్నారు వదిన నుద్దేశించి.

''వచ్చావా మంజూ! నీకోసమే ఎదురు చూస్తున్నాం.''

వదిన నవ్వి నా చెయ్యి పట్టుకుని లోపలికి తీసికెళ్ళింది

''ఏమిటి వదినా, హడావిడి?'' అడిగాన ర్థంగాక.

''ఏమిటేమిటి? నిన్ను చూడ్డానికి పెళ్ళికొడుకు వస్తున్నాడు —''

''ఎంతమంది వస్తారు? ఎన్నిసార్లు చూస్తారు? మొన్న చూసివెళ్ళారుగా? చాలదూ?'' చిరాగ్గా అన్నాను.

''మొన్న వచ్చింది అబ్బాయి తల్లీ- అక్కాను ఇప్పుడు అబ్బాయి వస్తున్నాడు అసలు నచ్చాల్సిందీ — మెచ్చాల్సిందీ...''

'చాలు వదినా, పరసాలు -'' కోపంగా అన్నాను.

''ఇవేం పరసాలు? అసలు పరసాలు ఆడేవాళ్ళు వస్తున్నారులే —'' కొంటెగా నవ్వింది వదిన.

వదిన చాలా అందంగా — హుందాగా వుంది.

అసలే అందగత్తె. అందులో ఇప్పుడు గర్భవతి గూడాను.

కళ్ళు కాంతివంతంగా మెరుస్తున్నాయి. నాకంటే ఏమంత పెద్దదికాదు వదిన. కానీ తెచ్చిపెట్టుకున్న పెద్దతనంతో గంభీరంగా వుంది!

ఎంతో పేచీపెట్టి — చివరికి వదిన తీసి యిచ్చిన బట్టలు కట్టుకున్నాను.

నా కసలు పెళ్ళిచూపులంటే గిట్టదు. సంతలో జంతువుని చూసినట్లు చూడడం — నచ్చలేదనడం — మళ్ళీ ఎవరో రావడం — మళ్ళీ చూడడం — ఈ వరసంతా తలనొప్పి నాకు. నాకేనేమిటి — ప్రతి ఆడపిల్లకీ అట్లాగే వుంటుందేమో! కొంతమంది బయటపడతారు. కొంతమంది బయటపడరు.

'పెళ్ళి' అనేది ఆడ, మగ ఇద్దరికీ అవసరమైనదే — ముఖ్యమైనదే. సహజమయినదే!

మరయితే మగవాడికి ఎందుకంత ఆధిక్యత? చూడ్డానికి వచ్చినప్పటినించీ మనం ఎందుకంత అగ్గగ్గలాడటం? ఎందుకు తగ్గివుండాలి? వాళ్ళు మనన్ని ఎందుకంత లోకువగా చూస్తారు? అన్నీ వాళ్ళ కనుగుణంగానే ఎందుకు జరగాలి? ఇవన్నీ నేను నాన్ననిగానీ, వదిననిగానీ అడిగితే నవ్వి ఊరుకుంటారు.

నేనింకా చిన్నపిల్లనే అయినట్లు పరిగణిస్తారు! అందుకనే ఒక్కొక్కసారి మౌనంగానే వుండిపోతాను

ఆ అబ్బాయి ఏదో ప్రైవేటు కంపెనీలో ఇంజనీరుట పెద్ద జీతంట! వదిన చెప్తూనే వుంది వివరాలు.

సాయంత్రం ఆరుగంటల ప్రాంతంలో ఆ అబ్బాయి వచ్చాడు.

కాఫీ, టిఫిన్లు అయ్యాయి. అన్నయ్య, నాన్న అతడి పక్కనే కూచుని అడిగిన వాటన్నిటికీ సమాధానాలు ఇస్తున్నారు — ఓపికగా!

వాళ్ళ మొహాల్లో ఎంతో ఆత్రుత, ఏదో కుతూహలం!

నేను కాసేపు అక్కడే వుండి తరవాత లోపలికి వచ్చేశాను. కొంచెంసేపయ్యాక అన్నయ్య లోపలికి వచ్చి — ''మంజూ! ఆయన నీతో ఏదో మాట్లాడాలిట! 'పబ్లిక్ గార్డెన్స్'కిట వెడతావా?'' అన్నాడు.

నా మొహం ఎర్రబడ్డది.

''ఛీ — ఛీ —'' అన్నాను నేను

''ఛీ — ఛీ ఏమిటమ్మా - వెళ్ళు! కాబోయే ఆయనేగా? చేసుకోడానికి ఒప్పుకున్నట్లే —'' వదినంది.

''చేసుకోడానికి ఒప్పుకుంటే యింక మాటలెందుకు? పెళ్ళయ్యాక ఏమోగానీ — ముందు నేను చచ్చినా మాట్లాడను!''

అన్నయ్య — వదిన — నాన్న గూడా ఎంతో బతిమాలారు. నచ్చజెప్పారు.

చివరికి మా ఇంట్లోనే ఏకాంతంగా మాట్లాడడానికి నేను ఒప్పుకున్నాను.

నన్ను ఆయన్ని ఒంటరిగా గదిలో వదిలి — అన్నయ్య, నాన్న బయటికి వెళ్ళారు.

అన్నయ్య — నాన్నల కోసం ఒప్పుకున్నాను గానీ — నా కసలు ఇష్టంలేదీ పద్ధతి!

కుర్చీలో మౌనంగా కూచున్నాను — తల వంచుకుని.

''చూడండి మంజులగారూ...''

''.. ... ...?'' తలెత్తి చూశాను

''మీకీ పెళ్ళిచూపుల తతంగం నచ్చలేదు కదూ? అసలు నాకూ ఇష్టంలేదు. కానీ ఏం చేస్తాం చెప్పండి? కొన్ని మన పెద్దవాళ్ళు చెప్పిన పద్ధతులు అనుసరించాలి గదా?''

''.. ... ...''

''నాతో బయటికి రావడం మీకు ఇష్టంలేదు — అవునా?''

''.........''

''చెప్పండి!''

''అవును.'' టక్కున అన్నాను

అతడు పెద్దగా నవ్వాడు. [ఇంకా వుంది]

సురేఖా సుకుమార్

"రాజేష్"



"సుజా! నీకోసం కమల్‌హాసన్ వచ్చాడేవ్ !" అన్న కేకతో అక్కడే మంచంమీద పడుకోని ఏదో పుస్తకం తిరగేస్తున్న సురేఖ తన రూంమేట్సు అయిన రాణి, సుజలను ఓసారి చూసి మళ్లీ పుస్తకంలోకి చూపులు మరల్చుకుంది.

"నిజం! ... లేక నన్ను ఫూల్‌ని చెయ్యడానికా?"

"అబద్ధం ఎందుకు చెప్తానే తల్లీ! కావలిస్తే ఒక్కసారి క్రిందకి వెళ్లి చూసిరా! రాకపోయివుంటే అప్పుడు చెప్పు ... వెళ్ళు. వెళ్ళు. పాపం! ఎంతసేపని వెయిట్ చెయ్యగలడు మానవుడు!" రాణి తొందరచేసింది.

సుజాత త్వరత్వరగా ఆ చీర విప్పేసి, ఇంకో నైలెక్సుచీర కట్టుకోని, మొహానికి చకచకా క్రీమూ, పౌడరూ రాసుకోని, ముంగురుల్ని అలా సర్దుకోని, అద్దంలో అలా చూసుకుంటూనే గబగబా చెప్పులేసుకొని గుమ్మం దాటిపోయింది

మామూలు టైములో అయితే ఆ అలంకరణకు కనీసం అర్ధగంటయినా పడుతుంది

సుజాత వెళ్లిపోయాక రేఖను చూసి చిన్నగా నవ్వింది రాణి.

"మన సుజ బాయ్‌ఫ్రెండు !" అంది.

సుజ, సురేఖ యిద్దరూ ప్రీవియస్ యం యస్సీ. స్టూడెంట్లు. సుజది సైకాలజీ అవుతే రేఖది జువాలజీ. రాణి ఫైనలియరు హిస్టరీ స్టూడెంటు. సుజ తెల్లగా, అందంగా వుంటుంది. కొంచెం పొట్టి. రాణి మంచి పొడగిరి. కాస్త నలుపైనా మంచి ఆకర్షణీయమైన మొహం.

"చూస్తూనే సుజాత అందం కొట్టవచ్చినట్లు కన్పిస్తుందిగానీ రాణిని పరిశీలనగా చూసి, కొంచెం స్నేహం అలవరచుకోని పదే పదే చూస్తుంటే, రాణిలో ఏదో ప్రత్యేకమైన అందం వున్నట్లే కన్పిస్తుంది" అనుకుంది రేఖ వాళ్లిద్దరి గురించే ఆలోచిస్తూ.

యూనివర్సిటీ తెరిచి పదిహేనురోజులయిపోయినా, అంతకుముందురోజే వచ్చి చేరింది సురేఖ కాబట్టి యింకా వాళ్లిద్దరితో అంత చనువుగా మెలగలేకపోతూంది. క్రొత్తగా ఫీలవుతూంది

పుస్తకాలు సర్దుకుంటూ రాణి కూడ సురేఖ గురించే ఆలోచించసాగింది.

"సుజాతే అందమైనదనుకుంటే సురేఖ సుజాతకు ఏ విషయంలోనూ తీసిపోనట్లు కన్పిస్తూంది నిజం చెప్పాలంటే సుజాత కంటే సురేఖనే అందమైనది బాపు బొమ్మలా చక్కగా వుంది" అనుకుంది

వారంరోజులు గడిచిపోయాయి

సురేఖకు క్రొత్తపోయి అందరితో స్నేహం అయ్యింది.

సాయంత్రం అయిదు అవుతూనే ముగ్గురూ చక్కగా తయారయి గలగలా కబుర్లు చెప్పుకుంటూ యూనివర్సిటీ కాంపస్ రోడ్లమీద అలా షికారెళ్తుంటారు మధ్యలో రోడ్డుమీద ఏ అబ్బాయిని ఒంటరిగా చూసినా చక్కగా పేర్లు పెట్టేసి, ఏదో ఒక కామెంటు చెయ్యకుండా వదలదు రాణి

రాణికి యూనివర్సిటీలో "మగరాయుడు గారు", "ఫైర్ బాంబ్" అన్న పేర్లు ముద్దుగా పెట్టుకున్నారని అప్పుడెప్పుడో సుజాత చెప్పింది సురేఖకు

ఉన్నట్టుండి రాణి అడిగింది

"ఏమిటోయ్ సుజా! నిన్న విజిటర్స్ డే కదా! నీ కమల్‌హాసన్ వచ్చినట్లులేదే !" అంది

"అవును! రాలేదు." సుజాత మామూలుగానే చెప్పినా, అదేదో బాధ ధ్వనించినట్లనిపించింది రాణికి.

"ఫర్వాలేదు డోంట్‌వర్రీ మైడియర్! స్పోర్టివ్‌గా తీసుకోవాలి యిలాంటి విషయాల్ని ఎల్లుండి వస్తాడేమోలే." అంది.

"నేనేం వర్రీ కావడంలేదు" తేలిగ్గానే అంది సుజాత

"కమల్‌హాసన్ ఎవరు?" అడిగింది సురేఖ

నవ్వింది రాణి

"ఇంకొన్నాళ్ళు ఓపికపట్టవోయ్! నీఅంతకు నువ్వే తెలుసుకుంటావు ఆ హీరో గురించి సొంతంగా నువ్వు తెలుసుకునేంతవరకు యెందుకు? ఈసారి కన్పించినప్పుడు చూపిస్తాలే" అంది రాణి

సుజాత నవ్వింది చిన్నగా.

ఆ మరుసటి ఆదివారం సుజాత తన ఫ్యామిలి మెంబరు ఎవరో వస్తే మార్నింగ్‌షో కెళ్లింది సాయంత్రంవరకూ రాదు

అతినిశ్శబ్దంగా వున్న వాతావర్ణంలో వున్నట్టుండి ఒక మోటారుసైకిలు శబ్దం పెద్దగా విన్పించింది

వులిక్కిపడి లేచి కూర్చుంది రాణి

"సుకుమార్ వచ్చినట్లున్నాడే!... సుజా లేదే !" సురేఖకు చెప్పినట్లుగా పెద్దగానే అంది

"సుకుమార్ ఎవరు?" వులిక్కిపడింది సురేఖ.

నవ్వింది రాణి

"అతనే కమల్‌హాసన్! అసలు పేరు సుకుమార్‌లే. కాస్త పోలికలు అలా వుంటాయని ఆ పేరు పెట్టాం."

సురేఖ కూడ నవ్వింది

"చాల షోకిల్లారాయుడులే. ఇక్కడే బి. యల్. ఫైనల్ చదువుతున్నాడు"

కొద్దిసేపయ్యాక మళ్లీ రాణినే అంది

"నీకు చూపిస్తానన్నాను కదూ! పద వెళ్దాం."

"వద్దు వద్దు అతన్నేం చూసేది వుంది?" గాభరాగా అంది సురేఖ

"అదొక గ్లామర్ లేవోయ్! అతగాణ్ణి చూసినంత మాత్రాన మన పాతివ్రత్యం ఏం భంగపడిపోదు ప్రొద్దుట్నుండి రూములో వుండి బోరు కొట్టేస్తూంది. అలా తిరిగినట్లు కూడ వుంటుంది బయల్దేరు." అంటూ చీర కుచెళ్ళు సర్దుకోని అద్దం ముందు కూర్చుంది

ఇద్దరూ మొహానికి యింత పౌడరు రాసుకోని, తిలకం దిద్దుకోని మెల్లిగా బయటికి వచ్చారు

తనను చూస్తూనే సుజ గురించి అడుగుతాడని, లేదని చెప్పాల్సి వస్తుందని, పైగా సుజ సినిమా నుంచి వచ్చాక సుకుమార్ వచ్చి వెళ్లాడని తెలిస్తే ఎలా ఫీలవుతుందో వూహించుకుంటూ

ఎయిటికి వచ్చి, మెట్లు దిగుతున్న రాణి షాక్ తిన్నట్లు ఆగిపోయింది.

కొద్ది దూరంలో వున్న వేపచెట్టు క్రింద షోగ్గా నిల్చుని సిగరెట్ కాలుస్తూ లీనాతో మాట్లాడుతున్నాడు సుకుమార్

ఇదంతా ఏం గమనించని సురేఖ అడుగు వేసి దాటిపోతూవుంటే మెల్లిగా చెయ్యి పట్టుకుంది రాణి

"అదో ఆ చెట్టుక్రింది బ్లూ బెల్ బాటమ్ లేదూ! ఆ అమ్మాయితో మాట్లాడుతున్నాడే. అతనే!" అటు చూడకుండానే చాల మెల్లగా చెప్పింది రాణి.

మంచి ఒడ్డూ పొడవులో, పసిమిమేని ఛాయలో, చక్కని వుంగరాల జుత్తుతో, అందంగా ఏ అమ్మాయినైనా యిట్టే ఆకర్షించే విధంగా వున్నాడు ఆ అబ్బాయి

లీనా కూడ కర్‌చీఫ్ చివర్లని మునిపంటితో కొరుకుతూ, మెలికలు తిరిగిపోతూ, అనవసరంగా ఎన్నగా నవ్వేస్తూ, గునుస్తూ మాట్లాడేస్తూంది.

నవ్వుకుంది సురేఖ.

"వీళ్లేనా బాయ్‌ఫ్రెండ్సు, గర్ల్‌ఫ్రెండ్సు!" అనుకోని విచిత్రంగా చూసినట్లే చూసి నవ్వేసుకుంది.

ముందుకు అడుగులేస్తూవుంటే అడిగింది రాణి.

"చూశావా?"

"వూఁ!"

"ఎలా వున్నాడు?"

"ఫర్వాలేదు! బాగానే వున్నాడు."

గట్టిగా నవ్వింది రాణి

"ఫర్వాలేదా?!... వెళ్లి హాస్టల్లో ఏ అమ్మాయినైనా అడుగు. చెప్తారు. అతనెంత అందగాడో! నిజం చెప్పాలంటే అతనంటే వీళ్లకు ఒక విధమైన పిచ్చి!"

"నీకు లేదా?"

గలగలా నవ్వేసింది రాణి

"నాకా?!... ఏమో సురేఖా! నాకు యీ బాయ్‌ఫ్రెండ్సు గర్ల్‌ఫ్రెండ్సు మీద నమ్మకం లేదు. అంతెందుకు యీ ఫ్రెండ్షిప్ అన్నీ యిక్కడ వున్నంతవరకే. రేపు అతనెవరో, వీళ్లెవరో! వాళ్లు కట్నాలు తీసుకోని ఏ మేనమామ కూతుర్నో, లేకపోతే పెద్దమొత్తం కట్నాలిచ్చే ఏ ఆఫీసర్ల అమ్మాయిల్నో పెళ్లి చేసుకోని వీళ్లు సెటిలయిపోయి పెద్దమనుషులయిపోతారు. ఇక అమ్మాయిలంటావా?!. వాళ్లూ అంతే! తల్లిదండ్రులు కుదిర్చిన సంబంధాన్ని బుద్ధిగా ఒప్పేసుకోని ఏ డాక్టరుచేతో, ఏ యింజనీరుచేతో తాళి కట్టేయించుకుంటారు ఆ తర్వాత సిన్సియర్‌గా సంసారాలు అంతే."

అదీ నిజమేననిపించింది సురేఖకు

సుకుమార్‌ను చూసినప్పట్నుంచీ అతణ్ణి యెక్కడో చూసినట్లే అన్పిస్తోంది చాల పరిచితమైన మొహంలా వుంది కాని అతణ్ణి యెక్కడ చూసిందో మాత్రం గుర్తుకురావడం లేదు ఆలోచిస్తూ వుండిపోయింది

సురేఖా సుకుమార్

అలాగే ఓ రెండు నెలలు గడిచిపోయాయి

ఆరోజు యూనివర్సిటీలో ఏదో ఇంగ్లీషు పిక్చరు బెనిఫిట్‌షో పెట్టారు చూడదలచినవాళ్లు అయిదురూపాయలు టికెట్టుకొని చూడొచ్చు

మధ్యాహ్నం లైబ్రరీలోనుంచి ఏదో పుస్తకం తీసుకోని యివతలికి వస్తున్న సురేఖ యెదురుగా నిల్చున్న అతన్ని చూస్తూనే ఉలిక్కిపడింది

సుకుమార్!

చిన్నగా నవ్వాడు.

"బెనిఫిట్‌షో వుందని తెలుసుకదండీ! మీ పేరుమీద ఓ టికెట్టు కట్‌చెయ్యాలనుకుంటున్నాను మిస్!" చాల స్టయిలుగా చెప్పాడు

అతణ్ణి చూస్తూనే సురేఖ మస్తిష్కంలో అన్ని రోజుల్నుంచి ఆలోచిస్తున్నదానికి యిట్టే పరిష్కారం దొరికినట్లనిపించింది.

"నిశ్చయంగా అతగాడే అయ్యుండాలి పేరు కూడ అదే. సందేహంలేదు." అనుకుంది.

మాటాపలుకూ లేకుండా అంత ధైర్యంగా, అదీ యూనివర్సిటీ నడిరోడ్డులో తనను చూస్తూ అల్లాగే నిల్చుండిపోయిన సురేఖను చూసి యిబ్బందిగా ఫీలయ్యాడు సుకుమార్.

"ఏమండీ! కట్‌చెయ్యమంటారా?"

ఉలిక్కిపడింది సురేఖ

"ఏమిటి?"

ఆశ్చర్యపోయాడు సుకుమార్, యీ అమ్మాయికి యింత పరధ్యాన మేమిటా అని.

"అదేనండీ! బెనిఫిట్‌షో కోసం టికెట్టు..."

"అంటే మీరు టికెట్లు అమ్మడానికి వచ్చారా?"

విషయం అదే అయినా, ప్రశ్న వేసే రీతి బాగాలేదనిపించింది సుకుమార్‌కు.

చిన్నగా నవ్వాడు

"యస్ యస్!"

"సారీ ప్లీజ్! ఆ పిక్చరు యిదివరకే ఓసారి చూసేశాను పైగా ఇంగ్లీషు సినిమాలంటె నాకు యెక్కడలేని తలనొప్పి! ఏమనుకోకండి." ముందుకు కదిలింది.

"మీరు చూడాలన్నంత బలవంతమేమీలేదు మిస్! జస్ట్ టికెట్ కొంటే చాలు.' ప్రక్కనే నడుస్తూ చెప్పాడు సుకుమార్.

ఆ క్షణం ఆగి ఏమనుకుందో మరి "అల్లాగే!" అంది.

సుకుమార్ యెల్లాగైతేనేం జయించానన్న సంతోషంతో త్వరగా టికెట్‌బుక్ తీసి ఒకటి చించి యిచ్చాడు

సురేఖ పర్సులో నుంచి అయిదురూపాయల నోటు తీసి టికెట్‌తో కలిపి యిచ్చేసింది.

"టికెట్ మీదగ్గరే వుంచండి! నాదగ్గర వుంటే అనవసరంగా వేస్టు అవుతూందే అని అదొక బాధ పైగా మా ఫ్రెండ్సు దగ్గరికెళ్లి "నువ్వెళ్లవే, నువ్వెళ్లవే" అని బతిమాలలేను మీ బాయిస్‌కి బోలెడు ఫ్రెండ్సు వుంటారుకదా ఎవరికో ఒకరికి యిచ్చెయ్యండి. వస్తాను థ్యాంక్సు" వడివడిగా వెళ్లిపోయింది సురేఖ

వెనకే బొమ్మలా చేతిలో అయిదురూపాయల నోటు, టికెట్టుతో నిల్చుండిపోయిన సుకుమార్ డౌన్ యిన్‌సల్టుగా ఫీలయ్యాడు.

అంతవరకు అక్కడే చెట్లక్రింద తచ్చాడుతున్న సుకుమార్ మిత్రబృందం వచ్చి సానుభూతిగా భుజంమీద చెయ్యివేసింది.

"డోంట్ వర్రీ! అయినా ఆ అమ్మాయికి చాల టెక్కులావుందే" అబ్బాయిలందరూ కలిసి సురేఖమీద వ్యాఖ్యానాలు చేస్తుంటే సుకుమార్ వినీవిననట్లే ఇంత చిర్నవ్వు మొహానికి పులుముకొని "నాకు పనుందోయ్! వస్తాను!" అని అక్కడే ఓ వార చెట్టుక్రింద నిల్పివున్న మోటారుసైకిల్‌ను స్టార్టుచేసి వెళ్లిపోయాడు

కళ్లకు రోడ్డు, మనుషులు ఏం కన్పించటం లేదు. అసలు రూముకు యెలా వచ్చిపడ్డాడోకూడ తెలియదు.

మంచంమీద అసహనంగా పడిపోయిన సుకుమార్ కళ్లముందు సురేఖే కన్పించసాగింది

"నిన్నగాక మొన్న వచ్చిన అమ్మాయికి, అదీ ప్రీవియస్ చదివే అమ్మాయికి అంత గర్వం ఏమిటి?... అయినా తనదే బుద్ధి తక్కువ తనంటే పడిచచ్చే యింతమంది అమ్మాయిలు వుండగా కావాలని మొదటి టికెట్టు సురేఖకే యివ్వాలని ఎంత ఆశపడ్డాడో అంత బాగా శాస్తి జరిగింది. అయినా యీ రెండేళ్లుగా యింత మంది అమ్మాయిల్ని ఆకర్షించిన తన రూపం, తన డ్రస్సులు, మోటారుసైకిలు యీ అమ్మాయిని ఆకర్షించలేదేం?..." తను అనుకున్న దాంట్లో వూహ వచ్చింతర్వాత మొట్టమొదటిసారిగా ఓడిపోయిన సుకుమార్ చాల అప్‌సెట్ అయ్యాడనే చెప్పొచ్చు.

సురేఖ మరీ మిస్ యూనివర్సిటీ కాకపోయినా, చూడ్డానికి అందంగా, నాజూగ్గానే వుంటుంది ఎవరితోనైనాసరే మరీ కలివిడిగా వుండదు. ఈ విషయాలన్నీ మిగతా ఫ్రెండ్సు ద్వారా విని వున్నాడు కాబట్టే ఆ అమ్మాయితో ఎల్లాగైనా పరిచయం పెంచుకోవాలనుకున్నాడు పరిచయం కోసం వేసిన మొదటి మెట్టే కూలిపోయింది.

ఆలోచించేకొద్దీ మరీ యింత చిన్న విషయానికి అంత బుర్ర బద్దలు కొట్టుకోవడం బాగా లేదనిపించింది.

సాయంత్రం అవుతూవుంటే లేచి, ట్రిమ్‌గా తయారయి, మోటారుసైకిల్‌ను తీసుకోని బయటికి వచ్చాడు

* * *

సాయంత్రం రాణి క్లాసు నుంచి రూం కొస్తూనే పుస్తకాలని టేబిల్‌మీద పడేసి, గట్టిగా చప్పట్లు కొట్టింది

మధ్యాహ్నం ఒక పీరియడు ముందే రూము కొచ్చేసి ఏదో మ్యాగజైను చూస్తూ పడుకున్న సురేఖ, అటువైపు కుర్చీలో కూర్చోని ఏదో వ్రాసుకుంటున్న సుజ యిద్దరూ యిటు తిరిగారు

'బ్రేవ్ గర్ల్! కంగ్రాచ్యులేషన్స్!! ఏం హాట్ న్యూస్ సృష్టించావోయ్ సురేఖా! యూనివర్సిటీ అంతా అట్టుడికిపోతోంది పో!"

[32వ పేజీ చూడండి]

ము...ము...ము...ముద్దంటే చేదా

ఒక చిత్రం తాలూకు పబ్లిసిటీ డిజైన్‌లో పై భాగాన "పెక్కు యుద్ధ దృశ్యములు గల చిత్రం" అని పెద్ద పెద్ద అక్షరాలలో రాయమన్నాడు ఓ నిర్మాత. పబ్లిసిటీ ఆర్టిస్టు పొరబాటున "యు"కు బదులు "ము" అని రాశాడు అది గుర్తించిన నిర్మాత మెదడులో అమాంతంగా మెరుపులాంటి ఆలోచన మెరిసింది. "పెక్కు ముద్దు దృశ్యములు గల చిత్రం" అని మార్చిస్తే ఎలా ఉంటుంది — అని డైరెక్టర్‌ను అడిగాడట. సెన్సార్‌వారి ధర్మమా అని మన చిత్రాలలో కథ అవసరంకొద్దీ చుంబనాలు అనుమతించబడతాయని తెలియడంతోటే కొంతమంది నిర్మాతలు అలాంటి దృశ్యాలు ఎలాగో ఇరికించడానికి చాలా తాపత్రయపడిపోతున్నారు. ముందొక చిత్రం విడుదలయ్యాక ప్రజలు ఎలా రిసీవ్ చేసుకుంటారో చూసి — ఆ తర్వాత తాము కూడా అలాంటి దృశ్యాలు జొప్పించవచ్చని మరికొందరు నిర్మాతలు ఫలితాల కోసం ఆత్రుతతో నిరీక్షిస్తున్నారు." కాని, మన ప్రేక్షకులు చాలా మంచివారండి ఓ వైపున 'ఏవిటిది — మరీ ఓవర్‌గా ఉందే' అని సిగ్గుపడుతున్నట్లు కనిపిస్తూనే మరో వైపున అలాంటి దృశ్యాలను చూడ్డానికి మరీ మరీ ఎగబడుతూంటారు" అని సమర్థించాడు ఒక దర్శకుడు మొత్తంమీద "చుంబన దృశ్యాలు"

జి వి జి. పేజీ

పరిశ్రమలో కాస్త సంచలనం కలిగించాయనే చెప్పాలి. ఏ సమయంలో ఉన్నట్టుండి అలాంటి దృశ్యాలలో పాల్గొనవలసివస్తుందోనన్న భయంతో ఒకరిద్దరు తారలు జర్దాకిళ్లీ, ఖిమాంకిళ్లీ అలవాటును మానడానికి నానా యాతనలు పడిపోతున్నారట. ఇటీవలే ఒకామె దంత వైద్యుని దగ్గరికెళ్లి, దంతాలన్నీ శుభ్రం చేయించుకుందట సరే... ఇక దేశంలో ప్రేక్షకులు కూడా సిద్ధంగానే ఉంటారు — రిసీవ్ చేయడానికైనా, విమర్శించడానికైనా...

పూర్తిగా ఔట్‌డోర్‌లో

"మా చిత్రం మొదటి షెడ్యూల్ ఏప్రిల్ 19 నుంచి మే 3 వరకు రాజస్థాన్‌లో ప్రఖ్యాతి చెందిన 'సావౌద్' రాజకోటలో, రెండవ షెడ్యూలు మే 20 నుంచి 31 వరకు హొగినకల్‌లో, మూడవ షెడ్యూల్ జూన్ 20 నుండి నెలాఖరు వరకు ఊటీలో జరగడంతో పూర్తవుతుంది" అని తెలియజేశారు నిర్మాత డాక్టర్ డి. వి ఎన్. రాజు, దర్శకుడు కె రాఘవేంద్రరావు — తిరుపతి ప్రొడక్షన్స్ పతాకంలో దాట్ల శ్రీరంగరాజు సమర్పించే "సింహబలుడు" జానపద సినిమాస్కోప్ వర్ణచిత్రంలో ఎన్ టి. ఆర్., వాణిశ్రీ, సత్యనారాయణ, రావు గోపాలరావు, మోహన్‌బాబు, మాడా, సారథి, అంజలీదేవి, రమాప్రభ, జయమాలిని తారాగణం. మాటలు డి వి నరసరాజు, పాటలు వేటూరి సుందరరామమూర్తి రాశారు ఎం. ఎస్ విశ్వనాథన్ సంగీతం, కన్నప్ప ఛాయ, భాస్కరరాజు శిల్పం, మార్తాండ్ కూర్పు నిర్వహిస్తారు చీఫ్ అసోసియేట్ డైరెక్టర్ పి. కోదండరామిరెడ్డి. అసోసియేట్ సరిపెల్ల చిట్టిబాబు ప్రొడక్షన్ కంట్రోలర్ జి. సత్తిరాజు. నిర్వహణ దాట్ల బలరామరాజు, ఆర్. విజయరామరాజు

బండమీద పళ్ళెమ్మే గండుపిల్లి జంగిరి

కొసరాజు గీతం, ఎస్. రాజేశ్వరరావు సంగీతం, ఎస్. పి బాలసుబ్రహ్మణ్యం — రమోల గానంతో జనవరి 27 న ధ్వనిముద్రిక చేయబడిన పై పాట నాయికా నాయకులపై చిత్రీకరింపబడుతుందన్నారు అమృతా ఫిలిమ్స్ పతాకంలో బాలయ్య నటిస్తూ, సమర్పించే "ప్రేమ — పగ" చిత్రం గురించి డైరెక్టర్ బి వి. ప్రసాద్ వివరిస్తూ మురళీమోహన్, సత్యనారాయణ, ప్రభాకరరెడ్డి, సత్యేంద్రకుమార్ నటించే ఈ చిత్రానికి ఎస్. ఎస్ లాల్ ఛాయ, కుదరవల్లి నాగేశ్వరరావు శిల్పం ఇతర హంగులు నిర్మాతలు అలపర్తి సూర్యనారాయణ, మన్నవ వెంకట్రావు





'రాధా మధుర్' లో దీప

ఎన్ టి ఆర్‌తో మరో సినిమాస్కో...

ఎస్ డి లాల్ దర్శకత్వంలో ... లక్ష్మయ్య చౌదరి, సి. ఎస్ రాజు నిర్మించే "రాజపుత్ర రహస్యం" సినిమా స్కోప్ వర్ణ చిత్రంలో ఎన్ టి. ఆర్, జయప్రద నాయకా నాయికలు గొల్లపూడి రచన మహదేవన్ సంగీతం, విన్సెంట్ ఛాయాగ్రహణంతో ఏప్రిల్ నెలలో పదమూడు రోజులపాటు మైసూరు అడవుల్లో షూటింగ్ జరుగుతుందని నిర్మాతలు తెలియజేశారు

అన్నదమ్ముల సవాల్

"సహోదర సవాల్" చిత్రం కన్నడంలో గొప్ప హిట్ అయింది అందులో పాల్గొన్న రజనీకాంత్, భీమరాజు, ప్రభాకర్, హలం, జయమాలినిలతోపాటు దాని ఆధారంగా తెలుగులో తయారైన శ్రీ సారథీ స్టూడియోస్ వారి "అన్నదమ్ముల సవాల్" వర్ణచిత్రంలో కృష్ణ, జయచిత్ర, చంద్రకళ, అంజలీదేవి, చలం, అల్లు రామలింగయ్య పాల్గొన్నారు. జి. డి. ప్రసాదరావు, పి శశిభూషణ్ నిర్మాతలు. కన్నడ చిత్రానికి పనిచేసిన డైరెక్టర్ కె. ఎస్ ఆర్. దాస్, ఛాయాగ్రాహకుడు ఎస్. ఎస్ లాల్, సంగీత దర్శకుడు సత్యం, ఎడిటర్ వెంకటేశ్వరరావులు కూడా ఈ తెలుగు చిత్రానికి పని చేశారు మాటలు మహారథి, సహకార దర్శకుడు : కె రంగారావు

మరో స్టూడియో నిర్మించే చిత్రం

హైదరాబాద్‌లోని శ్రీ రామకృష్ణ సినీ స్టూడియోస్ అన్నపూర్ణ స్టూడియోస్, శ్రీ సారథి స్టూడియోస్‌తోపాటే భాగ్యనగర్ స్టూడియోస్ పతాకంలో పి చంద్రశేఖరరెడ్డి దర్శకత్వంలో బాదం రామస్వామి నిర్మించే చిత్రంలో నరసింహరాజు, లత, త్యాగరాజు, శరత్‌బాబు, గిరిబాబు, మాడా, ఛాయాదేవి నటిస్తున్నారు రచన, సంగీతం, ఛాయ, శిల్పం, కూర్పు, సహకార దర్శకత్వం బాధ్యతలను రాజశ్రీ, రమేష్‌నాయుడు, లక్ష్మణ్‌గోరే, బి చలం, నాయని మహేశ్వరరావు, మన్నె రాధాకృష్ణ వహిస్తున్నారు

అనసూయ - అసూయ

హీరో రాజేష్ కొడుకు కిరణ్, చనిపోయిన తన తల్లి గురించి పంతులమ్మ శారదతో చెప్తుండగా అతని మేనత్త అనసూయ చక్రాల కుర్చీలో వచ్చి, "శారదా, ఏమిటి చెప్తున్నాడు వాడు ?" అంది హుందాగా "ఏం లేదండి వాళ్లమ్మ చాలా మంచిదని, బాగుంటుందని, చచ్చిపోయిందని..." అంది పంతులమ్మ అనసూయ ఆగ్రహంతో "కిరణ్! మమ్మీని గురించి మాట్లాడొద్దని ఎన్నిసార్లు చెప్పాను ?" అంది పంతులమ్మ వుండబట్టలేక "అదేమిటండీ, అతని తల్లిని గురించి అతను మాట్లాడితే." అని ఏదో చెప్పబోయింది అనసూయ అసూయతో "శారదా! నీకు తెలీదు. నువ్వు మాట్లాడకు నేను చెప్పింది చెప్పినట్లు జరగాల్సిందే. కిరణ్! నువ్వెళ్లి ఏడుకో," అని హుంకరించింది. పంతులమ్మగా లక్ష్మి అసమాన చాతుర్యంతో, అనసూయగా గిరిజ చాలా గంభీరంగా, కిరణ్‌గా బేబీ రాణి ఎంతో ముద్దుగా నటించిన నవత ఆర్ట్స "పంతులమ్మ" వర్ణ చిత్రంలో రంగనాథ్ సినిమా హీరో రాజేష్ అవడంవల్ల ప్రేక్షకులకు "సినిమాలో సినిమా" ఓ ప్రత్యేకాకర్షణ సింగీతం శ్రీనివాసరావు స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో ఎన్ కృష్ణంరాజు విశిష్ట పంథాలో నిర్మించిన

జి. వి. జి. పేజీ

ఈ చిత్రంలో దీప, శరత్‌బాబు, రావికొండలరావు, విజయబాల, ప్రదీప్‌కుమార్ ప్రభృతులు పాల్గొన్నారు. డి. వెంకట్రామయ్య మాటలు, రాజన్ - నాగేంద్ర సంగీతం, బాలుమహేంద్ర ఛాయ, వాసు కూర్పు యితర ఆకర్షణలు.

'స్వర్గసీమ' లో శ్రీధర్, ప్రభ





* * 'విచిత్ర జీవితం'లో వాణిశ్రీ

మంచి బాబాయ్

"జనవరిలో జరిగిన చివరి షెడ్యూల్‌లో పతాక సన్నివేశాలను చిత్రీకరించడానికి రెండు లక్షలకు పైగా వ్యయమైంది" అన్నారు శ్రీ బాలాజీ చిత్రనికేతన్ 'మంచి బాబాయ్" చిత్ర దర్శకుడు టి కృష్ణ శోభన్‌బాబు, జయసుధ, జయచిత్ర, శ్రీధర్, సత్యనారాయణ, రాజబాబు, మోహన్‌బాబు, శరత్‌బాబు, కాకటగడ్డ ప్రసాద్, వంకాయల, కె విజయ, నిర్మల, రమాప్రభ, రాధాకుమారి, హిమబిందు పాల్గొన్న ఈ వర్ణ చిత్రానికి టి బాబుల్‌నాథ్, జె లక్ష్మణరావు నిర్మాతలు సత్యానంద్ మాటలు, మహదేవన్ సంగీతం, సుందరబాబు ఛాయాగ్రహణం, తోట శిల్పం, కె. వి రావు సహకార దర్శకత్వం, టి కృష్ణ కూర్పు గల ఈ చిత్రం మార్చి విడుదల

ముచ్చటైన మూడు చిత్రాలు

ఇటీవలే మూడు చక్కని చిత్రాలను ప్రత్యేక ప్రదర్శనలలో చూశాను. "విచిత్ర జీవితం, పంతులమ్మ, దేవదాసు మళ్లీ పుట్టాడు" ఆయా దర్శకుల ప్రత్యేక ముద్రలతో దేనికదే ప్రత్యేకతలను సంతరించుకొని — ఈ సంవత్సరారంభంలో విడుదలైన కొన్ని చిత్రాలవల్ల పరిశ్రమలో ఏర్పడ్డ నిరాశా నిస్పృహలను పూర్తిగా తొలగించగలవన్న నమ్మకాన్ని కలిగించాయి.

మరికొన్ని చిత్రాలు

రాజ్‌బాబు కథ, స్క్రీన్‌ప్లే, ద్విపాత్రాభినయం నిర్వహిస్తూ సంగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో నిర్మించే బాబ్ అండ్ బాబ్ క్రియేషన్స్ వారి "నా పేరే బాబు' చిత్రంలో జయప్రద నాయిక భమిడిపాటి రాధాకృష్ణ మాటలు రాశారు. భాగ్యనగర్ స్టూడియోస్‌లో తయారౌతుంగి "సూర్యచంద్రులు" అనంతరం కె రాఘవ నిర్మించే "అంతులేని వింత కథ" చిత్రంలో సత్యనారాయణ, జయంతిలతోపాటు కొందరు కొత్తవారిని ముఖ్య పాత్రలకు ఎన్నుకుంటారు జంధ్యాల, సి. నారాయణరెడ్డి, రమేష్‌నాయుడు, బాబు, ఇ మోహన్‌దాస్ మాటలు, గీతాలు, సంగీతం, కూర్పు, దర్శకత్వ బాధ్యతలు వహిస్తారు కమలాకర కామేశ్వరరావు దర్శకత్వంలో జాగర్లమూడి రాధాకృష్ణమూర్తి నిర్మించే "వినాయక విజయం" చిత్రం ఫిబ్రవరిలో సెట్స్‌కు వెళ్తుంది వేటూరి రచయిత సంగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో నాచు శేషగిరిరావు నిర్మించే హేరంబ చిత్ర మందిర్ వారి వినోదాత్మక చిత్రంలో సత్యనారాయణ, చంద్రమోహన్ ముఖ్య నటులు డాక్టర్ ఎ రఘురామిరెడ్డి కథ, స్క్రీన్‌ప్లే, నిర్మాణం దర్శకత్వంలో తయారౌతూన్న శ్రీ సత్పురుష ఫిలిమ్స్ "రాధా మాధవ్" వర్ణ చిత్రంలో దీప, పూనా ఫిలిమ్ ఇన్‌స్టిట్యూట్‌లో నటనలో డిప్లొమా పొందిన మోహన్ నాయికా నాయకులు సంగీతం ఎల్ వైద్యనాథన్ ఛాయ బాలు మహేంద్ర శిల్పం గోఖలే సహకార దర్శకుడు పి జనార్ధన రెడ్డి కూర్పు భక్తవత్సలం నిర్మాణ నిర్వహణ ఆర్ ఎస్ ధనుంజయన్, ఎ. జగన్మోహన్‌రెడ్డి

శ్రీ ఎ ఎస్ ఆర్ జ్యేష్ఠపుత్రుని వివాహం

అమెరికాలో బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యాభ్యాసం పూర్తిచేసిన చి. వెంకటనారాయణ ఎం బి ఎ కు, విశాఖపట్నం యూనియన్ కార్బైడ్ మేనేజర్ శ్రీ వీరమాచనేని శివప్రసాద్ కుమార్తె చి సౌ జ్యోత్స్న ఎం ఎ తో ఫిబ్రవరి 27 రాత్రి 11 గం 08 ని లకు అన్నపూర్ణా స్టూడియోస్‌లో కల్యాణ మహోత్సవం జరుగనున్నది. ★

'చల్ మోహనరంగ'లో సరోజ, మోహన్‌బాబు





సినిమా విశేషాలు — శ్రీనివాస్

జనవరి చిత్రాల జాతకఫలం

కొత్త సంవత్సరం "సతీసావిత్రి"తో ప్రారంభమై, పండుగ రోజుల్లో నాలుగు సాంఘికాలతో ప్రేక్షకులను షుమారుగా ఆకర్షించి యిరవైఆరున ఒక మంచి చిత్రంతో మొదటి మాసాన్ని పూర్తిచేసింది

ప్రారంభ మాసంలో విడుదలయిన ఆరు చిత్రాలలో లక్ష్మీ ఫిలింస్ కంబైన్స్‌వారి "సిందు మనిషి"ని వుత్తమ ప్రమాణాలు గొన్న మధురమైన చిత్రంగా పేర్కొనవచ్చు

శ్రీ నాగేశ్వరరావు వేసిన కొత్తతరహా స్టెప్స్ "చిలిపి కృష్ణుడు" విజయానికి, శ్రీ కృష్ణ నటన "ఇంద్రధనుస్సు" విజయానికి కారణంగా చెప్పొచ్చు. కౌముదీ పిక్చర్స్‌వారి "నాయుడుబావ" చిత్రానికి ఘనవిజయం చేకూరగలదని వూహించిన వాళ్లలో యీ విలేఖరి ఒకడు



—శ్రీ శ్రీ శ్రీ 'ఎత్తుకు పైఎత్తు'లో అల్లు రామలింగయ్య, సత్యనారాయణ శ్రీ శ్రీ శ్రీ

"సిందుమనిషి" చిత్రంలో శ్రీ బాలకృష్ణ ఛాయాగ్రహణం, శోభన్‌బాబుగారి అద్భుత నటనా ప్రాభవం, గొల్లపూడిగారి వాడి కలం, శ్రీ లాల్‌గారి దర్శకత్వ ప్రాభవం నిర్మాత అనురాధాదేవిగారి భారీ నిర్మాణం ప్రేక్షకులను (అన్ని తరగతులను) విశేషంగా ఆకట్టుకున్నాయి

శోభన్‌బాబుగారిలో అత్యుత్తమ నటన్ను చూచే అవకాశాన్ని ప్రేక్షకులను కలిగించిన నిర్మాత అనురాధాదేవిని అభినందించాలి

ఎంతపని చేశావు పున్నయ్యా !

అగ్ర దర్శకుడు శ్రీ దాసరి ఏ ముహూర్తాన హాస్యనటుడు శ్రీ మాడాకు "చిల్లరకొట్టు చిట్టెమ్మ"లో కొజ్జా పాత్ర నిచ్చారోగాని, ఆ చిత్ర విజయానికి తోడ్పడినవాళ్లలో ఆ పాత్రధారి ఒకరు కావడం .. నట రంగంలో మాడా స్థానం ఎన్నో రెట్లు పెరిగింది

సినిమా రంగంలో మాడా ఋణపడివున్నది ముగ్గురికి — ఒకరు ఆదుర్తిగారు రెండు శ్రీ అక్కినేని మూడు శ్రీ దాసరి

ఈమధ్య ఒక రోజున దర్శకుల కాలనీలో వసిస్తున్న మాడాను కలిశాను ఆయన కొస్తున్న వుత్తరాలను చూశాను అన్నిట్లో ఒకటే మాట "కొజ్జా" పాత్ర పట్ల ప్రశంసలే ఎంతపని చేశావు పున్నయ్యా అనిపించింది, నాకు

నే వచ్చిన పని గూర్చి మాడాతో చెప్పాను ఆయన వెంటనే ఆసు కవిత్వంలాగా ఒక లిస్టును యమస్పీడుతో చెప్పారు ఈ ఏడు మాడా పని మహాబలంగా వుందని ఆయనిచ్చిన పట్టీ తెలిపింది.

ఆ వివరాలను పాఠకులు తెలుసుకోవాలిగా —

అన్నపూర్ణా కళానికేతన్, భాగ్యనగర్ స్టుడియో, తిరుపతి ప్రొడక్షన్స్, దేవేంద్రా ఆర్ట్ పిక్చర్స్, విష్ణుప్రియ ఆర్ట్ పిక్చర్స్, తుఫాన్ మెయిల్, మరో సీత కథ, పచ్చబొట్టు, లంబాడోళ్ల రాందాసు, మాధవీ పిక్చర్స్, ఓంకార ప్రొడక్షన్స్, ఆడదంటే అలుసా, కొడుకా — కూతురా!, మల్లెపూవు, కరుణామయుడు మరియు ఏ ఏ కంబైన్స్ చిత్రం

ఇన్ని చిత్రాలలో వేస్తున్నది విదూషకుడి పాత్రే అయినా ఒకదానిని బోలిన పాత్ర వీటిలో లేకపోవడం మాడా చేసుకున్న అదృష్టం

కొత్త వత్సరంలో అగ్రదర్శకుని కొత్త పథకం

ఒక దర్శకుణ్ని అగ్రదర్శకుడు అని వ్రాయాలంటే ప్రేక్షకులలో ఆయనకు అద్వితీయమైన పాపులారిటీ వుండాల "అది" వున్న దర్శకులు కొందరే ఆ రోజులలో ఆదుర్తి ఈ రోజులలో దాసరి

శ్రీ రామారావు, శ్రీ నాగేశ్వరరావు ప్రజలలో ఎంత బలీయంగా హత్తుకుపోయారో శ్రీ దాసరి అంతే కావడం ముదావహం

శ్రీ దాసరి చిత్రమంటే ఆ చిత్రానికి ప్రజలు దండిగా ఆసక్తిని ప్రదర్శిస్తారు

కొత్త సంవత్సరంలో మీ పథకం ఏమిటి అని శ్రీ దాసరిని యీ విలేఖరి ప్రశ్నించాడు

"అయిదు స్కోప్ వర్ణచిత్రాలకు దర్శకత్వం వహిస్తున్నాను," అన్నారు శ్రీ దాసరి

శ్రీ దాసరి చిత్రీకరణలో రూపొందనున్న అయిదు స్కోప్ వర్ణచిత్రాలు ఏమిటన, విజయ.. మాధవీ పిక్చర్స్‌వారి "కటకటాల రుద్రయ్య",

తారకప్రభు ఫిలింస్‌వారి మ్యావేవ్ చిత్రం, శైలజ ఎంటర్‌ప్రైజెస్‌వారి "సిరిపురంలో ఓ సిన్నోడు"

దేవీ ఆర్ట్ ప్రొడక్షన్స్‌వారి "రాముడుకాదు కృష్ణుడు" చిత్రాలను స్కోప్‌లో నిర్మించడానికి, ఆ నిర్మాతలు "యస్" అన్నారు

శ్రీ లలితా మూవీస్ అధినేతకూడా తన రెండో చిత్రాన్ని స్కోప్‌లో నిర్మించగల అవకాశం లేకపోలేదు

ఒక దర్శకుడు అయిదు స్కోప్ చిత్రాలను ఒక సంవత్సరంలో చెయ్యడం శ్రీ దాసరితోనే ఆరంభం

ఏం చేసినా, శ్రీ దాసరి ప్రజల మనసును ఆకట్టుకోగలరు మరి

ప్రత్యగాత్మ శిష్యుడి దర్శకత్వం

ప్రముఖ దర్శకుడు శ్రీ ప్రత్యగాత్మ వద్ద అనేక చిత్రాలకు శిష్యరికం చేసిన వారందరు యిప్పుడు దర్శక ప్రముఖులుగా రాణిస్తున్నారు

ఆ ప్రతిభావంతుని గురుత్వాన్ని చవిచూచిన మరో యువకుడు శ్రీ కట్టా సుబ్బారావు యీ ఏడు దర్శక పదవిని నిర్వహించే అవకాశాన్ని పొందారు

వియ్యాలవారి కయ్యాలు

శ్రీ కట్టా సుబ్బారావు దర్శకత్వం నిర్వహిస్తున్న చిత్రానికి యిడిన పేరిది అని విష్ణుప్రియ ఆర్ట్ పిక్చర్స్ అధినేతలు జాగర్లమూడి రాధాకృష్ణమూర్తి నూతి రంగయ్యగార్లు తెలిపారు

కొత్తతరహా కథాగమనం గల కథగా, హీరో కృష్ణ యీ చిత్రానికి తన ప్రశంసలను తెలిపారు ఈ వర్ణ చిత్రంలో కృష్ణ, జయప్రద, రావు గోపాలరావు, నాగభూషణం, సూర్యాకాంతం, ఎస్వరలక్ష్మి, ఛాయాదేవి, మాడా, సత్యేంద్రకుమార్ ప్రధాన పాత్రలను పోషిస్తున్నారు సాంకేతిక శాఖలను జంధ్యాల, సత్యం, వెంకట్ నిర్వహిస్తున్నారు

జూన్ నుంచి షూటింగు ప్రారంభమయ్యే యీ చిత్రానికి ఎన్ శ్రీమన్నారాయణ, యన్ వి సుబ్బారావు సహనిర్మాతలు


గొప్ప అవకాశం!
1.5 కిలో ప్లాస్టిక్ జాడీ
POINT
PREMIUM QUALITY DETERGENT WASHING POWDER
Point
1.5kg. RE-USABLE JAR
శ్రేష్ఠమైన రకం
ఎక్కువ ప్రతిఫలం
1.5 కెజి. శ్రేష్ఠ మైన డిటర్జెంట్ పొడరు
ఇప్పుడు, ఆకర్షకమైన
ఎల్లప్పుడూ ఉపయోగపడే
ప్లాస్టిక్ జాడీలో దొరుకుతుంది.
వెల: రూ.17-95 మాత్రమే
(స్థానిక పన్నులు అదనం)
పాయింట్
అతి నాణ్యమైన
డిటర్జెంట్ ఉతికే పొడర్
వెలను పరిశీలించండి. గుణమును పరీక్షించండి.
మీ అంతట మీరే తెలుసుకోండి.
PDP.59/Tel
గవర్న్‌మెంట్ సోప్ ఫ్యాక్టరీ, బెంగుళూరు వారి నాణ్యమైన ఉత్పాదన మార్కెట్ చేయువారు మైసూర్ సేల్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, బెంగుళూరు



★ ★ ★ ★ ★ ★ 'అన్నదమ్ముల సవాల్'లో జయమాలిని ★…★…★…★…★…★

సినిమా

''జీవనతరంగాలు'' హిందీచిత్రాన్ని శ్రీ బాపయ్య దర్శకత్వంలో నిర్మిస్తున్న శ్రీ రామానాయుడు యీ సంవత్సరంలో తలపెట్టిన మరో హిందీ చిత్రంగా చిలిపికృష్ణుడు వుండగలదు

స్కోప్‌లో దేశంకోసం

సురేష్ ప్రొడక్షన్స్ స్కోప్‌కలర్‌లో ''దేశం కోసం'' చిత్రాన్ని జూన్‌లో ప్రారంభించడం జరుగుతుందని, ఆ చిత్రంలో నలుగురు నాయకులు వుండగలరని శ్రీ నాయుడు తెలిపారు

విదేశాలలో తను నిర్మించదలచిన చిత్రానికి శ్రీ అక్కినేనిని అడగదలచినట్లు నాయుడుగారు చెప్పారు

ప్రియురాలు

శ్రీ లక్ష్మి ప్రొడక్షన్స్ ఈస్ట్‌మన్ కలర్‌లో నిర్మిస్తున్న టీన్ ఏజర్స్ చిత్రానికి ''ప్రియురాలు'' అని పేరిడినట్లు, అయిదో చిత్రాన్ని ప్రారంభించిన శ్రీ ఏ పూర్ణచంద్రరావు తెలిపారు.

శృంగార నాయకుడు కమలహాసన్, యువతరం నటి జరీనావహాబ్ కలిసి నటిస్తున్న మొదటి తెలుగు చిత్రం కూడా యిదే

–ఈ చిత్రానికి కొడైకెనాల్ షూటింగు స్థావరంగా ఎంపిక అయినట్లు, శ్రీ తాతినేని రామారావు వెల్లడించారు (తెలుగు మన్‌మోహన్ దేశాయ్.)

యువతరాన్ని ఆకర్షించి, ఆకట్టుకునే నవరసభరితమైన కథాబలాన్ని గొన్న ''ప్రియురాలు'' వర్ణ చిత్రానికి చక్రవర్తి సంగీతాన్ని, వేటూరి రచన్ను, బాబు కూర్పును, జి వి సుబ్బారావు కళను నిర్వహిస్తున్నారు

ఒకే షెడ్యూలులో ''ప్రియురాలు'' పూర్తి కాగలదని, దర్శకుడు శ్రీ తాతినేని రామారావు తెలిపారు లక్ష్మి విడుదల

విదేశీయులను ఆకర్షించిన రెడ్డి చిత్రం

మదరాసులో జరిగిన అంతర్జాతీయ చిత్రోత్సవంలో పాల్గొన్న విదేశీ ప్రతినిధులు శ్రీ మృణాల్‌సేన్ రూపొందించిన ''ఒక వూరి కథ'' చిత్రాన్ని విశేషంగా అభినందించారు

శ్రీ ప్రేమచంద్ వ్రాసిన ఓ చిన్ని కథ ''కఫన్'' యొక్క తెలుగు రూపమే ''ఒక వూరి కథ'' అన్నారు నిర్మాత పరంధామరెడ్డి.

ఈ చిత్రానికి ''టైమ్స్'' పత్రిక సినిమా విలేఖరి డేవిడ్ రాబిన్సన్ సత్యజిత్‌రేగార్లు ప్రశంసల వర్షాన్ని కురిపించారు

శ్రీ పి కోదండరామిరెడ్డి సమర్పిస్తున్న ''ఒక వూరి కథ'' చిత్రాన్ని త్వరలో నవయుగ విడుదల చేస్తారు

ప్రతి వ్యక్తిని ఆలోచింపచేసే ఉత్తేజపూరితమైన భావ సంఘర్షణ కథనమే మృణాల్‌సేన్ చిత్రించిన ''ఒక వూరి కథ''

హిందీలో చిలిపికృష్ణుడు

తెలుగులో అమోఘ విజయాన్ని సాధించిన ''చిలిపికృష్ణుడు'' చిత్రాన్ని, హిందీలో నిర్మించే వుద్దేశ్యాన్ని సురేష్ అధినేత వెల్లడించారు

ం—ం—ం—ం—ం—ం—ం 'మంచి బాబాయి'లో ఒక సన్నివేశం ం—ం—ం—ం—ం—ం—ం



హార్లిక్స్



ఆరోజుకు ఆరోజు రోగనివారణ శక్తిని పెంచి ఆరోగ్యాన్ని కాపాడే పౌష్టికాహారం.

హార్లిక్స్ నిత్యం సేవించినట్టయితే, మీ కుటుంబానికి రోగాలు రాకుండాతట్టుకునే శక్తి పెరుగుతుంది. వారికి సంపూర్ణ-మయిన ఆరోగ్యం చేకురుతుంది. ఆరోగ్యం మహాభాగ్యం.

హార్లిక్స్, ప్రపంచం అంతటా డాక్టర్లు సిఫార్సు చేసేది ఇది ఒక్కటే, మీకు అత్యధికంగా పుష్టి ఇచ్చేది ఇది ఒక్కటే ఎందుచేతనంటే ఇందులోను సంపన్నమయిన స్వచ్ఛమయిన పదార్థలు; అపూర్వమయిన హార్లిక్స్ పద్ధతి ప్రకారం సమ్మిళితమితాయి. దీనివల్ల ఏటి సహజ సద్గుణాలు నష్టంకావు. అవి సులువుగా జీర్ణం అవుతాయి.

అందువల్లనే సుచిత్ర హార్లిక్స్‌ని తన కుటుంబ జీవితంలో భాగంగా చేసుకుంది.

సుచిత్ర మోస్తరుగానే మీరుకూడా మీకుటుంబానికి ప్రతిరోజు హార్లిక్స్ ఇవ్వండి వారు ఆరోగ్యంగా, బలంగా పెరగడం మీకు కనబడుతుంది.

"హార్లిక్స్ ప్రధానమయిన పుష్టి సాధనం. మీకుటుంబంలోనివారికి వ్యాధులు రాకుండా తట్టుకునే శక్తి పెరిగేందుకూ వారు ఆరోజుకారోజు ఆరోగ్యంగా, చురుగ్గా ఉండేందుకూ నేను హార్లిక్స్‌ను సిఫారుసు చేస్తున్నాను"



హార్లిక్స్ మంచి పుష్టికరమైనది

హార్లిక్స్ రిజిష్టర్డ్ ట్రేడ్ మార్క్.

ప్రశ్నావళి

హెచ్. జి - కోటగిరి

ఆడది గొప్పదా? మగవాడు గొప్పవాడా?

★ ఎవరూ గొప్పవారు కాదు — ఒకరు లేక ఇంకొకరు సంపూర్ణమైన వ్యక్తి కాదు కనుక!

జి. బి ఎస్. వల్లేరుపాలెం

పెద్దకొడుకు కూడా తండ్రిలాగా తాగుబోతై పోతాడా? అలా అయితే ఈ సంసారాన్ని వదిలిపెట్టి ఆశ్రమంలో చేరుదామనుకుంటున్నాను.

★ అది పిరికితనం. చిన్నతనంనుంచీ పిల్లలకి తల్లి తండ్రి మీద గౌరవం వుండేలా చూసుకోవాలి. అది కోల్పోయిన తండ్రిని ఖాతరు చేయరు పిల్లలు. ఆ తండ్రి కనీసం మనిషిగానైనా చూడని తల్లిని యింకెందుకు గౌరవిస్తారు? తల్లి చిన్నతనంనుంచి క్రమశిక్షణతో పెంచి — కొట్టవలసినప్పుడుకొట్టి ముద్దుచేయవలసినప్పుడు ముద్దుచేస్తే — ఏ పిల్లలూ ఇలా తయారవరు. ఇంట్లో ఆడదానికి గౌరవం యివ్వకపోవడంవల్ల వచ్చిన విషమస్థితి ఇది. దీన్ని పట్టుపట్టి మార్చే ప్రయత్నం చేయాలి. ఇప్పటికేనా మునిగిపోయినది లేదన్న ధైర్యం కూడకట్టుకోవాలి. ఒక్కసారి శక్తిస్వరూపం చూపెట్టి — పుత్రరత్నానికి కనువిప్పు కల్గించండి; లేదా బయటికిపోయి బ్రతకమనండి!

ఎ ఆర్. — బరంపురం

మిమ్మల్ని నేను అభిమానిస్తాను. కాని 'నీవల్ల నా పెళ్లాం చెడిపోతుంది' అనే పురుషునికి ఏం జవాబిస్తారు?

★ తుమ్మితే ఊడే ముక్కులా ఆ పెళ్లాన్ని పట్టుకు వేలాడ్డం ఎందుకంటాను?! వెన్నెముక లేని ఆడదన్నా మగవాడన్నా నాకాట్టే గౌరవంలేదు.

బి వి. ఆర్. — కాకినాడ

కాలం ఎందుకు మన కిష్టంలేనప్పుడు గడిచిపోతూవుంటుంది?

★ అదే దాని లక్షణం! కాలం, ఎక్కువ భాగం మనం బాగా చేయనప్పుడు, ఇంకాస్త భాగం ఏం చేయనప్పుడు, మిగిలినది కాస్తా — కూడనిపని చేస్తూన్నప్పుడూ గడిచిపోతూ వుంటుంది!!

డి ఎస్ ఎస్. — కడప

మీకు వంటింటి కబుర్లు చెత్త జవాబులు తప్ప విజ్ఞానం వినోదం కల్గించే భావాలు కల్గవా?

★ శ్రీనివాసా! ఎందుక్కల్గవు బాబూ, కల్గుతాయి వాటిని ద్వంద్వార్థపూరిత సంభాషణలుగానూ, వినోదం కోసం జయమాలిని నాట్యంగానూ మార్చుకోవచ్చు ఎప్పటికేనా అని దాచి

అంటూ వచ్చి సురేఖ ప్రక్కనే మంచంమీద ఎర్చుకోని కూర్చుంది రాణి.

"హాట్ న్యూసా!... నేనా?!..." రాణి ఏ విషయం గురించి చెప్తూందో కొద్దిగా వూహించగల్గినా, ఏం తెలియనట్లే మొహం పెట్టింది సురేఖ

"యింక చాల్లేవోయ్ నీ అమాయకత్వం! కమల్‌హాసన్‌ని మూడు చెరువుల నీళ్లు త్రాగించింది కాక ఏం తెలియనట్లు యిదొక పోజు."

"అసలేమయ్యిందీ?" సుజా అడిగింది.

రాణి సవిస్తారంగా విశదీకరించి, "అంతేకదూ సురేఖా!" అంది.

"చాలా బాగా బుద్ధి చెప్పావు. అల్లాంటి వాళ్లకు అల్లాగే కావాలి" కసిగా అంది సుజ.

మనసులో సురేఖ అంటే ఒక విధమైన జెలసీకూడ వుంది

నవ్వేసింది సురేఖ

"నేనేం కావాలని చెయ్యలేదు. అతనంటే నా కెటువంటి అభిప్రాయమూ లేదు. అతను కాక యింకెవరు వచ్చినా యిలాగే ప్రవర్తించేదానిని పాపం! అతను సుకుమార్ అయిపోయాడు కాబట్టే ఆ న్యూస్ అంత హాట్ అయిపోయింది" అంది నిదానంగా

రాత్రి పడుకుంటే మాత్రం నిద్ర రాలేదు

మాటిమాటికీ సుకుమార్, ఆ రోజు జరిగిన సంఘటనే గుర్తుకు వస్తూంది దగ్గర దగ్గర మూడేళ్లకు ముందు శేఖరంగారన్న మాటలు కూడ గుర్తుకు వస్తున్నాయి

అవే ఆలోచిస్తూ ఏ మధ్య రాత్రో నిద్ర పోయింది సురేఖ

సుకుమార్ కూడ అంతే! ఎంత తనను తాను సముదాయించుకుందామన్నా సురేఖ చూపిన నిరసన, చేసిన యిన్‌సల్ట్ మరీ మరీ జ్ఞాపకం వచ్చి ఆ రాత్రి నిద్రకు దూరం చేశాయి

దాదాపు యింకో మూడు నెలలు గడిచి పోయాయి

అప్పటికి ఆ సంగతి చాల పాతబడిపోయింది

ఆ రోజు మెయిన్ బిల్డింగ్ కెళ్లి ప్రక్కనున్న స్వర్ణతో కలిసి త్వరత్వరగా మెట్లు దిగసాగింది సురేఖ నెక్స్ట్ పీరియడుకు టయిము అవుతూందన్న ఆత్రుతతో కాళ్లకు చీర అడ్డంపడి ఒక్కసారిగా తూలింది. కళ్లకు అంతా చీకటిగా అయిపోయింది అంతలో ఏమయ్యిందో తెలియదు రెండు మూడు మెట్లు క్రిందకు దొర్లినట్లే గుర్తు "స్వర్ణా! అబ్బా!" అంటూనే వుంది. చప్పున బలమైన చేతులు గట్టిగా పట్టుకున్నట్లనిపించింది. తన్ను తాను నిల్రదొక్కుకొని కళ్లు తెరవడానికి అయిదు నిముషాలు పట్టింది.

కళ్లు తెరవంగానే మొదట కన్పించింది సుకుమార్!

రెండు చేతుల్తో తన భుజాల్ని గుచ్చిపట్టి ఆత్రుతగా చూస్తున్నాడు.

పక్కనే స్వర్ణ వుంది.

"ఏమయ్యింది సురేఖా?" అని అడుగు తూంది.

మెల్లగా సుకుమార్ చేతుల్లోంచి విడిపించుకొని "ఏమీ అవలేదు పూర్కే కొంచెం కళ్లు తిరిగాయి అంతే!" అంటూ చిన్నగా నవ్వేస్తూ ముందుకు అడుగు వెయ్యబోయింది కాలిమడమలో ఏదో కలుక్కుమన్నట్లయి "అబ్బా!" అంది ఎంత ప్రయత్నించినా ముందుకు అడుగు వెయ్యలేకపోయింది.

చివరికెలాగో సుకుమార్ బలవంతంచేసి,స్వర్ణ సహాయంతో మెల్లగా నడిపించి బయటకు తెచ్చాడు

సురేఖ వద్దు నేను యెల్లాగో హాస్టలుకు వెళ్లిపోతానంటున్నా వినకుండా, కొంచెం బలవంతంగానే ఓ రిక్షాను పిలిచి, అందులో యిద్దర్నీ కూర్చోమని చెప్పి, హెల్త్ సెంటరుకు పోనివ్వమని చెప్పాడు.

వెనక తనూ తన బుల్లెట్‌మీద వెళ్లాడు

సురేఖా సుకుమార్

[24 వ పేజీ తరువాయి]

లేడీ డాక్టరు సురేఖ కాలిని పరీక్షచేసి అదేదో కాలి నరం బెణికిందంటూ ఓ ఇంజక్షను యిచ్చి, నొప్పి తగ్గడానికి మాత్రలు యిచ్చింది మళ్లీ మరుసటిరోజు వచ్చి ఇంజక్షను చేయించుకోమంది.

సుకుమార్ సురేఖను, స్వర్ణను హాస్టలు గేటు వరకు దింపి, వాళ్లు మేము యిస్తామన్నా వినకుండా రిక్షావాడికి తనే డబ్బులిచ్చి పంపేసి, మరుసటిరోజు వస్తానని చెప్పి వెళ్లిపోయాడు.

ఆరోజు రాత్రి సురేఖ కాలి బాధ యెలా వుందో అన్న ఆలోచనల్తోనే గడిచిపోయింది మాటిమాటికీ తను సురేఖను పొదివిపట్టుకున్న దృశ్యమే కళ్లముందు కన్పిస్తూంది. బాధతో కళ్లు మూసుకున్న సురేఖ అందమైన మొహం జ్ఞాపకం రాసాగింది. అప్రయత్నంగానే తన రెండు అరచేతుల్నీ ఆప్యాయంగా తడుముకొని సున్నితంగా ముద్దు పెట్టుకున్నాడు

సురేఖకు కాలి బాధకన్నా సుకుమార్ ప్రవర్తనే బాధాకరంగా అన్పించి ఆ రాత్రి నిద్రరాలేదు అసలు ఆ వార్త మరుసటిరోజుకు యెలా ప్రచారమవుతుందోనని ఆందోళనపడింది

అనుకున్న విధంగానే మరుసటిరోజు తెల్లవారి తొమ్మిదయ్యేసరికి, సురేఖ కాలి సంగతి, సుకుమార్ సేవ సంగతి చిలవలుపలువలుగా యింకాస్త ఊహల్తో అందమైన కథగా ప్రచారంలోకి వచ్చేసింది.

సురేఖ కాలి నొప్పి వున్నన్నాళ్లూ సుకుమార్ రెండుపూటలా వచ్చి పరామర్శించిపోయేవాడు

తర్వాత సురేఖ కాలు బాగా అయిపోయినా, సుకుమార్ సురేఖకోసం రావడం మానలేదు విజిటర్స్ డే వున్నప్పుడంతా వచ్చేవాడు అలా సుకుమార్ రావడం యిష్టంలేకపోయినా మొహమాటానికి ఏమీ అనలేకపోయింది

కె. రామలక్ష్మి

వుంచేస్తాను! సామాన్య మానసికి వంటిల్లో కాస్త చెత్తా ఆరోగ్యాన్నిస్తాయని యిలా కాలక్షేపం చేస్తుంటాను,

ఆంధ్ర సంస్కృతి, ప్రాచీన చరిత్రలో స్త్రీకి నేటి సమాజంలో స్త్రీకి ఎంత ప్రాముఖ్యముందో సెలవిస్తారా?

★ అప్పుడూ ఇప్పుడూ కూడా—ఈ సంఘంలో స్త్రీకి పురుషుడు యిచ్చిన, ఇస్తున్న ప్రాముఖ్యమే - న్యాయంగా చెలామణి అవుతోంది!

ఎ. వి ఆర్ — విశాఖపట్నం

మీరు చాలా అందంగా వుంటారని చాలా మంది చెప్పారు. నేను మీ యింటికి రావచ్చా? నేను పదవ తరగతి చదువుతున్నాను అర్హురాలినా కానా?

★ 'గాత్రానికి గాడిద అందానికి ఒంటె' సరైతే అందానికి నన్నూ చెప్పుకోండి! పదవ తరగతికీ నన్ను చూడడానికీ సంబంధం లేదు గాని — చెప్పివస్తే దడుసుకోకుండా వెడతారంతే!!

కె. ఎస్. ఆర్. — హైదరాబాదు.

మగవాడు వయస్సులో తనకన్న పెద్దదయిన ఆడదాన్ని పెళ్ళాడితే సంఘం, పెద్దలు హర్షించ రెందుకు?

★ కొన్నాళ్ళు పోయాక చేసుకున్నవాడే హర్షించడు కనుక! స్త్రీ వయస్సు త్వరగా పెరుగుతుంది బాధ్యతలవల్ల...అందుకే త్వరగా ముసలిదై పోయినట్టు కన్పిస్తుంది; అందుకే వయస్సులో చిన్నదాన్ని చేసుకోడం - ఒక ఆచారంగా పెట్టారంతే —

టి. ఎస్. ఎన్. ఎమ్. — కరీంనగరు

వరకట్నం నిషేధించాలనే స్త్రీలే తమ కొడుకులకు కట్నం బాగా రావాలంటున్నారు..

★ కొడుకులకి నాలుక లేదా — అభ్యంతరం చెప్పడానికి! సంపాదనకి ఉపక్రమించని పుత్రరత్నాలు పెళ్ళికి సిద్ధపడ్డంలో ఎంత అర్థం లేదో—కట్నం మాట ఆడవారి మీదికి నెట్టేయడం లోనూ — అంతే అర్థంలేదు.

కె. పి. ఆర్. — రాయగడ

మగవాళ్ళకంటె రెండాకులు ఎక్కువ చదివిన స్త్రీని పెళ్లి చేసుకుంటే ఆ స్త్రీ గర్వముతో భర్తకదా అని కొంచెమైన గౌరవం యివ్వని...

★ నీ బాధ అర్థం అయింది సోదరా, ఎందుకొచ్చిన బాధ. అస లక్షరాలు రాని స్త్రీని చూసి పెళ్ళాడు (అక్షరాలెలాగా రాలేదన్న కసికొద్దీ కాల్చుకుతినకలదు!)

కానీ అతనొచ్చినప్పుడు ఏమీ మాట్లాడేది కాదు.

సుకుమారే ఆ విషయం ఈ విషయం చెప్పి తనే మాట్లాడేవాడు. పైకి వ్యక్తపరచకపోయినా సుకుమార్ అలా రావడం, మాట్లాడ్డం ఇష్టమే సురేఖకు

తను ఏం మాట్లాడినా ఏ విధమైన ఎంకరేజ్‌మెంట్ ఇవ్వక బుద్ధావతారంలా కూర్చునే సురేఖ ఏమాత్రం అర్థంఅయ్యేదికాదు సుకుమార్‌కు ఇంతవరకు అమ్మాయిలు తన ముందు వాగుపోతూ గంటలకు గంటలే తనతో మాట్లాడ్డం తెలుసు కానీ విచిత్రం యిప్పుడు సురేఖ ముందు తను వాగుడుకాయ అయిపోతున్నాడు ఒక్కోసారి సురేఖ ప్రవర్తనకు చాల విసుక్కునేవాడు

''ఛస్! ఈ అమ్మాయికోసం నేనేమిటి ఇలా అయిపోవడం? తను కావాలనుకుంటే తన చిర్నవ్వుకోసం ఆరాటపడే అందమైన అమ్మాయిలు చాలమందే వున్నారు. అయినా అదేమిటో సురేఖను చూస్తూవుంటే తనను తాను మర్చిపోతాడు ఎంత నిగ్రహంగా వుండాలనుకున్నా తనకు తెలియకుండానే గుండె వడివడిగా కొట్టుకుంటుంది అనవసరంగా అరచేతుల్లో చిరుచెమట పడుతుంది బహుశా ప్రేమంటే ఇదేనేమొ! ఇంతకుముందు యెంతమంది అమ్మాయిల్ని చూసినా, మాట్లాడినా యెప్పుడూ ఇలా ఫీలవలేదు అంటే ... తను సురేఖను ప్రేమిస్తున్నాడా?! మరి సురేఖనో!.. ఈసారి ఏమైనాసరే ఆమె అభిప్రాయం కనుక్కోవాలి''

ఈసారి ఈసారి అనుకుంటూనే యింకో రెండు నెలలు గడిచిపోయాయి

ఫైనల్‌టర్మ్

పరీక్షలు దగ్గరపడుతున్నాయి

సురేఖ, రాణి, సుజాత కష్టపడి చదువుతున్నారు

ఎన్నడూలేనిది సుకుమార్ కూడ కుదురుగా పుస్తకం పట్టుకొని చదవడం మొదలుపెట్టాడు.

పరీక్షలు అయిపోయాయి.

అనుకున్నదానికంటే బాగానే వ్రాశారు అందరూ.

మరుసటిరోజ ప్రొద్దున్నే వూరి కెళ్లిపోవాలనుకుంది సురేఖ

ఆరోజు సాయంత్రం ఆరుగంటల ట్రయినుకు వెళ్లిపోయారు సుజా, రాణీలు.

మధ్యాహ్నం మూడుగంటలకు వచ్చాడు సుకుమార్.

మోటారు సైకిలు శబ్దం వింటూనే సామాన్లు సర్దుకుంటున్న రాణి చిన్నగా నవ్వింది

''సురేఖా! మీ హీరోగారు వచ్చేసినట్లున్నారు'' అంటూ

యిప్పుడు సుకుమార్ వస్తే అది సురేఖ కోసమేనని అందరికీ తెలుసు.

సురేఖ కూడ చిన్నగా నవ్వేసి, చెప్పులు వేసుకొని క్రిందకు వచ్చింది

ఇద్దరూ వెళ్లి విజిటర్స్ హాల్లో కూర్చున్నారు

సురేఖ ఎప్పటిమాదిరే చేతివేళ్లవైపు చూసుకుంటూ కూర్చుంది.

సుకుమార్ ఏదేదో మాట్లాడాలనుకుని వచ్చాడు కాని ఏం మాట్లాడాలో తెలియడంలేదు

తను మాట్లాడకపోతే సురేఖ కూడ మాట్లాడకుండా తన చేతివ్రేళ్ల గోళ్ల అందాన్ని చూసుకుంటూ ఎంతసేపయినా కూర్చోగలదని తెలుసు సుకుమార్‌కు

చివరికి మెల్లగా తనే అడిగాడు

''రేపు వెళ్లిపోతారనుకుంటాను.''

''అవును!''

''యింకో రెండు నెలలవరకు మనం యిలా కలుసుకోవడం, మాట్లాడుకోవడం పడదుకదూ!''

''అవును!'' యీసారి చిన్నగా నవ్వేసింది సురేఖ

''మీరేం అపార్థం చేసుకోకపోతే ఒక్క మనవి.''

''ఏమిటి?''

''మీ అడ్రసు యివ్వండి. నేను లెటర్సు వ్రాస్తాను — మీకేం అభ్యంతరం లేకపోతేనే.''

''అబ్బే! నాకు అభ్యంతరం ఏం లేదు అందులో తప్పూ లేదు పోతే మీకూ తెలిసే వుంటుంది మనకంటే ఓ తరం ముందు పుట్టిన మన అమ్మావాళ్లకు యిది నచ్చదు పైగా నా పేరు మీదంటూ వుత్తరాలు వస్తే ముందు తనే తీసి చదువుతుంది. ఒకళ్ల వుత్తరాలు చదవడం మ్యానర్స్ కాదని తెలిసినా కూతురి విషయంలో తల్లి అలాంటి పాటింపులు పాటించదు ఇక దాంతో ''ఎవరు?. ఏమిటి?'' అంటూ సవాలక్ష ప్రశ్నలు బయలుదేరుతాయి అందుకోసం అడ్రసు యివ్వలేను ఇవ్వనందుకు ఏం అనుకోవద్దండి''

ఎప్పుడూ నాల్గయిదు పదాలకంటే ఎక్కువగా మాట్లాడని సురేఖ అంత పెద్ద లెక్చరిచ్చేసరికి యింకేం అడగగలడు?...

కొద్దిసేపు మౌనంగా వుండి అడిగాడు

''సురేఖా! మిమ్మల్ని ఒక మాటడగాలి''

''అడగండి.''

''మీకు... మీకు అభ్యంతరం లేకపోతే మిమ్మల్ని నేను పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను.''

ఈ రోజు అలాంటి టాపిక్కే ఏదో వస్తుందని వూహించిన సురేఖ అసలేమీ తెలియనిదానిలా చక్రాల్లాంటి కళ్లను ఎత్తి గుండ్రంగా తిప్పి సుకుమార్ కేసి చూసింది ఆశ్చర్యంగా

ఆ కళ్లను చూస్తూ మైమరచిపోయాడు సుకుమార్.

''నిజం సురేఖా! మిమ్మల్ని పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను.''

"అది జరగదులెండి."

"అదేం ?! . మీకు నేనంటే యిష్టం లేదా ?" భయపడిపోతూ అడిగాడు.

"యిష్టాయిష్టాల సంగతి ఎందుకులెండి. మీరు డబ్బు గలవాళ్లు మాకు అంత డబ్బు లేదు మీక్కావలసిన కట్న కానుకలు భరించే శక్తి మా అమ్మకు లేదు."

బాధగా చూశాడు సుకుమార్.

"ఎంత తేలిగ్గా అంచనా వెయ్యగలిగారు సురేఖా ! ఈ క్షణం వున్నపళాన వస్తే మిమ్మల్ని తీసికెళ్లి రిజిష్టరు పెళ్లి చేసేసుకుంటాను." ఆవేశంగా అన్నాడు

ఫక్కున నవ్వింది సురేఖ.

సురేఖ అంత యిదిగా నవ్వడం ఎప్పుడూ చూడని సుకుమార్ ముగ్ధుడయిపోయాడు.

"మీరు నమ్మడంలేదేమో ! నిజంగానే నా మనస్సాక్షిగా చెప్తున్నాను." చిన్నబుచ్చుకున్నట్లు చెప్పాడు.

"అబ్బే ! నాకు మీమీద నమ్మకం లేకకాదు. మీ నాన్నగారో... ఆయన ఒప్పుకుంటారా? అని."

"ఒప్పుకుంటే సరి, ఒప్పుకోకపోయినా నాకేం బాధలేదు. నా భార్యను నేను పోషించుకోగలను."

"అయితే నాకు అభ్యంతరం ఏం లేదు. పోతే నా తరఫున వున్నది మా అమ్మ ఒక్కతే. ముందు చెప్తే అసలు ఒప్పుకోదు. అందుకోసం పెళ్లయ్యాక ఒకేసారి చెప్తాను."

సురేఖ ధైర్యానికి ముందు ఆశ్చర్యపోయినా మెచ్చుకున్నాడు సుకుమార్.

"సరే ! యిక లేద్దామా ?!... ముందు మీరు మీ నాన్నకు యిష్టమవునో కాదో తెలుసుకోండి."

"అల్లాగే ! ఈ రెండు నెలల్లో మీరు నన్ను మర్చిపోరుకదూ !" తహతహగ సురేఖ కళ్ళల్లోకి చూశాడు సుకుమార్.

"అల్లాంటిదేమన్నా జరిగితే మీవైపునుండే జరగాలి వస్తాను."

లోపలికి వెళ్లిపోయింది సురేఖ.

మరుసటిరోజు బస్సు స్టాపులో సురేఖ దగ్గరే గడిపాడు సుకుమార్.

బస్సు కదిలేంతవరకు అక్కడే, బస్సు కంటికి కన్పించనంతదూరం వెళ్లిపోయాక చిన్నగా నిట్టూర్చి, వెళ్లి మోటారుసైకిలు స్టార్టు చేశాడు.

ఇంటికి వెళ్తూనే సుకుమార్ పెళ్లి ప్రస్తావన తీసుకురాకముందే శేఖరంగారు చెప్పారు.

"ఒరేయ్ ! నీకు మీ అమ్మ ఏమైనా చెప్పిందా ?"

"లేదు నాన్నా !"

"అది ఏమాటయినా యెప్పుడు చెప్పిందని ఇప్పుడు యిది చెప్పడానికి ? ... సర్లే ! అసలు విషయం రేపు నీకు పెళ్లిచూపులు. అంటే ఆ అమ్మాయిక్కూడా. లక్షన్నర కట్నం. పిల్ల కూడ బాగానే వుంటుందిట. అసలు సంబంధం పూర్తిగా సెటిలయిపోయినట్లే అనుకో. పోతే ఈ లాంఛనాలు వున్నాయికదా వాళ్ల

సురేఖా సుకుమార్

ముచ్చటకోసం. ." శేఖరంగారు ఇంకా చెప్తూనే వున్నారు.

సుకుమార్ చెప్పేశాడు.

"నాకు ఆ పెళ్లి ఇష్టంలేదు నాన్నా !"

సుకుమార్ ఊహించినట్లు శేఖరంగారు ఉలిక్కిపడలేదు. కోపంతో విరుచుకుపడనూలేదు.

నింపాదిగా కాస్త హేళన ధ్వనించే కంఠంతో అన్నారు.

"ఎందుకు ? ... ఎందుకు యిష్టం లేదోయ్ ? ! ... ఎవరినయినా కాలేజీ అమ్మాయిని ప్రేమించావంటావా ఏమిటి ?"

"అవును నాన్నా ! నాకు జూనియరు ప్రీవియస్ యం. యస్సీ. చదువుతోంది."

"సర్లే ! ఆ డిగ్రీల సంగతి నాకెందుకుగానీ మనకు ఏపాటి కట్నం యివ్వగలరు ?"

"ఆ అమ్మాయికి తల్లి మాత్రమే వుందట కట్నం యిచ్చేపాటి ఆస్తిపాస్తులేం లేవుట."

బిగ్గున నవ్వేశారు.

"ఆవిడ చెప్పింది. నువ్వు నమ్మేశావు. చాల గొప్పవనే ... సర్లే ! ఇంతవరకు ప్రేమించింది చాలుగాని నేను చెప్పిన అమ్మాయిని పెళ్లి చేసుకోని సుఖపడు." వెళ్లిపోబోయారు.

"లేదు నాన్నా ! మీరేమన్నా సరే నేను ఆ అమ్మాయిని తప్ప ఇంకో అమ్మాయిని పెళ్లి చేసుకోను. అంతే !" అక్కణ్నుండి వడివడిగా వెళ్లిపోయాడు సుకుమార్.

వెళ్లిపోతున్న కొడుకునే చూస్తుండిపోయారు.

దాదాపు మూణ్ణెల్ల తర్వాత వున్నట్టుండి ఇంటిముందు టాక్సీ ఆగేసరికి బయటికి వచ్చి చూశారు శేఖరంగారు.

సుకుమార్ !... సుకుమార్‌తోబాటు ఎవరో అమ్మాయి !... ఆ అమ్మాయిని ఎక్కడో చూసిన గుర్తు ... ఎక్కడో ? ... జ్ఞాపకం తెచ్చుకుంటున్నంతలో ఇద్దరూ వచ్చి తన కాళ్లకు మొక్కారు

"ఆశీర్వదించండి నాన్నా !" అన్నాడు సుకుమార్.

ఏమని ఆశీర్వదించగలడు ? !

"నువ్వు ... నువ్వు..." ఏదో గుర్తుకు తెచ్చుకుంటున్నాడిలా సురేఖనే చూడసాగాడు

"నేను ... నేనే మామయ్యా ! సురేఖారాణిని! మీ రాజేశ్వరమ్మ కూతుర్ని. మీ మేనకోడల్ని !" తొణక్కుండా జవాబు చెప్పింది సురేఖ.

శేఖరంగారితోబాటు సుకుమార్ కూడ ఆశ్చర్యపోయాడు.

* * *

ఇంట్లో రాజేశ్వరమ్మ కూడ ఆశ్చర్యపోయింది

ఎప్పుడూ మౌనంగా, ముభావంగా, అమాయకంగా వుండే సురేఖలో ఇంత తెగింపూ, ఎప్పుడో అన్న మాటమీద అంత జ్ఞాపకం పెట్టుకోని పని సాధించడం — నిజంగానే ఆశ్చర్యపోయింది.

సురేఖ హాస్టలు నుండి వ్రాసిన ఉత్తరం యింకా చేతుల్లోనే వుంది

అమ్మకు,

నమస్కరించి నీ సురేఖ వ్రాయునది ఈ విషయం చదివాక నేను చేసిన పనికి నీవు కోపగించుకుంటావో, అభినందిస్తావో ఊహించలేకుండా వున్నాను. ఏమైనా నేను వ్రాయబోయే విషయాన్ని ఓపిగ్గా చదువుతావని ఆశిస్తాను.

సుకుమార్ మీ అన్నయ్య శేఖరంగారి కుమారుడు. ఒకప్పుడు నన్ను చేసుకొమ్మని అడిగితే ఏ.వం కానీ కట్నం ఇవ్వలేమని హాస్యాస్పదంగా తీసేసిన మీ అన్నయ్య కొడుకు ఇక్కడే యూనివర్సిటీలో చదువుతున్నాడు. అతనంటే ముందు నాకేవిధమైన అభిప్రాయమూ వుండేది కాదు. కానీ అతణ్ణి చూస్తూనే కొద్దిగాపోల్చుకున్నాను మావయ్య పోలికలు అతనిలో ఎక్కువగా వున్నందుకు. పైగా మాటల సందర్భంలో వాళ్ల వూరి పేరూ, నాన్నగారి పేరూ తెలుసుకుంటూనే నా అనుమానం నిజమయ్యింది. పైగా అతడు నామీద కొద్ది కొద్దిగా యింటరెస్టు చూపిస్తూ వుంటే దానికి దోహదం చేస్తూ వచ్చాను చివరికి నేను శలవులకు యింటికి వచ్చేముందు నన్ను పెళ్లి చేసుకుంటానన్నాడు. నేను మాత్రం ఎవరో అతనికి తెలియకుండా చాల జాగ్రత్త పడ్డాను. మేము కట్నం యివ్వలేమని ఖచ్చితంగా చెప్పేసినా, అతను నేనే కావాలని పట్టుబట్టాడు. ముందు ఏదో సరదాకని తీసేసినా అతడు నిజంగానే నన్ను గాఢంగా ప్రేమిస్తుంటే ఏం బాగు ?... అందులో ఎవరో కాదు. స్వంత మేనమామ కొడుకే. అందుకోసమే ఒప్పుకున్నాను. ఈ రోజు రిజిష్ట్రారాఫీసులో పెళ్లి. పెళ్లయ్యాక మీ అన్నయ్య — మా మావయ్య యింటికి వెళ్లడం — ఏ విధమైన సత్కారం లభించినా నేను ఆ యింటి కోడలినేకదా !... నీకు ముందు ఎందుకు తెలపలేదంటావేమో ?... చెప్తే లేనిపోని రభస అవుతుందని భయపడ్డాను. నేను ఎవరో కాని వాణ్ని చేసుకుంటే నువ్వు బాధపడాలి కాని నీకు యిష్టమైన మీ అన్నయ్య కొడుకే అయినప్పుడు యిక కోపగించుకోవనుకుంటాను. మావగారింటి నుండి నేరుగా మనింటికే వస్తాను

నీ ముద్దుల కూతురు,

"సురేఖ"

సురేఖ వచ్చేవరకు వుండామని ఎంత నిగ్రహించుకున్నా వుండలేకపోయింది. వెంటనేబస్సెక్కి అన్నయ్య వూరికి బయల్దేరింది రాజేశ్వరమ్మ.

"రా రా ! ఫర్వాలేదు నీ కూతురు. . ఆహాహా నా కోడలు !.. నేనేనంటే నాకంటే మించిపోయింది " అంటూ ఆహ్వానించారు శేఖరంగారు చెల్లెల్ని

కొద్దిగా స్థిమితపడి చుట్టూ చూస్తున్న రాజేశ్వరమ్మ, కూతురు దగ్గరకు రాగానే ఆప్యాయంగా హృదయానికి హత్తుకుంది.

సుకుమార్‌ను సంతోషంగా చూసింది

ఆ రోజు రాత్రి "నిజంగా నువ్వు చాల గట్టిదానివి సురేఖా ! మనసులో యింత పెద్ద ప్లాను పెట్టుకోని పైకి ఎంత బెట్టు చూపించేదానవు " అన్నాడు సుకుమార్, తన చేతుల్లో గువ్వలా ఒదిగిపోతున్న సురేఖను మరింత గట్టిగా హృదయానికి హత్తుకుంటూ

ఫాలాక్షుని డైరీ

శీలంలేని కోడి...

ఆలిండియా రేడియోలో వార్తలు చదివేటప్పుడు ఓ ఉద్యోగి ఓ ఉదంతం చెప్పారట. దక్షిణ ఇండియాలో ఒక హైబ్రిడ్ కోడి సంవత్సరానికి 260 గుడ్లు పెడుతుందనీ కానీ ఆ కోడి శీలం అంత మంచిదికాదని, కనుపించిన ప్రతికోడి పుంజుతోను పోతుందనీ అట ఆ వార్త!! మర్నే పోతే అన్ని గుడ్లెలా ?

మేజిస్ట్రేటు దుర్మార్గం!!

బెల్జియంకు చెందిన గైజెస్సర్స్ అనే ఓ 45 ఏళ్ల మేజిస్ట్రేటు అతి దుర్మార్గుడని— అవినీతి పరుడని, అంతేగాక, హంతకుడు కూడానని కోర్టు నిర్ణయించి, అతనికి 15 ఏళ్లు కఠిన కారాగార శిక్ష విధించిందట. ఈయన తన భార్యను చంపడాని ఆమె కారులో బాంబు పెట్టారట. ఆమె కారు స్టార్టు చేయగానే బాంబు ప్రేలి పోయిందట. అంతేగాక ఓ కోటీశ్వరు రాలి ఇంట్లో దొంగతనం చేయడానికి అనువైన పథకాలను తయారీ చేశారట. ఇవేగాక అనేక ఫోర్జరీలు చేశారట. లైసెన్సులేని తుపాకీ పెట్టుకున్నాడట. అన్నాళ్లూ ఆయనకు చేదోడువాదోడుగా వున్న క్రామర్ అనే న్యాయవాది ఆయన తతంగం బయట పెట్టారట.

ప్రగతి పథంలో శవాల గది

మద్రాసు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సకు వచ్చిన రోగులు సాయంత్రం ఆరు గంటల తర్వాత చనిపోతే మర్నాడుదయం వరకూ ఆ శవాల్నిచ్చేవారు కాదట. ఆ చనిపోయిన వ్యక్తికి చెందిన వారందరూ రాత్రంతా మార్చురీ ముందుపడి గావులుపడుతూ, ఏడుస్తూ కూర్చునేవారట. ఇదలా వుండగా కొన్ని శవాలను ఎవ్వరూ వచ్చి తీసుకునే వారేకాదట. కొన్ని కొన్ని శవాలు వారాల తరబడి, మరి కొన్ని నెలల తరబడి వుంచాల్సి వచ్చేదట. ఆరేసినెలలు వుంచిన ఉదంతాలూ వున్నాయట. ఏతావాతా ఆ మార్చురీ లోనూ, చుట్టు పక్కలా ఒక విధమైన వాసన వచ్చేదట. ఇప్పుడు యీ మార్చురీలో ఐసు పెట్టెల విధానం తీసుకు వచ్చారట. ఒకేసారి ఎనభై శవాలను దాచగలిగే స్తోమతకు పెంచారట ఆ స్థలాన్ని. దాదాపు ఏటికి వెయ్యి అయిదొందల మంది చని పోతున్నారిటిప్పటి లెక్కల ప్రకారం,

మహ్మదాలీ పరువు బరువు !

ప్రపంచ హెవీ వెయిట్ బాక్సింగ్ చాంపియన్ మహమ్మద్ ఆలీ తన నగ్న చిత్రాన్ని ప్లేగర్ల్ అనే ఆంగ్ల పత్రిక ప్రచురించిందని, ఆ ప్రచురణవల్ల తనకి తీరని మనోవ్యధ, అవమానము, చెడ్డపేరు, వున్న మంచి పేరుకు అప్రతిష్ట కలిగాయని అందువలన తనకు 40 లక్షల రూపాయలా పత్రిక నష్ట పరిహారం ఇవ్వడమే గాక, ఆ పత్రిక అమ్మకాన్ని నిలుపుచేసి, కాపీలన్నీ, తనకు యిచ్చి తీరాలనీ ఆయన కోర్టులో దావా వేశారట.

అలవాటయిన తప్పు !


అమెరికా ప్రెసిడెంటు కార్టరు తల్లి పాదాభివందనం తాను చేయలేదని. ఆవిడ చెప్పుకొంత మాత్రమే తీసుకోడానికి వంగి పాదాలు ముట్టుకున్నట్టు అమెరికాలో భారత రాయబారి నాని ఫల్కీవాలా అన్నారట. ఈ విషయం మీద జనతా పార్టీ సుబ్రమణ్య స్వామి మాట్లాడుతూ యీ క్రియ ఇదేం కొత్తకాదని జవహర్‌లాల్ నెహ్రూ అలనాడు పాకిస్తాన్‌కు చెందిన ఫిరోజా ఖాన్ భార్య పాదాలు ముట్టుకున్నారనీ అన్నారట. అదీ నిజమా! అయితే ఆ ఫోటో ఎక్కడా ? రెటిట్ కమ్ టూ ప్రెస్. !

పగబట్టిన పడతి

పుదుక్షేత్రం అనే వూరుకు చెందిన రాజగవుండరు అదే వూరుకు చెందిన రామాయి అనే ఆవిడను మోసం చేసి, ఆమె ఆస్తంతా ఎనిమిదేళ్లక్రితం తనకు చెందేలా వ్రాయించేసుకున్నాడట. ఆనాటి నుంచీ రామాయి తన కూతురు సరోజతో అష్టకష్టాలు పడుతూ వచ్చిందట వయస్సుతో పాటు జ్ఞానమూ వచ్చిన 18 ఏళ్ళ సరోజ తన ఆస్తి కాజేసిన 50 ఏళ్ళ రాజగవుండరుమీద పగబట్టి, మొన్న 4 వ తేదీన అతను పొలం వెళ్తూండగా దారి కాసి, మీదకు లంఘించి కొడవలితో శక్తి కొద్దీ తల మీద ఒక్క దెబ్బ వేసిందట. ఆ దెబ్బకతను అక్కడికక్కడే చని పోయాడట. ఆ వూపు వెనక్కు తగలడం వల్ల ఆమె తలకూ బలమైన గాయం తగిలి సరోజ స్పృహ తప్పి పోయిందట.

ప్రకటనతో అమ్మాయిలని మోసగించిన వ్యక్తి

మద్రాసులో దొరైరాజు అనే అతను తాను ప్లాస్టిక్ సంచుల తయారీ వ్యాపారం ఫలానా ఎడ్రసు నుంచి ప్రారంభించుతున్నట్లు ఆ పనికి గాను ఆడ పిల్లలు కావలెనని పత్రికలో ఒక ముఖ్య ప్రకటన చేశాడట. అది చూసి చాలా మంది అమ్మాయిలు అప్లికేషన్లతో వెళితే ఒక నెల పని నేర్పి, ఆ పైన నెలకు మాటఫది రూపాయలు యివ్వబడుతుందని చెప్పి పని నేర్చుకోడానికి చేరేవారు అప్లికేషనుతో పాటు ముప్పయి రూపాయలు కట్టాలనీ అన్నాడట. ఈ షరతుకు 32 మంది ఒప్పుకుని, డబ్బు యిచ్చారట. ఆ డబ్బు తీసికొని, యిదిగో, అదిగో అంటూ అసలు పని వాయిదా వేస్తూవస్తే – ఆ అమ్మాయిలకు అనుమానం వచ్చి పోలీసులకు చెప్తే వాళ్ళొచ్చి అతన్ని అరెస్టు చేస్తే చట్టం రెండేళ్ళ శిక్ష విధించిందట



ఫాలాక్షుని డైరీ

వక్రమార్గాన్ని పట్టించే మార్గదర్శక పుస్తకం

ఆంధ్రప్రదేశ్ సర్వీస్ కమిషను పరీక్షపత్రాలని దిద్ది ప్యాసు, ఫెయిలులు నిర్ణయించే అధికారులకు ఓ మార్గదర్శి వంటి పుస్తకం పప్లయి చేయబడినదట. ఆ అధికారులు ఆ పుస్తక ప్రకారం పరీక్షా పత్రాలను దిద్దాలట. అందులో పాండిచ్చేరి కేరళ రాష్ట్రము నందున్నది అని వున్నదట. నో జోక్స్!!

హోటల్ గదిలో వ్యాపారి శవం

తిరునల్వేలికి చెందిన శంకరన్ కోయిల్ అనే వూరులో ఒక వ్యాపారి 50 ఏళ్ల రామలింగం అనే ఆయన వ్యాపారార్థం తిరుచెంగోడు అనే వూరుకు వెళ్ళి ఒక హోటల్లో రూము తీసుకుని తలుపులేసుకు పడుకున్నవాడు రెణ్ణాళ్లయినా రాలేదట. ఆయన రాక పోగా, చెడు కంపు ఆ గదిలోంచి బయటకు రాడం వల్ల యీ విషయం పోలీసులవరకూ వెళ్ళి వారు తలుపులు విరిచి చూస్తే ఆయన లోపల చనిపోయున్నాడట. హత్యా, ఆత్మహత్యా, ఎప్పుడు, ఎలా, కారణమేమి వగైరాలకు పోలీసులు పరుగులెడుతున్నారట

పురుషునితో సమానమైన స్విట్జర్లాండ్ స్త్రీ

స్విట్జర్లాండు దేశంలోనే యింతవరకూ స్త్రీకో జీతము పురుషునికో జీతము, స్త్రీకి తక్కువ కూలీ పురుషునికెక్కువ కూలిగా వుండేదట. ఇప్పుడే యీ తారతమ్యాన్ని తీసేసి వుద్యోగ విషయంలో లింగభేదములు పాటించరాదు. వుద్యోగాన్ని బట్టి జీతమీయవలెను. పురుషునితో సమానమైన జీతమే స్త్రీకి కూడా యిచ్చి తీరవలెను. అని చట్టం వచ్చిందట. ఇంతేల! పురుషుని కన్నా ఓ బేడా ఎక్కువే యిస్తే పోలా!


జనతాలో సఖ్యతకి అయిదేళ్లాగాలా ? ?

కాగల ఎన్నికలలో తమ పార్టీకే వోట్లువేసి గెలిపించాలని బొంబాయివద్ద ఓ బహిరంగ సభలో హోమ్ మంత్రి (జనతా) చరన్‌సింగ్ కోరుతూ, జనతా పార్టీ కొన్ని తప్పులను చేసినట్టు ఒప్పుకుంటూ జనతా పార్టీలోని ఐదుపార్టీలూ (పోట్లాటలు మాని) ఐక్యత పొందేవరకూ ప్రజలు ఓపిక పట్టాలని కోరారట. బాగుంది వరస.

అమ్మకాల్లో చనుబాల రికార్డు

దేశంలో అన్ని అమ్మకాలకూ చనుబాలు అమ్మకం ఏ విధంగానూ తీసిపోదట. భారత దేశంలో సుమారు 220 లక్షలమంది నర్సింగ్ మదర్స్ సుమారు ఏటికి 3.7 టన్నుల పాలు విక్రయిస్తున్నారని, యీ పాలు ఢిల్లీ లెక్కల ప్రకారం లీటరు రెండ్రూపాయల చొప్పున ఏటికి ఏడువేల నాలుగు వందల మిలియను రూపాయలు సంపాదిస్తోందని తేలిందట. బాపురే!

అనాది కాలప్రవృత్తముగా సంగీతము పారంపర్యంగా భారతీయ సమాజంతో నిగూఢంగా నేయబడినది. సంస్కృతి తనంతటతానే ఏ విధంగా మిగుల దైవికంగా భాసించునో, అదే విధముగా, భారతదేశంలో, పక్షులు, జంతువులకేగాక, దేవతలు సంగీత వాద్యములతో విడదీయ లేని విధంగా సమ్మిళితమైయున్నారు. స్థితి కారకుడైన చదుర్భుజుడైన మహావిష్ణు, ఒక చేతిలో శంఖమును ధరించి యున్నాడు; కళలకు, విద్యకు మూల విరాట్టైన సరస్వతి వీణ మీటుచున్నది; శ్రీ కృష్ణ భగవానుడు సర్వదా వేణువుతో సాక్షాత్కరించును. ఇక శివుని చేతిలో ఢమరకం.



ఢమరు కానికి శివునితో అవినాభావ సంబంధం ఉంది. శివుడు 'తాండవ నృత్యం' చేసినప్పుడు పధ్నాలుగు సార్లు ఢమరాన్ని వాయించాడట —పధ్నాలుగు మహేశ్వర సూత్రాలు ఆవిర్భవించాయిట. ఆ సూత్రాలే పాణిని వ్యాకరణ సూత్రం యొక్క ప్రారంభ సూత్రాలయ్యాయి. పైన యారూ చూసే ఆ తబలా యొక్క పూర్వస్వరూపం డమరుకం.

దావణగేరె

అనంతమైన నాణ్యతకు మరో పేరు

ది దావణగేరె కాటన్ మిల్స్ లిమిటెడ్, దావణగేరె, 577 002.

షోరూములు :
చిత్రదుర్గా రోడ్, దావణగేరె 577 002.
కావేరి భవన్, బెంగళూర్ 560 009
దాజిబన్‌పేట్, హుబ్లి 580 020.

THOMAS/DCM/77/B/TEL

మాయాజాలం మతి కట్టు

మెంటల్ టెలెపతీ

అవి నేను కాలేజీలో చదువుకుంటున్న రోజులు. ఎకనామిక్స్ ప్రొఫెసరు గారు సీరియస్‌గా 'లా ఆఫ్ డిమాండ్' గురించి ఓ లెక్చర్ దంచి పారేస్తున్నాడు. అందరూ ఓపిగ్గా వింటున్న ఆ సమయంలో ......

'సార్ సర్క్యులర్' అంటూ ప్యూన్ మా క్లాసు గదిలోకి వచ్చి ప్రొఫెసర్ గారికి ఓ కాగితం యిచ్చాడు.

"రోల్ నంబర్ 22, భావరాజు కామేష్ యిజ్ రిక్వెస్టెడ్ టు మీట్ ది ప్రిన్సిపాల్ యిమీడియట్లీ" చదివారు ప్రొఫెసర్‌గారు.

ఏదో నా కొంప మునిగినట్టు, క్లాసులో వాళ్ళందరూ ఒక్కసారి దీనంగా నా వైపు చూచారు

మరుక్షణం ప్రొఫెసరుగారి వద్ద సెలవు తీసుకుని (లెక్చర్ బాధ తప్పించినందుకు మనసులోనే ప్యూన్ గాడికి జోహార్లర్పిస్తూ...) ప్రిన్సిపాల్ రూమ్‌లోకి అడుగు పెట్టాను

వెంటనే ప్రిన్సిపాల్ గారు హలో మిస్టర్ కామేష్ రావోయ్ కూర్చో నీకొక గుడ్ న్యూస్ మొన్న నేను యూనివర్శిటీకి వెళ్ళినప్పుడు ఏదో మాటల సందర్భంలో అతీత శక్తుల గురించి, ఇంద్రజాల, మహేంద్రజాల టక్కు, టమార విద్యల గురించి నాకు, వైస్ ఛాన్సలర్ గారికీ, రిజిష్ట్రార్ గారికి మధ్య వాదోపవాదాలు పెరిగి, తర్వాత మాటలో మెజీషియన్ల గురించి ఏదో టాపిక్ వచ్చి, మా కాలేజీ లోనే ఓ మాంచి చలాకీ మెజిషియన్ వున్నాడని చెప్పాను. అప్పటి నుంచీ వాళ్ళిద్దరూ నిన్ను చూడాలని తహ తహ లాడుతున్నారు


ఇదిగో యిప్పుడే యూనివర్శిటీ నుంచి రిజిష్ట్రార్ గారు ట్రంకాల్ చేశారు.

వచ్చే సోమవారం నుంచే జరగబోయే ఇంటర్ కాలేజియేట్ డ్రామా కాంపిటీషన్స్‌లో ఒకరోజు స్పెషల్‌గా నీ ప్రదర్శన ఏర్పాటు చేశారుట నిన్ను నీ మాజిక్ పటాలంతో ఎట్లాగైన పంపించమని కోరారు. కాబట్టి నువ్వు యూనివర్శిటీలో బ్రహ్మాండమైన ప్రదర్శన యిచ్చి మన కాలేజీకి మంచిపేరు తీసుకురావాలని కోరుతున్నాను" అన్నారు.

"ఓ యస్ నేను రెడీ అన్నాను (నాకు అంతమంచి సదవకాశాన్ని యిస్తున్న రిజిష్ట్రారు గారికి మనస్సులోనే నమస్కారాలర్పిస్తూ...)

సరే, మొత్తానికి నా మాజిక్ ప్రోగ్రామ్ ఫిక్సయిన ఒకరోజు ముందుగా యూనివర్శిటీ చేరుకున్నాను నాతో బాటు యిద్దరు ప్రొఫెసర్లు కూడా వచ్చారు

మేము వచ్చామని తెలియగానే, స్టూడెంట్ వాలంటీర్లు కొందరు వచ్చి నన్ను కలిసి మాజిక్ షో గురించి [illegible]



ఎల్లా ఏర్పాటు చెయ్యాలో అడిగి తెలుసుకుని వెళ్ళారు.

ఆ తర్వాత రిజిష్ట్రారుగారు, నన్ను తీసుకుని ఆయన రూమ్‌కి రావలసినదిగా మా ప్రొఫెసర్లకి కబురు పెట్టారు

సరే కాసేపట్లో ప్రొఫెసర్లిద్దరితో కలిసి నేను రిజిష్ట్రారుగారి రూమ్‌లోకి అడుగు పెట్టాను.

బ్రహ్మాండమైన పెద్ద టేబుల్, దాని చుట్టూ సుమారు ఓ పది కుషన్ కుర్చీలు టేబిల్ మీద ఓ ప్రక్కగా మూడు టెలిఫోన్లు, రెండవ ప్రక్క కొన్ని ఫైళ్ళు వున్నాయి పైన ఓల్డు మోడల్ పెద రెక్కల ఫాన్ మెల్లిగా తిరుగుతోంది సరిగ్గా దాని క్రిందుగా పెద్ద కుషన్ కుర్చీలో కూర్చున్నారు రిజిష్ట్రారుగారు. ఆయనకి ప్రక్కగా కూర్చున్నాయన వైస్ ఛాన్సలర్ గారని వూహించడానికి ఎంతో టైమ్ పట్టలేదు. ఆయనకెదురుగా ఎవరో ఇంకొకరు కూర్చున్నారు

రిజిష్ట్రారుగారు, మమ్మల్ని చూచి, ప్లీజ్ కమిన్, నైస్ టూ మీట్ యూ మై డియర్ యంగ్ బాయ్, అంటూ వైస్ ఛాన్సలర్ గారిని, ఆయనకెదురుగా కూర్చున్న సివిల్ యింజనీరింగ్ ప్రొఫెసర్ గారిని పరిచయం చేశారు

తర్వాత మా సంభాషణ మామూలు కుశల ప్రశ్నలతో మొదలయి, అసలు నాకు యీ మాజిక్ నేర్చుకోవాలని ఎల్లా యిన్స్పిరేషన్ కలిగిందో, ఎప్పుడు మొదలెట్టానో, ఎట్లా చేస్తానో, అసలు యీ ఆర్టు ఎంత విలువైనదో అసలు ప్రపంచంలో ఎంతెంత గొప్ప మెజిషియన్లున్నారో చెప్పుకోవడం వరకు సాగి, ఆఖరుకి అక్కడికక్కడ ప్రాక్టికల్‌గా ఏదేనా ఒక మాజిక్ చూపించమని రిజిష్ట్రారుగారు కోరారు

సరే, తప్పకుండా మాజిక్ చూపిస్తానని చెప్పి, మెంటల్ టెలెపతీ చేస్తానని రిజిష్ట్రారుగారి టేబిల్ మీదున్న ఒక పెద్ద తెలుగు గ్రంథాన్ని తీసుకుని కాజువల్‌గా పేజీలు తిరగేసి, ఓ చీటీమీద ఏదో వ్రాసి,

చీటి మడిచి కవరులోపెట్టి, అతికించి పట్టుకోమని కవరు రిజిస్ట్రారు గారి కిచ్చాను.

తర్వాత నేను కోరిన ప్రకారం రిజిస్ట్రారు గారు మూడు అంకెల సంఖ్య తలచుకోగా, వైస్ ఛాన్సులర్‌గార్ని కాగితం మీద వ్రాయమని చెప్పి, ఆ సంఖ్యనే తరగేసి పెద్ద సంఖ్యలోంచి: చిన్న సంఖ్యని తీసివేయమని చెప్పాను.

తర్వాత తీసివేయగా వచ్చిన సంఖ్యను విడిగా వేసుకుని, తిరిగి ఆ సంఖ్యను కూడా తిరగేసి క్రిందిగా వేసుకుని కూడ మన్నాను మొత్తం యీ క్రింది విధంగా వచ్చింది.

తలచుకున్న సంఖ్య : 782

	782		495
−	287	+	594
	495		1089

ఇప్పుడు తెలుగు గ్రంధాన్ని రిజిస్ట్రార్ గారికిచ్చి, ఫైనల్‌గా వచ్చిన1089 మొత్తంలో మొదటి మూడు అంకెల ప్రకారం 108 వపేజీ తీసి నాల్గవ అంకె ప్రకారం 9 వ పదం పేరు చదవమన్నాను.

ఆయన అట్లాగే 108 వ పేజీ తీసి 9 వ పదం 'శంకరాచార్య' అని చదివారు.

వెంటనే రిజిస్ట్రారుగార్ని ప్రదర్శనకి ముందుగా నేనిచ్చిన సీలు చేసిన కవరు చింపి చూడమన్నాను.

అంతే! ఇంకేముంది!! ఆశ్చర్యం!! కవరులో చీటి మీద కూడా 'శంకరాచార్య' అని వ్రాసివుండడం చూపి......

"ఫెంటాస్టిక్ మైడియర్ కామేష్" అంటూ పెద్దలందరూ నన్నెంతో అభినందించారు.

ఈ అయిటమ్‌తో ముఖ్యమైన వింతేమిటంటే ఎప్పుడూ 1089 మొత్తం రావడం గొప్ప విశేషం.

గమనిక: 1 యీ అయిటమ్‌ని టెలిఫోన్‌బుక్, డిక్షనరీ, భగవద్గీత వగైరాల నుపయోగించిచేస్తే మరీ బాగుంటుంది

2. ఏ పుస్తకాన్ని ఉపయోగించినా ప్రదర్శనకి ముందుగా 108వ పేజీలో 9వ పదం చీటిమీద వ్రాసి వుంచుకోవడం చాలా ముఖ్యం.

3. తీసివేతలో రెండే అంకెలు వస్తే ఎడమవైపు సున్న చేర్చుకోడం(ఉదా:099) ఎంతైనా అవసరం.

4 పుస్తకానికి 108 కంటే ఎక్కువ పేజీలు లేకపోతే ... కధకంచికి – మనం యింటికి.

—భావరాజు కామేష్.

వారఫలం

మహేష్

10-3-1978 శుక్రవారం మొదలు 16-3-1978 గురువారం వరకు

మేషం :— ఫలితం లేని శ్రమ కలుగుతుంది సాహసిక వ్యవహారాల్లో నష్టం వస్తుంది. వారం మధ్యలో మీ కార్యక్రమాలు బాగుంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. నూతన వ్యవహారాలు లాభిస్తాయి. మీ ఆలోచనలు ఫలిస్తాయి. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. వ్యతిరేకమైన వార్తలను వింటారు.

వృషభం :— ప్రయాణాలు ఫలిస్తాయి. వ్యాపారంలో నూతనావకాశాలు లభిస్తాయి. వారం మధ్యలో చికాకులు యేర్పడతాయి. మీ ప్రయత్నాలకు ఆటంకాలు వస్తాయి. వారం ఆఖరులో అన్ని వ్యవహారాలు తిరిగి బాగుంటాయి. స్త్రీలకు—ఆరోగ్యం బాగుండదు. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

మిధునం :— వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కలుసుకొంటారు. ఉద్యోగంలో గౌరవం బాగుంటుంది. మిత్రుల సహాయం లభిస్తుంది. ఆస్థి వ్యవహారాలు బాగుంటాయి. వారం ఆఖరులో విలువైన వస్తువులు పోవచ్చును. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది దైవ కార్యాలు నెరవేరతాయి.

కర్కాటకం :— రావలసిన డబ్బు అందుతుంది. సంతోషకరమైన వార్తలను వింటారు. ప్రయోజనం గల పరిచయాలు ఏర్పడతాయి. స్థిరాస్థి వ్యవహారాలు బాగుంటాయి. నూతన వ్యవహారాలు లాభిస్తాయి. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

సింహం :— సాహసిక వ్యవహారాల్లో నష్టం వస్తుంది. ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. వారం మధ్యలో ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. మిత్రులకు సహాయం చేస్తారు. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాల బాగుంటాయి. స్త్రీలకు కుటుంబ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. పుణ్యకార్యాలు చేస్తారు.

కన్య :— మీ ఆలోచనలు ఫలిస్తాయి. సాటివారిలో గౌరవం బాగుంటుంది. వారం మధ్యలో ఆందోళన కలుగుతుంది. చేజిక్కిన అవకాశాలు కూడా జారిపోవచ్చును. వారం ఆఖరులో అనుకూలత లభించగలదు. స్త్రీలకు— ఆరోగ్యం బాగుండదు. విలాసవస్తువులు కొంటారు.

తుల :— వ్యాపారంలో సాటివారి పోటీ పెరుగుతుంది. మీ కార్యక్రమాలకు మార్పులు వస్తాయి రావలసిన డబ్బు అందుతుంది. ప్రయోజనం గల పరిచయాలు యేర్పడతాయి. వారం ఆఖరులో ప్రయాసకు గురి కాగలరు. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. ఎవరితోను వాద ప్రతివాదాలు తగవు.

వృశ్చికం :— వృత్తివ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. ప్రయాణాలు ఫలిస్తాయి. రాజకీయ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. అనవసరమైన సందేహాలు కలుగుతాయి. మునుముందర ఉపయోగించగల వ్యక్తులను కలుసుకొంటారు. స్త్రీలకు — ఆరోగ్యం బాగుంటుంది. సంతానానికి సౌఖ్యసంతోషాలు లభిస్తాయి.

ధనుస్సు:— స్థిరాస్థి వ్యవహారాలు బాగుంటాయి. బంధుమిత్రులను కలుసుకొంటారు. వృత్తిలో ఆదాయం బాగుంటుంది. సాహసిక వ్యవహారాలు లాభిస్తాయి. వారం ఆఖరులో మీ అంచనాలు తారుమారు కాగలవు. స్త్రీలకు—దైవ కార్యాలు నెరవేరతాయి. ఆడంబరం కోసం వ్యయం జరుగుతుంది.

మకరం:— వ్యాపార విస్తరణ ప్రయత్నాలు బాగుంటాయి. సాహసిక వ్యవహారాలు లాభిస్తాయి. ఉద్యోగంలో గౌరవం బాగుంటుంది. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. ప్రయాణాలు అనుకూలంగా ఉంటాయి. స్త్రీలకు —ఆరోగ్య బాగుంటుంది. సాహిత్య కళారంగాల్లో మీ కృషి రాణిస్తుంది.

కుంభం:— భాగస్వాములతో కలిసి చేసే వ్యాపారాలు బాగుంటాయి. రావలసిడబ్బు అందుతుంది. వృత్తిలో సాటివారిపోటీ తగ్గుతుంది మిత్రులకు సహాయం చేస్తారు. వారం ఆఖరులో అన్ని వ్యవహారాల్లోను ఫలితం సామాన్యంగా ఉంటుంది. స్త్రీలకు కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. దైవకార్యాలు నెరవేరతాయి.

మీనం:— మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. ప్రయోజనం గల సంభాషణలను జరుపగలరు. విద్యా వైజ్ఞానికరంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. రాజకీయ వ్యవహారాలు బాగుంటాయి. స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. సంతోషకరమైన వార్తలు వింటారు.



స్నానం చేసి, పూజా పునస్కారాలు పూర్తి చేసుకుని ఈజీ ఛైర్‌లో కూచున్నాను. హైస్కూలు ప్యూను పోలయ్య టపా తీసుకుని వచ్చేడు.

కళ్లజోడు పెట్టుకుని ఉత్తరాలు పరిశీలించ సాగాను. రెండు స్వంతానివి, మిగతా నాలుగూ స్కూలుకి సంబంధించిన ఉత్తరాలు.

నా పేర వచ్చిన వాటిలో ఒకటి మా పెద్దబ్బాయి రఘు విశాఖ నుంచి వ్రాసిన కార్డు. వాడక్కడ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ చదువుతున్నాడు. వెంటనే రెండొందలు పంపమని రాసాడు. రెండోది చోడవరం నుంచి మా మామగారు రాసిన ఇన్‌లాండు కవరు. అక్కడ కిందటేడు ఓ ఎకరం పొలం కొని లేనిపోని గొడవల్లో ఇరుక్కున్నారు. వాటికి సంబంధించిన లావా దేవీల గురించి రాస్తూ, ప్లీడరు గారి ఫీజు నిమిత్తం అర్జంటుగా వందరూపాయలు పంపమని రాసారు. తప్పుతుందా ?

విసుగ్గా నిట్టూర్చాను. ఇటు, అబ్బాయికీ, అటు మామగారికీ కూడా వెంటనే డబ్బు పంపించక తీరదు. ఇంట్లో చూస్తే పెద్దమ్మాయి పురుటికని వచ్చింది. అదో ఖర్చు. పేరుకి హెడ్మాష్టరునే కాని సంసారం పెద్దది కావటంచేత కొంచెం తడుము కోవాల్సి వస్తోంది.

ఆ ఉత్తరాలు రెండూ పక్కన పడేసి స్కూలు టపా తీసాను. అన్నీ అర్జంటు కాగితాలే. అర్జంటుగా నామినల్ రోల్స్ తయారుచేసి పంపించమని డి. ఇ. ఓ గారి ఉత్తర్వు. (స్టైపెండ్ పర్టిక్యులర్స్) ఎందుకు పంపలేదని రిమైండరు. మూడోది ఇనస్పెక్షను రిపోర్టు అది చదివేక మతి పోయింది. ఘాటుగా వుంది. టీచర్ల యూనిట్ ప్లాన్సూ అవీ సక్రమంగా లేవనీ, పెర ఫామెన్స్ ఇంకా బావుండాలనీనూ ! నాలుగో కవర్లో ఆడిట్ అబ్జక్షన్లు—

టపా ముడిచి స్కూలుకి తీసుకెళ్ళవలసిన బేగ్‌లో పెట్టి పోలయ్య చేతికిచ్చాను తాళాలిచ్చి పంపించాను. పోలయ్య వెళ్ళిపోయాక భోజనానికి లేచాను.

భోజనంచేసి వక్కపొడి నములుతూ వీధి వరండాలోనికి వచ్చేను. నా కోసమే కాబోలు ఎదురుచూస్తూ అక్కడో అబ్బాయినించుని వున్నాడు మాసిపోయిన చొక్కానిక్కరూ వేసుకుని వున్నాడు. తలపీసులారేగి వుంది. చేతిలో ఏవో రెండు పుస్తకాలున్నాయి, ముఖం దీనంగా వుంది.

'ఏం కావాలి ?' అన్నాను సిగరెట్ వెలిగిస్తూ. 'సార్ — చదువుకునే కుర్రాడినండీ — ఏఃమిదో తరగతిలో చేరాలండీ — అమ్మా నాన్న లేరండీ... మా మావయ్య దగ్గర వుంటున్నానండీ ... వాళ్ళు కూడా చాల బీదవాళ్ళండీ... స్కూలు ఫీజు కట్టడానికి డబ్బులేదు సార్ — మీరేదేనా సహాయం చేస్తే స్కూల్లో జాయినవుతాను సార్...' అన్నాడు. వాడి గొంతులో ఏడుపుతో కూడిన జీర వినిపిస్తోంది.

నాకెందుకో వాడివన్నీ దొంగమాటలని పించింది. వాడిగొంతు జాలి కలిగించే విధంగానే వున్నా అదంతా కేవలం నటనే అని పించింది.

సానరాయి

తెల్లవారింది మొదలు యిలాంటివెన్నో చూస్తాం. దేశంలో అడుక్కోవడం పెద్ద ఇండస్ట్రీ అయిపోయింది. వీళ్ల జనాభా యిలా పెరిగిపోడానికి సోమరితనమేనని నా నమ్మకం, అదే కారణం అనుకుంటాను... దేవుడిపేరు చెప్పకుని అడుక్కునే వాళ్లు కొందరుంటే- దీనజన సమాజం చందా లంటూ మరికొందరు! ఇల్లు కాలిపోయిందనో, దొంగలు పడి దోచుకుపోయారనో కట్టుకబుర్లతో యింకొందరు. ఈ మధ్య యీ సైజు కుర్రాళ్లు స్కూల్లోచేరాలనీ- పరీక్షఫీజుకి డబ్బుల్లేవనీ రావటం రివాజయిపోయింది. ఇలాంటి వాళని ప్రోత్సహించకూడదు.

'అయితే ఏమంటావ్ ?' అడిగేను విసుగ్గా, ఆ అబ్బాయి కళ్లలో నీళ్ళు నింపుకుని అన్నాడు: 'సార్- మీకుతోచిన సాయం చెయ్యండి సార్ ! హైస్కూలుకి పోయి హెడ్మాష్టరుగారి కాళ్లు పట్టుకుని జాయినవుతాను — నామాట నమ్మండిసార్' అని ప్రాధేయపడ్డాడు.

అయితే నేనే హెడ్మాష్టరునని వీడికి తెలీదన్నమాట! ఇంటిబయట నేమ్‌బోర్డు తగిలించే అలవాటు నాకు తొలినుంచీలేదు— నేను హెడ్మాష్టరునని తెలిస్తే యిలా వచ్చేవాడుకాడేమో ? రావడానికి వాడికెన్ని గుండెలుండాలి...

'వెళ్ళబ్బాయ్ ... నాదగ్గరేం లేదు...' అనేసి టైం చూసాను. తొమ్మిదీ అయిందయింది. గదిలోకివెళ్లి పంచె కమీజు వేసుకున్నాను. 'మధ్యాహ్నం పిల్లల్ని తీసుకుని మేట్నీకి వెళ్దామనుకుంటున్నానండీ—ఆ సావిత్రమ్మగారు కలిసి వెళ్దాంరమ్మని పదిరోజులుగా వూరికే యిదవుతున్నారు' అనడిగింది జానకి. ఆవిడగారి చిన్నకోరికని తీర్చకపోతే ఎలా ! 'ఓయస్' అని నవ్వేసిన దిరూపాయల నోటుతీసి ఆవిడకిచ్చాను. నవ్వుతూ అందుకుంది. 'మధ్యాహ్నం ఓసారి పోలయ్యని యింటికి పంపించండీ-టిక్కెట్లుతీసి పెడతాడు' అంది. తలవూపి వరండాలోకి వచ్చాను.

ఆ అబ్బాయి యింకా అక్కడే నిల్చొనివున్నాడు. నాకు చిరాకనిపించింది. 'ఏం అబ్బాయ్ — వెళ్ళమనిచెప్తే నీక్కాదూ ? ఇంకా దిష్టిబొమ్మలా నిల్చుంటావేం — నీలాంటివాళ్లని చాలామందిని చూసాను ... అడుక్కోడానికిదో ఎత్తుకాకపోతే — ఎక్కడో చిన్నపని చూసుకోరాదూ ? అని కసిరేను.

ఆ కుర్రాడు చేతులుకట్టుకుని, దుఃఖం దిగమింగుతున్నట్టుగా గుటకలుమింగి — 'లేదుసార్—నామాట నమ్మండి సార్...నేను నిజంగా చదువుకునే అబ్బాయినే సార్...' అన్నాడు.

'చాల్లే...గెటవుట్—ఏ చదువురాని వాడిదగ్గరో నీ నంగనాచి కబుర్లు పనిచేస్తాయి. నీవాలకంచూసి కరిగిపోయి సహాయంచేస్తాడు. నాలాంటి వాడిదగ్గర నీ ఆటలు సాగవు — ఫో !' అన్నాను కొంచెం విసురుగా.

ఆ అబ్బాయి కళ్లు వర్షించటం ప్రారంభించాయి. దుఃఖం ఆపుకోలేక బెక్కుతున్నాడు. నామనసు కొంచెం చలించింది. కాని వెంటనే—ఇలాంటివాళ్ల దొంగఏడుపులకీ — బూటకపుకన్నీటికీ చలించిపోవటం హాస్యాస్పదంగా తోచింది. జిడ్డులాగా వదలడేం ? విసిగిపోయి తృణమో పణమో పారేస్తాననుకున్నాడు కాబోలు ! నేను వాడికంటే మొండివాణ్ని — జలగలాగా పట్టుకుని వెంటపడితే వదుల్చుకోడానికి

మల్లె

నువ్వు రాల్చి వెళ్లిన మల్లె
నా చేతికి దొరికింది
నన్ను విడవనంది
తన్ను విడవకంది.
భాషకందని నీ నవ్వులాంటి
పరిమళంతో
పరవశంగా నన్ను కమ్ముకుంది ...

* * *

మురిసిన మల్లె సొమ్మసిల్లింది
అదిగో నా ముందు
నీ లాగే ...
అపురూపమైన
ఈ రాత్రి
అనుభూతిలా
నా అదృష్టంలా
నీలా
మల్లె
తన్ను విడవకంది... నన్ను
విడవనంది —

-కే ఎస్వీ

వాడి మాటలకి లొంగిపోయే రకం కాదని నిరూపించాలను కున్నాను.

చెప్పులలో కాళ్ళు దూరుస్తూ - 'ఇవాళ పూళ్ళో ఏ సినిమా రిలీజయిందేమిటి ?' అన్నాను వ్యంగ్యంగా.

వాడు నావేపు అదోలా చూశాడు. భయం భయంగా అడిగేడు. 'ఎందుకు సార్ ?' అని.

'మరేంలేదు- తమరు ఏ సినిమాకి దయ చేస్తారా అనీ-' అన్నాను వెటకారంగా. కావాలనే కటువుగా ప్రవర్తించాను. ఇలాంటి వాళ్ళకిలాగే బుద్ధి చెప్పాలి' అను కున్నాను మనసులో.

ఆ అబ్బాయి నీరు కారిపోయేడు. మరేం మాట్లాడలేదు. తలొంచుకుని మౌనంగా వెళ్ళిపోయేడు.

'దొంగ వెధవ... అసలు గుట్టు కాస్త బైట పెట్టేసరికి చల్లగా జారుకున్నాడు!' నవ్వుకుని స్కూలుకి బయలు దేరాను.

రిక్షా హైస్కూలు మలుపు తిరుగుతూ వుంటే చలపతి కనిపించాడు. వాడూ నేనూ చిన్నప్పటి నుంచీ స్నేహితులం. ఇద్దరం పార్వతీపురంలోనే చదువుకున్నాం. సెకండరీ విద్య పూర్తయేక నేను విజయనగరం మహారాజా కాలేజీలో చేరాను. వాడు టైపు నేర్చుకుని యిక్కడే కలక్టరాఫీసులో టైపిస్టుగా చేరాడు.

'నీ దగ్గరకే వస్తున్నాను కేశవరావ్' అన్నాడు నన్నుచూసి పలకరిస్తూ. 'ఏమిట్లా సంగతులు ?' అని ప్రశ్నించాను. కాసేపు అవీ యివీ మాట్లాడేక— భార్యకి వొంట్లో బాగులేదనీ—జబ్బు చేసి చాలా చికాకు చేసిం దనీ— ఇప్పుడే ఇంకా హాస్పిటల్ నుంచి డిస్చార్జ్ అయి యింటి కొచ్చిందనీ చెప్పాడు.

'అంత చికాకు చేస్తే కబురు చెయ్యలేక పోయావూ ?' అడిగేను కాని వారం రోజులుగా నేను కేంప్‌లో వున్న సంగతి గుర్తొచ్చింది. డబ్బుకి యిబ్బందిగా వుందనీ—పాతికో పరకో సర్దమనీ అడిగేడు చలపతి. అడగలేక అడగలేక అడుగు తున్నట్టుగా వాడిముఖమే చెప్తోంది. నాకు బాధగా అనిపించింది.

చిన్నప్పుడు ఎంతో సరదాగా వుల్లాసంగా వుండే చలపతి ఎలా తయారయ్యాడు ! ఎన్నడూ వాడిముఖంలో విచారరేఖలె కని పించేవికావు – నవ్వులగనిలా వుండేవాడు. అలాంటిచలపతి ముఖంలో ఎంత నిర్లిప్తత! ఎంత వుదాసీనత ! పాపం, ఆర్థికసమస్యలు— మనిషిని మానసికంగా ఎంత దిగజార్చి వేస్తాయో తలుచుకుంటేఆశ్చర్యంవేస్తోంది. విశాఖపట్నం సముద్రంలో ఉవ్వెత్తున ఉత్సాహంగా ఎగిసిపడే కడలితరంగాలు — నల్లని కఠిన శిలలమీదపడి, తలలు బద్దలు చేసు కున్నట్లుగా—ఆనాటి వీడి ఉత్సాహం — వుద్రేకం—ఆ చొరవ—యివన్నీ జీవిత వాస్తవాల శిలల్ని ఢీకొట్టి వ్రయ్యలయి పోయేయి కాబోలు !

బాధగా నిట్టూర్చి, జేబులోనుంచి పాతిక రూపాయలు తీసి వాడికిచ్చాను.

మరీ మరీ కృతజ్ఞతలు చెప్తూ వాడు వెళ్ళిపోయేడు. రిక్షా కదిలింది.

* * *

రెండురోజులు గడచాయి చలపతీ వాళ్ళింటికి వెళ్దామంటే ఎక్కడా తీరిక చిక్కలేదు. వాడిభార్య కెలాగుందో ? నిన్న సాయంత్రం కనిపించి జబ్బు మళ్ళీ తిరగ బెట్టిందని అన్నాడు విశాఖపట్నం తీసుకు పోతున్నానని చెప్పేడు.

ఆవేళ స్కూల్లో చాలాబిజీగా వున్నాను. పిల్లలు జీతాలుకట్టడానికి ఆరోజు చివరి రోజు. స్పెషల్‌ఫీజు పుస్తకాలు దొంతర్లుగా నా సంతకాలకోసం టేబిలుమీద ఎదురు చూస్తున్నాయి. విద్యార్థుల అడ్మిషన్లు కూడా ఆ రోజుతో పూర్తయేలా వున్నాయి పనిభారం జాస్తీగానేవుంది.

పోలయ్య ఫ్లాస్కులోని కాఫీ కప్పులో పోసి యిచ్చాడు. కాఫీ చప్పరిస్తూవుంటే ఎవరో వో వ్యక్తి ఆఫీసురూంలోకి వచ్చేడు. మనిషి చూడ్డానికి చాలాబీదవాడిలా వున్నాడు.

'ఏం కావాలి ?' మా క్లర్కు అడిగే డతన్ని.

'మా మేనల్లుడ్ని ఎనిమిదో తరగతిలో జాయను చెయ్యాలని వచ్చానండీ — ఇదిగో నండీ అప్లికేషను' అంటూ పూర్తి చేసిన అప్లికేషను ఫారం టేబిలమీద వుంచాడు.

అతనివేపు ఎగాదిగాచూసి, క్లర్కు ఆ ఫారం పరిశీలించి నా కందించారు.

'కుర్రాడేడీ, రమ్మను' అన్నాను దాని నందుకుంటూ.

'శీనూ ! లోపలికిరారా' పిలిచేడతను.

లోపలికి వచ్చిన అబ్బాయిని చూసి నిశ్చేష్టుడినయ్యాను - నా నోట మాట రాలేదు— కడుపులో ఎవరో చెయ్యి పెట్టి దేవినట్లయింది రెండురోజుల క్రిందట నా దగ్గరికి ఫీజుకోసం డబ్బులడగడానికివచ్చింది వాడే! వాడూ నన్ను ఇట్టే పోల్చుకున్నాడు. నన్నుచూసి భయపడ్డట్టు కనిపించింది. తనని అడ్మిట్ చేసుకోనుపొమ్మని అనేస్తానే మోనన్న దిగులు వాడి కళ్ళలో చూసి చలించిపోయాను.

గిల్టీగా ఫీలయ్యాను. మనసంతా అదోలా తయారయింది

'ఫీజు తెచ్చావా?' అడిగేను గొంతు పెగుల్చుకుని. తలూపేడు. 'సరేలే— ఇప్పటి కేదో ఫీజు కడతావు సరే— ముందు ముందు చాల ఖర్చులుంటాయి... పుస్తకాలూ, అవీ— ఆసంగతి ఆలోచించావా?' అన్నాను డాంబికంగా. అలా అడగటానికి నా మనసు



బాగా వ్యతిరేకించిన మ్మాట మా త్రం వాస్తవం.

'బాబూ!... ఏదో తమలాంటి పెద్దలు పదిమంది దగ్గరకెళ్లి చెయ్యిజాపి తెస్తాను బాబూ! శీను తల్లీదండ్రీలేనివాడుబాబూ... నేనూ బీదవాడినే బాబూ! వాడ్ని చదువు లేని వాడిగాచేసి ఆ పాపం కట్టుకోలేను— దయగల పెద్దలు కనికరిస్తే వాడ్ని పదో తరగతి వరకయినా చదివించాలనుకుంటు న్నాను బాబూ!' అతని గొంతు అతిదీనంగా ఉంది.

నేను మరేం ప్రశ్నించకుండా అతనిచ్చిన అప్లికేషను ఫారంమీద 'అడ్మిట్' అని రాసి సంతకం చేసాను.

ఆ ఫారం అందుకుని, 'ఫీజు డబ్బులివ్వు' అంటూ రశీదు పుస్తకం తీసాడు క్లర్కు.

అతని టేబిలు మీద చిల్లర డబ్బులు గలగలమని పడిన చప్పుడు వినిపించి, సిగ్గుతో నా మనసు కుంగిపోయింది. బాధగా నిట్టూర్చాను.

* * *

ఆ సాయంత్రం స్కూలు పని పూర్త యాక మనసు బాగుండక నేరుగా యింటికి వెళ్లాలనిపించలేదు. హోటల్లో కాఫీ తాగి తాపీగా నడుచుకుంటూ పార్కు వేపు దారి తీసాను.

నా మనసులో ఆ సంఘటనే మెదులు తోంది. తప్పు చేసినట్లు బాధపడ సాగాను. ఆలోచిస్తూ నడుస్తున్న నాకు— దారిలో పద్మశ్రీ థియేటరు దగ్గర కనిపించిన దృశ్యం ఆశ్చర్యం కలిగించింది.

అక్కడ—

టిక్కెట్స్ విండో దగ్గర— చలపతి, అతని భార్య నిలుచుని వున్నారు. ఆవిడ —తలలో మల్లెపూలు పెట్టుకుని—నవ్వుతూ అతనితో ఏదో అంటోంది. నిండుగా దబ్బ పండులా వుంది. ఎక్కడా మంచాన పడిన లక్షణాలే లేవు! ఆవిడకి జబ్బు చేసిందని కాదూ' చలపతి నన్ను డబ్బులడిగింది ?

మై గాడ్ ! ఎంత మోసం... నా సుండె కోపంతో మండి పోతున్నట్లని పించింది. మనసు వికలమై పోయింది. వాళ్ళు నావేపు చూడకుండా పార్కులో అడుగు పెట్టాను.

'సార్... చదువుకునే కుర్రాడినండీ ... ఏయిత్ లో జాయినయ్యానండీ... పుస్తకాలు కొనడానికి డబ్బుల్లేవండీ— ప్లీజ్...' ఎవరివెంటో నడుస్తూ అడుగుతున్న శీను కనిపించి ఆగిపోయేను. 'నమస్తే సార్...' అని బిత్తరచూపులు చూస్తూ ప్రక్కకి తొలగి వెళ్లిపోయేదు వాడు.

ఎవ్వరో వెక్కిరించినట్లయింది. బాధగా నిట్టూర్చాను. పార్కులోకూచుని సిగరెట్ వెలిగించాక కొంచెం స్థిమితపడ్డాను. 'ఛీ! ఎంత తెలివితక్కువగా ప్రవర్తించాను ? లోకంలో మోసాన్నీ, కుటిలత్వాన్నీ చూడ గలగటానికి ఈ రెండుకళ్ళూ చాలను కున్నాను...కాని...విచక్షణాదృష్టి — మనో నేత్రం ఇవికూడా అవసరమని గుర్తించలేక పోయాను !

ఏది రత్నమో, ఏది పాషాణమో తెలుసుకో గలిగే షరాబులాంటివాడు ఉపాధ్యాయుడు... రత్నాలనీ, బంగారాన్నీ సానబట్టి మెరుగు తేవటానికి వుపయోగించే సానరాయిలాంటిది అతని ఉపాధ్యాయవృత్తి !

అలాంటిది...తను...కృత్రిమ విలువలకి ప్రాధాన్యతనిచ్చి మోసపోయేడన్నమాట ! నామీద నాకే అసహ్యం వేసింది.

'సార్...చదువుకునె అబ్బాయినండీ...' శీనుమాటలు నా చెవుల్లో గింగుర్లు తిరుగు తున్నాయి.

కార్టూన్లు పంపేవారికి మనవి

కార్టూన్లతోపాటు స్వంత చిరునామాగల స్టాంపులు అతికించిన కవరుపెట్టి సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వారపత్రిక, గాంధీనగరం విజయవాడ 3. అన్న చిరునామాకి టపాలో పంపాలి. వీటి పరిశీలనకు కనీసం 6నుంచి 8 వారాలు పట్ట వచ్చును. ఈలోగా, నేరుగా కాని, టపాలోగాని వీటిపై ఉత్తరప్రత్యుత్త రాలకు తావు ఉండదు. కార్టూన్లు 'టపా'లో పోయినా, దారితప్పిపోయినా సంపాదకుని బాధ్యత వుండదు. ప్రత్యేక సంచికలకు కార్టూన్లు పంపేవారు కవరు మీద ఆ సంచికపేరు ఉదహ రించాలి. ఈ కార్టూన్లకికూడా పై నిబంధనలు వర్తిస్తాయి.

సం.



న్యూట్రిన్ రుచులు.

25 సంవత్సరములలో సాధించిన విజయములు.

ప్రయత్నించగా ఫలం కలిగింది.
మీ ప్రోత్సాహముతో భారతదేశంలో గల
'కన్‌ఫెక్షనరీ తయారుచేయు కంపెనీలలో ఉన్నత
స్థానమునకు చేరినది. ఎప్పుడూ క్రొత్తదనాన్ని
అందించే న్యూట్రిన్ యింకా ఎన్నో క్రొత్త
రకముల స్వీట్స్ మీ కందించుటకు కృషి
చేస్తుంది. ప్రగతి సాధించుట
మా అభిలాష - యిందువల్ల కలిగే
ఆనందమే - మా బలం

nutrine 1952-1977

ఒక్కొక్క మిఠాయి యందు ఫలరస పూరిత విందు!

న్యూట్రిన్ కన్‌ఫెక్షనరి కంపెనీ లిమిటెడ్,
చిత్తూరు, ఆం.ప్ర.

CAS NC 1 TE A 78

హైదరాబాద్ నోట్ బుక్

విడిగా రైల్వే సర్వీస్ కమిషన్ :

ఎటు కొలచినా దాదాపు 500 మైళ్ళ పొడవున్న ఆంధ్రప్రదేశ్‌కు కొత్త రైల్వే మండలి కోసం ఒక ఉద్యమం జరిగింది. తర్వాత విడిగా సర్వీస్ కమిషన్ ఏర్పాటుకోసం ఎంతో ఆందోళన జరిగింది. దాని ఫలితమే రైల్వే మంత్రి శ్రీ మధు దండావతే ఫిబ్రవరి 9న రైల్వే సర్వీస్ కమిషన్ ప్రారంభోత్సవం చేయడంలో ఆ ఆందోళనా ఫలించింది. రైల్వేలో ఉద్యోగాలకు మనవారు మద్రాసుకు పరుగులు తీయనక్కరలేదు. ఉద్యోగుల నియామకంలో లిఖిత పరీక్షన్నా, మౌఖిక పరీక్షకు విశేష ప్రాధాన్యమివ్వాలని శ్రీ దండావతే చేసిన సూచన కొంత విచార్యమే. బాగా మాట్లాడగల కోతల రాయుళ్ళు ఒక పంక్తికూడా సరిగా వ్రాయలేరు (యుద్ధకాలంలో బ్రిటిష్ సైనికులు జాడించి మాట్లాడేవారు కాని, సెలవు చీటి వ్రాయాలంటేనో, భార్యకు ఉత్తరాలు వ్రాయాలంటేనో బాబూజీ యహ్ చిట్టీ లిఖో, అని ప్రాధేయపడేవారు ఇది స్వానుభవం) కనుక శ్రీ దండావతే ఉభయ పరీక్షలకు ప్రాధాన్య మివ్వాలని కోరుతున్నాను. ఈకొత్త కమిషన్‌కు శ్రీకె.ఎన్.తిలక్ అధ్యక్షులుగా నియమితులయ్యారు.

రంగనాథానంద ఉద్బోధ :

మనవిద్య, ఆలోచనా ధోరణి, ఎక్కువగా పాశ్చాత్య దృక్పథంలో సాగుతున్నదని, అందువల్ల వాటి పరిష్కారం సక్రమంగా సాగడంలేదని స్థానిక రామకృష్ణ మఠం అధ్యక్షులు శ్రీ రంగనాథానందజీ ఫిబ్రవరి 11న ఒక సభలో ఇచ్చిన సలహాలు ఆంగ్ల మానస పుత్రులకు కనువిప్పు కావాలి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, ఇంగ్లీషు మీడియం స్కూళ్ళలో రద్దీ విపరీతమయింది. తెలుగు పదాల ఉచ్చారణ ఎలా వున్నా, ఇంగ్లీషు పదాల ఉచ్చారణ ఏ మాత్రం తారుమారయినా, ఈసడించుకొనే తలిదండ్రు లున్నప్పుడు, తెలుగులో మాట్లాడడం చిన్న తన మనేభావం పిల్లలలో వున్నప్పుడు (వీరే కదా ఉత్తరోత్తరా దేశ నాయకులు) మన సమస్యలు పాశ్చాత్య ధోరణిలో కాక మరో విధంగా పరిష్కారమవుతాయి ? దేశంలో ఆర్థిక సాంఘిక విప్లవం అహింసాత్మకంగా జరుగాలని శ్రీ స్వామిజీ సూచించారు. సిద్ధికి అనుగుణమయిన సాధనం వుండాలనేది గాంధేయ సిద్ధాంతం. దవుర్జన్యంలో స్థాపించిన అమర రాజ్యం కూడ అసురరాజ్యమే అవుతుంది. స్వామీజీ భారతీయ కాస్ట్ అండ్ వర్క్స్ అకౌంటెంట్స్ సంస్థ దక్షిణ భారతశాఖ, హైదరాబాద్ కాస్ట్ అకౌంటెంట్ల సంస్థ యాజమాన్యాన జరిగిన సభలో పై విధంగా సలహ ఇచ్చారు.

అసీమానంద అవధూత :

ఆదర్శమేమిటో, ఆశయా లేమిటో, ఆచరణ విధానమేమిటో ఇంతవరకు అర్థం కాని సంస్థ ఆనందమార్గ్. విదేశాలలోని మన అధికారులను చంపడంవంటి క్రూర కృత్యాలను పత్రికలలో చదువుతున్న వారికి ఆ సంస్థ ఉద్దేశ్యా లేవీ అర్థంకావు. ఆ సంస్థ ప్రచార కేంద్ర కార్యదర్శి ఆచార్య అసీమానంద అవధూత్ ఫిబ్రవరి 14న పత్రికా ప్రతినిధుల గోష్ఠిలో ముచ్చటించినప్పుడు గూడ ఉద్దేశాలు స్పష్టం కాలేదు. ఆనందమార్గ్ అధినేత ఆనందమూర్తిని హింసించడం, దుష్ప్రచారం చేయడం ఆపకపోతే ప్రపంచ మంతటా పెక్కుమంది ఆనందమార్గీయులు ఆత్మాహుతి చేసుకొ గలరని హెచ్చరించారు. విదేశాలలోని పలువురు ప్రముఖ ఆనందమార్గీయులు ఆత్మాహుతి చేసుకొన్నారని, శ్రీమతి ఇందిరాగాంధి ఆనందమార్గీయులపై ఎక్కువ దుష్ప్రచారం చేశారని ఆయన అన్నారు.


లెక్చరర్ల సమ్మె విరమణ :

దాదాపు రెండు వారాలపాటు జరిగిన జూనియర్ లెక్చరర్ల నిరవధికమైన సమ్మె ఫిబ్రవరి 12వ తేదీన ఆగింది. లెక్చరర్ల వేతనాలను సంబంధించిన తాత్కాలిక నివేదికను వెంటనే విడుదల చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇవ్వడంలో ఈ సమ్మె విరమించబడింది. ఆ మరణ నిరశనదీక్ష జరుపుతున్న శ్రీ ఎస్. డి. సుబ్బారెడ్డి, శ్రీ ఆర్. ఆర్. భట్టాచార్య 12వ తేదీ మధ్యాహ్నం విధాన పరిషత్సభ్యులు పి. రామబ్రహ్మం వాణిక్యారావు ఇచ్చిన పండ్లరసం పుచ్చుకొని, నిరసన దీక్ష విరమించారు. తర్వాత జరిగిన సమావేశంలో జూనియర్ లెక్చరర్ల సంఘం కేంద్ర కార్యాచరణ సంఘం కన్వీనర్ శ్రీ ఎస్. డి. సుబ్బారెడ్డి ప్రసంగిస్తూ తమ సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావు హామీ ఇవ్వడంవల్ల ఉద్యమం విరమించామన్నారు.

ఉపశ్రుతి :

బ్రాహ్మణులను ఉపేక్షించాలని, అప్పుడే వారి ప్రాముఖ్యం తగ్గుతుందని జగ్‌జీవన్ రామ్ అంటున్నారే, అన్నారు ఒకరు నాతో. స్వామీ, బుద్ధుడు, మహావీరుడు పుట్టినప్పటి నుంచి ఈ ఉద్యమం జరుగుతూనేవుంది. ఏకులం ప్రాధాన్యం తగ్గలేదు. అన్నారు ఒక చరిత్రజ్ఞులు. —తిరుమల రామచంద్ర

యువతరం




ఈమధ్య రాజకీయాల్లో తిరిగి కొంచెం చదువు పాడుచేసు కొన్నాడు కాని వెలగపూడి రామకృష్ణ యిప్పుడు బుద్ధిగా పాలిటెక్నిక్ కాలేజీలో మెటలర్జీలో డిప్లొమాకోర్సు చదువుకుంటున్నాను అని చెప్పాడు. ''ప్రబోధాత్మక హాస్య రసాత్మక'' సినిమాలు యిష్టం- కాని తారలను చూడాలని తాపత్రయ పడడు. ఫ్రెండ్సుతో కాలక్షేపం చేస్తాడు. పేకాటెప్పుడైనా ఆడతాడు. మంత్రులకు సమస్యలు చెప్పి వాళ్ళ బాధ్యతలను గుర్తుచెయ్యాలని గొప్ప కోరికవున్న రామకృష్ణ— మధ్యపాన వ్యతిరేకి మొరార్జీగారిని అందుకే గౌరవిస్తున్నాడు కూడా. మగపిల్లల్ని ఆడపిల్లలు ఏడిపించే కాలమేట యిది అందుకని ''పరాభవం పొందావా ?'' అని వేరే అడక్కండి సార్— అన్నాడు (అర్థమైందిగా!)

రూపాయికి చిల్లర కావాలంటే ఎట్లా సంపాదిస్తాడో చెప్పనన్నాడు ఈ అబ్బాయి— అసలు రూపాయి నా దగ్గిర వుండాలేగాని దాన్ని మార్చే మార్గాలు చాలా వున్నాయిట (వాటిని పబ్లిక్ చేయడం యిష్టంలేదుట) పేపర్‌లో మంచివాడుగా పడాలనుంది. పత్రికల్లో రాజకీయ వార్తలన్నీ క్షుణ్ణంగా చదువుతాడుట !— ఇక సినిమాహాలు దగ్గర సత్యహరిశ్చంద్రుడిలాగా గాక సమయానుకూలంగా ప్రవర్తించి టిక్కెట్లు సంపాదిస్తాడు. ఈ అబ్బాయికి త్వరలోనే వోటు హక్కు వచ్చింది. యిప్పుడు 21 సం.లు వయసు— యిక రావలసింది మెటలర్జీ డిప్లమా— అదికూడా మంచిదే కనుక దాన్ని పొందాలని ఆశించాలి. [***]

ఉచితం

కీ డిటర్జెంట్

బిజ్ తోమే పౌడర్‌తో



కొనే ప్రతీ బిజ్ ప్యాక్ బరువు	ఉచితంగా లభించే కీ ప్యాక్ బరువు
500 గ్రా.	50 గ్రా.
600 గ్రా.	50 గ్రా.
1 2 కి.గ్రా	50 గ్రా.
3.0 కి.గ్రా	100 గ్రా.

గోద్రేజ్ ఉత్పాదన

బిజ్ చక్కటి పొదుపు కోసం

CASGS-117-244 TL

అవీ ఇవీ అన్నీ

ప్రముఖ ప్రచురణకర్త శ్రీ ఎమ్. ఎస్. రావు మృతి

ఎమ్. శేషాచలం అండ్ కంపెనీ అధినేత శ్రీ ఎమ్. యస్. రావుగారు (53) ఫిబ్రవరి 15న ఢిల్లీలో గుండెపోటుతో ఆకస్మికంగా మృతిచెందారు. పుస్తక ప్రచురణలోను విక్రయంలోను ఎన్నో వినూత్న ప్రయోగాలను, చేసి దేశ దేశాలలో పర్యటించి, పుస్తక ప్రపంచాన్ని పరిశీలించి — గత యిరవై సంవత్సరాలుగా అవిరళ కృషి చేసిన శ్రీ వరసింహారావుగారి ఎమెస్కో పాకెట్ పుస్తకపథకం ఆంధ్రప్రదేశ్‌లో అమిత ప్రాచుర్యాన్ని పొందింది. వీరికి భార్య, కుమారుడు ఇద్దరు కుమార్తెలు వున్నారు.

ప్రెస్‌క్లబ్‌లో ఘంటసాల వర్ధంతి

విజయవాడ ప్రెస్‌క్లబ్ అమరగాయకుడు ఘంటసాల వర్ధంతి సందర్భంగా ఈనెల 12వ తేదీన లలితసంగీత పోటీలను నిర్వహించింది. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో భాగంగా ప్రెస్‌క్లబ్ ప్రప్రథమంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షులు శ్రీ జి. వీరాంజనేయులు తెలియజేశారు. ప్రెస్‌క్లబ్ కార్యదర్శి శ్రీ ఏ. ఆంజనేయులు స్వాగతం చెప్పారు.

ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు శ్రీ తుర్లపాటి కుటుంబరావు విజేతలకు బహుమతులను అందజేశారు. శ్రీ మల్లిక్, శ్రీ సూర్యారావు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ప్రముఖ గాయకులు శ్రీ మల్లిక్, శ్రీ జయదేవ్ కీ. శే. ఘంటసాల ప్రతిభ విశేషాలను వివరించారు. పురుషులలో ప్రథమబహుమతి శ్రీ యస్. సాయిబాబా, ద్వితీయ బహుమతి శ్రీ యం. ఆనందమురళి, కన్సొలేషన్ బహుమతి శ్రీ బి. ఉదయకుమార్, స్త్రీలలో ప్రథమ బహుమతి కుమారి యమ్. శ్రీమహాలక్ష్మి, ద్వితీయ బహుమతి దేవి యం. వి. లలితాసాగరి, కన్సొలేషన్ బహుమతి కుమారి కె. వి. యస్. పద్మజకు లభించాయి. ఈ కార్యక్రమం మధ్యలో మిమిక్రీ కళాకారుడు శ్రీ ఫల్వర్‌స్వార్ మిమిక్రీ చేసి, ప్రేక్షకులను ఆనందింపచేశారని ప్రెస్‌క్లబ్ కార్యదర్శి తెలుపుతున్నారు.

శ్రీ జైప్రకాశ్ నారాయణ్

జైప్రకాశ్‌నారాయణ్ రాజకీయ జీవిత చరిత్ర గ్రంథం మా కార్యాలయం చేరింది. అజిత్ భట్టాచార్యజీ మూలరచనకు తెలుగు అనువాదం చేసినది. ఈదుల బలరామరెడ్డి. 228 పుటల యీ గ్రంథం వెల పదిహేను రూపాయలు. ప్రతులకు నవజ్యోతి పబ్లికేషన్సు, ఏలూరురోడ్డు, విజయవాడ—2 కి రాయవచ్చును.

మార్క్సిస్టు లెనినిస్టు తత్వశాస్త్ర మౌలిక సూత్రాలు

పైన పేర్కొన్న గ్రంథంలోని మొదటిభాగం గతి తార్కిక భౌతిక వాదం, రెండవ గ్రంథం చారిత్రక భౌతికవాదం మా కార్యాలయం చేరాయి. అనువాదం శేఖర్. ప్రతులకు విజయవాడ విశాలాంధ్ర ప్రచురణాలయానికి రాయాలి. వెల మొదటి భాగం రూ. 6 లు. రెండోభాగం రూ. 8 లు.

యుగరశ్మి

కవితాసంపుటి. రచన : శ్రీ ఎస్. వెంకట రంగారెడ్డి. 40 పేజీలు, వెల : నాలుగురూపాయలు. ప్రతులకు : రచయిత పేర ఇం. నెం. 1—4—18, కొల్లాపూర్, మహబూబ్ నగర్ జిల్లా లేక శ్రీ ఎల్కూరి శివారెడ్డి, తెలుగు లెక్చరర్, నిజాం కళాశాల, హైదరాబాద్‌కి వ్రాయాలి.

అమృతమార్గము

ముముక్షువులకు యోగపరిశీలనా సక్తులకు ఉపయోగపడగల అమృతమార్గము అన్న 84 పేజీలు గల పుస్తకం మా కార్యాలయం చేరింది. రచన : శ్రీ మోక్షానందస్వామి. వెల : రు. 2–50 పైసలు. ప్రతులకు : జననీ అద్వైతాశ్రమము, శివన్నాపూర్ (పోస్టు), వయా మోర్తాడు, ఆరూర్ తాలూకా, నిజామాబాద్ జిల్లా. ●

ఉత్తరాలు

(6వ పేజీ తరువాయి)

24–2–78 పత్రికలో మరి, మీకెలా కనబడుతోంది లోకం అన్న రచన ఉత్తమం. రచయిత అభినందనీయుడు ఈ కథలో – ఏదో ఒక మోటివ్ లేని సంచితనం వుంటుందని నేనెప్పుడూ అనుకోలేదు — అన్న వాక్యం హైలైట్ ప్రస్తుత సమాజంలోని యువకులకు, విద్యావంతులకు ఇటువంటి రచనలు చక్కని మేల్కొలుపులు కథ ప్రచురించిన సంపాదకవర్గం పత్రిక గొప్పతనాన్ని ఇనుమడింపజేసింది....

హనుమంతు, రాజేశ్వరి, జగన్మోహిని, (కంచిలి)

*　　*　　*

మాటలురాని మనిషి పూర్తి కాని డైరీ చాలా బాగున్నాయి.

భోగిరెడ్డి రాజ్యలక్ష్మి (యనమదుర్రు)

*　　*　　*

వాణిశ్రీ ముఖ చిత్రముతో వెలువడిన పత్రిక(11—2—78) చాలా బాగుంది. కథల్లో అడవి — సముద్రం కథ చాలా చక్కగా ఉంది. రచయిత వర్ణనాత్మకత చాలా బాగుంది. పత్రికలో ముఖ్యంగా బాలుసువారి శీర్షిక చాలా చాలా బాగుంది. చిత్రమాటల్లో చక్కని సూక్తులు చెప్పారు మొత్తంమీద పత్రిక టాప్‌గా ఉంది.

మెందూరి యోగానంద్ (పెన్నాపురం.)

సీరియల్

సీరియల్ నాగమాలిక నాకు చాల బాగుంది. ఈ వారం అట్టమీద వున్న హిందీ నటి మీనాక్షి ఆనంద్ బొమ్మబాగు లేదని చెప్పుటకు చాల చింతిస్తున్నాము.

అన్నా ప్రగడ సాయికుమారి (విజయవాడ)

*　　*　　*


17—2—78న అట్టమీద బొమ్మ (వాణిశ్రీ) చాలా బాగున్నది. నాగ మాలిక సిరియల్ చాలా బాగా నడుస్తోంది. ప్రచురించిన మీకు, రచయిత్రి శ్రీమతి పొదపెద్ది పుణ్యశీలగార్కి నా ధన్యవాదాలు. అంతేకాక రామలక్ష్మిగారి జవాబులు పత్రికకే హైలైట్. బాలుసు వెంకట రమణయ్యగారి ధర్మపథం చాలా బాగుంటున్నది. నాకు తెలియని విషయాలు ఎన్నో తెలియచెప్తున్నారు. వారికి నా ధన్యవాదాలు. పత్రికలో కార్టూన్స్ చాలా బావుంటున్నాయి.

ఎం. విజయారాణి (విజయనగరం)





Printed and Published by S. NageswaraRao at the Andhra Patrika press, MallikarjunaRao Street, Gandhinagar, Vijayawada-3. Editor: S. Radhakrishna



ఈ రోజుల్లో తలనొప్పి అంటే మాటలా!

సాలోఫేన్‌ను వాడండి. అమోఘంగా నొప్పులను నివారించే విశిష్టమైన మాత్ర. వెల అతిచౌక

మంచి నొప్పుల నివారిణి సాలోఫేన్‌ను గమనించండి. దీనిలో రెండు మందులు అమోఘంగా నొప్పులను పోగొట్టేవి చేరివున్నాయి—ఆస్ప్రిన్, ఫెనాసిటిన్—అయినప్పటికీ వెల మాత్రము 7 పైసలే ఒక మాత్ర. సాలోఫేన్ అతిశీఘ్రంగా, తలనొప్పులకు జలుబులకు పండ్లనొప్పి, ఫ్లూ జ్వరాలకు కండలనొప్పులకు ఉపశమనం కల్గిస్తుంది.

సాలోఫేన్ నొప్పుల నివారిణి మాత్రలు—ఏళ్లతరబడి ఇంటింటా ప్రసిద్ధిపొందిన అమృతాంజన్ లిమిటెడ్ వారి తయారీ-

అమృతాంజన్ లిమిటెడ్‌వారి నమ్మకమైన తయారీ

సాలోఫేన్

SAA/AMS/2197 TEL



సారికా, రంగోలి, డివైన్ జ్యుయల్ మరియు అమెరికన్ టిస్యూ క్రేప్ జార్జెట్ చీరల కోసం మీ విమల్ రిటెయిల్ షాపులో అడగండి.